RNI No.TELTEL/2005/16755
# ప్రజాబలం
PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక
Website: prajabalam.in



27 ఫిబ్రవరి 2025 గురువారం | హైదరాబాద్ | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:20 | సంచిక:230

# విన్నపాలు వినవలె

## ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినతి





న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27,లఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యూనియన్ బడ్జెట్ లో రాష్ట్రానికి కావాల్సిన కీలకమైన ప్రాజెక్టులకు నిధుల కేటాయింపులు జరుగుతాయనుకున్నారు. కానీ.. ఎలాంటి ప్రత్యేక ప్రయోజనాలు కల్పించకపోవడంతో.. సీఎం రేవంత్ రెడ్డి తో పాటు మంత్రి శ్రీధర్‌బాబు ప్రధాని మోదీని నేరుగా కలుసుకున్నారు. హైదరాబాద్ మహానగరాన్ని అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దాలనే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా కేంద్రం సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. వివిధ అంశాలపై ప్రత్యేక వినతులు అందించిన రేవంత్ రెడ్డి.. నిధులు, అనుమతులు, కొత్త ప్రాజెక్టులపై ప్రధాని మోదీతో చర్చించారు. దిల్లీలోని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో ఆయన అధికారిక నివాసంలో సమావేశమైన సీఎం రేవంత్.. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత నిర్మించ తలపెట్టిన రెండో దశ మెట్రో నిర్మాణం గురించి ప్రధాని మోదీకి రేవంత్ రెడ్డి వివరించారు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి కావాల్సిన అనుమతులు మంజూరు చేయడంలో కేంద్రం జాప్యం చేస్తుండడంతో.. ఆ విషయాన్ని ప్రస్తావించిన రేవంత్ రెడ్డి త్వరితగతిన అనుమతులు వచ్చేలా చూడాలని కోరారు. హైదరాబాద్ మహా నగరంలో మెట్రో రైలు సౌకర్యం అన్ని ప్రాంతాలకు అందుబాటులోకి తీసురావడమే తమ ఉద్దేశమని వెల్లడించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లుగా హైదరాబాద్ నగరంలో మెట్రో విస్తరణపై దృష్టి సారించలేదని తెలిపిన సీఎం రేవంత్ రెడ్డి.. ఫేజ్-ఎఎ కింద రూ.24,269 కోట్ల అంచనా వ్యయంతో 76.4 కి.మీ పొడవైన అయిదు కారిడార్లను ప్రతిపాదించినట్లు ప్రధాని మోదీకి వివరించారు.రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఉత్తర భాగంలో ఇప్పటికే 90 శాతం భూ సేకరణ పూర్తయిందని.. ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగాన్ని వెంటనే మంజూరు చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కోరారు. ఉత్తర భాగంతో పాటే దక్షిణ భాగం పూర్తయితే ఆర్ఆర్ఆర్‌ను పూర్తిగా సద్వినియోగం చేసుకోగలమన్నారు. దక్షిణ భాగం భూ సేకరణకు అయ్యే వ్యయంలో 50 శాతం భరించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపిన సీఎం రేవంత్ రెడ్డి.. ప్రాజెక్టును వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని కోరారు.ఆర్ఆర్ఆర్‌కు సమాంతరంగా రీజినల్ రింగ్ రైలు ప్రాజెక్టు ప్రతిపాదన ఉందని పీఎం మోదీకి సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. ఈ రీజినల్ రింగ్ రైలు పూర్తయితే తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల్లోని రైలు మార్గాలతో కనెక్టవిటీ సులభమవుతుందని ప్రధానమంత్రి మోదీకి సీఎం రేవంత్ రెడ్డి తెలియజేశారు.. రీజినల్ రింగ్ రైలుకు అనుమతి ఇవ్వాలని కోరారు. సముద్ర మార్గం లేని తెలంగాణకు వస్తువుల ఎగుమతులు, దిగుమతులు సులువుగా చేసేందుకు రీజినల్ రింగు రోడ్డు సమీపంలో డ్రైపోర్ట్ అవసరమని, ఆ డ్రైపోర్ట్ నుంచి ఏపీలోని సముద్ర పోర్ట్ లను కలిపేందుకు గ్రీన్ ఫీల్డ్ రోడ్డు తో పాటు రోడ్డును ఆనుకొని రైలు మార్గం మంజూరు చేయాలని ప్రధానమంత్రి మోదీకి విన్నవించారు.తెలంగాణ సంస్కృతి, ఆధ్యాత్మికత మూసీ నదితో ముడిపడి ఉందని? రాజధాని హైదరాబాద్ నగరం మధ్యగా మూసీ ప్రవహిస్తోందని పీఎంకు వివరించారు. రాష్ట్రంతో అంతటి ప్రాధాన్యం ఉన్న మూసీ పునరుజ్జీవనానికి సహకరించాలని ప్రధానిని కోరారు. ఈసా, మూసా నదుల సంగమంలో ఉన్న బాపూ ఘాట్ అభివృద్ధి, మూసీ ప్రక్షాళనకు 27 ఎస్టీపీల నిర్మాణం, మూసీ రిటైనింగ్ వాల్స్, కరకట్టల నిర్మాణం, మూసీ గోదావరి నదుల అనసంధానంతో కలిపి మొత్తంగా ప్రాజెక్టుకు రూ.20 వేల కోట్లు ఆర్థిక సహాయం అందజేయాలని ప్రధానమంత్రికి వినతి పత్రాన్ని అందించారు. గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ కు 222.7 ఎకరాల రక్షణ భూముల బదిలీకి సహకరించాలని పీఎంకు ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు.

రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణకు 61 ఐపీఎస్ కేడర్ పోస్టులు వచ్చాయని, 2015లో రివ్యూ తర్వాత మరో 15 పోస్టులు అదనంగా వచ్చాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. సైబర్ నేరాలు, డ్రగ్స్ కేసులు పెరగడం, రాష్ట్రంలో పెరిగిన పట్టణాలు, ఇతర అవసరాల దృష్ట్యా తెలంగాణకు అదనంగా 29 ఐపీఎస్ పోస్టులు మంజూరు చేయాలని పీఎం మోదీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. సెమీ కండక్టర్ల పరిశ్రమ ఏర్పాటుకు అనువైన పరిస్థితులు తెలంగాణలో ఉన్నందున ఇండియా సెమీ కండక్టర్ మిషన్ ప్రాజెక్టును రాష్ట్రంలో ఏర్పాటు చేసేందుకు అనమతించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు.

# వైభవంగా వేములవాడ మహాశివరాత్రి జాతర

**భక్తులకు ఇబ్బందులు లేకుండా ప్రతిష్ట చర్యలు ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ముస్తాబైన ఆలయం ఎప్పటికప్పుడు పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ, ప్రభుత్వ విప్**



**వేములవాడ, 25 ఫిబ్రవరి, 2025 (ప్రజాబలం)**దక్షిణకాశీ క్షేత్రం, వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి జాతర సందర్భంగా ప్రభుత్వ యంత్రాంగం సామాన్య భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నామని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పేర్కొన్నారు. బుధవారం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానాన్ని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్ లు మహాశివరాత్రి జాతర సందర్భంగా చేపట్టిన ఏర్పాట్లను క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఆలయ అధికారులు పలు సూచనలు చేశారు. క్యూ లైన్లు, కోడె మొక్కు లైన్, ధర్మగుండం, ప్రధాన ద్వారం, ప్రసాదం తయారీ కేంద్రాన్ని, అంబేద్కర్ కూడలిని పరిశీలించారు. ఎక్కువ సంఖ్యలో భక్తులు రావడంతో క్షేత్ర స్థాయిలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ శాఖ తరపున పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. పార్కింగ్ కు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నామని వివరించారు.

వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ క్షేత్రస్థాయిలో మహా జాతరను ఎప్పటికప్పుడు పరిశీలించి అధికారులకు ఆదేశించారు, క్యూలైన్లో వెళ్లే భక్తులకు ఫ్రూట్స్, బిస్కెట్స్ ,వాటర్, మజ్జిగ ప్యాకెట్లు, అందిస్తున్నారని ఆయన అన్నారు భక్తులు అధిక సంఖ్యలో ధర్మగుండంలో స్నానాలు ఆచరించి శ్రీ రాజరాజేశ్వరి దర్శించుకున్నారు భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఎప్పటికప్పుడు అధికారులు పరిశీలిస్తున్నారు. భక్తులకు ఆరోగ్యపరమైన సమస్యలు వచ్చినచో మెడికల్ క్యాంపు లను , ఫ్రీ ఆయుర్వేదిక్ మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేశారు .ఇటు భక్తులకు అటు ప్రజాప్రతినిధులకు ఇబ్బంది కలగకుండా ప్రత్యేక క్యూ లైన్ లను ఏర్పాటు చేశారు పారిశుధ్య కార్మికులు ఎప్పటికప్పుడు ఆలయ ప్రాంతాలను శుభ్రం చేస్తూ ఆలయాన్ని శుభ్రంగా ఉంచారు. మహాశివరాత్రి పురస్కరించుకొని ఎమ్మెల్సీ కవిత, గంగుల కమలాకర్, ముఖ్య నాయకులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు

## మేళ్లచెరువులో మంత్రి ఉత్తం దంపతుల పూజలు

వార్తా 3 లో

## తిరుమల తిరుపతి దేవస్థానం తరఫున రాజన్న స్వామికి పట్టు వస్త్రాల సమర్పణ...!!



**రాజన్న సిరిసిల్ల ప్రజాబలం ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్రంలోని రాజన్న సిరిసిల్ల జిల్లాలో దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారికి మహాశివరాత్రి సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) తరఫున పట్టు వస్త్రాలను సమర్పించారు.

తిరుమల తిరుపతి దేవస్థానం డిప్యూటీ ఈఓ లోకనాథంపాల్గొని, స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. ఆలయ ఈవో వినోద్ , అర్చకులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం, స్వామివారికి పట్టు వస్త్ర సమర్పణ అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చక స్వాములు మహాశివరాత్రి సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం తరఫున అందించిన ఈ మహద్భాగ్యానికి కృతజ్ఞతలు తెలిపారు.అదే విధంగా, శృంగేరి శారదా పీఠం తరఫున రాధాకృష్ణ శర్మ స్వామివారికి పట్టు వస్త్రాలతో పాటు రుద్రాక్ష మాలను సమర్పించారు. ఆలయ ఈవో వినోద్ , అర్చకులు ఆయనను స్వాగతించి, స్వామివారి సేవలో పాల్గొనడానికి అవకాశం కల్పించారు.

ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. మహాశివరాత్రి వేడుకలు వైభవంగా కొనసాగుతున్నాయి. స్వామివారి కృపతో భక్తులకు అభీష్ట సిద్ధి కలగాలని అర్చకులు ఆశీర్వదించారు.

## దుర్గ భవాని మాతకు పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ.

వార్తా 2 లో









# దేశాభివృద్ధిలో ప్రభుత్వేతర సంస్థల భాగస్వామ్యం

సామాజిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న లాభాపేక్ష లేని నిస్వార్థ స్వచ్ఛంద పౌర సమూహాలను “ప్రభుత్వేతర సంస్థలు” లేదా “నాన్-గవర్నమెంటల్ ఆర్గనైజేషన్స్ (ఎన్జీవోస్)” అని పిలుస్తారు. సమాజాన్ని పట్టి పీడిస్తున్న పేదరికం, అసమానతలు, పరివారం కాలుష్యం, మానవీయ సమస్యలకు తగు పరిష్కారాలు చూపడానికి, సమాజాభివృద్ధి, సానుకూల మార్పులకు కృషి చేయడం, మానవ హక్కుల పరిరక్షణ, ఎన్జీవోలను సముచితంగా గౌరవించుకోవడం, ప్రభుత్వేతర సంస్థలు ప్రపంచవ్యాప్తంగా నిరంతరం కృషి చేస్తున్నాయి. మెరుగైన పౌరసమాజ నిర్మాణానికి ఎన్జీవోలు చేస్తున్న కృషిని ఏకరువు పెట్టడానికి, వాటి పట్ల ప్రజలకు అవగాహన కల్పించడానికి సామాజిక కార్యకర్త “మార్కస్ లియర్స్ స్కద్మనిస్” నేతృత్వంలో 2009 నుంచి ప్రతి ఏట 27 ఫిబ్రవరి రోజున “ప్రపంచ ప్రభుత్వేతర సంస్థల దినోత్సవం” వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ప్రతి వ్యక్తి తమకు తోచినట్లుగా విరాళాలు, శ్రమదానాలు, నిధులు సమకూర్చుకునే కార్యకలాపాలు, చేయడానికి స్వచ్ఛందంగా ముందుకు రావాలని ఈ వేదిక కోరుకుంటున్నది. ప్రపంచ ఎన్జీవోల దినోత్సవం-2025 ఇతివృత్తంగా “సుస్థిర భవితకు స్థానిక ఉద్యమాల సాధికారత” అనే అంశాన్ని తీసుకొని ప్రచారాలు నిర్వహించడం జరుగుతున్నది. ఈ రోజున ఎన్జీవోల ప్రాధాన్యాన్ని వివరించాడానికి, ప్రోత్సహించడానికి తగు సదస్సులు, వెబినార్స్, కార్యశాలలు, శిక్షణ కార్యక్రమాలు, అవార్డుల ప్రదానాలు, క్షేత్రస్థాయి కార్యక్రమాలు, సంఘటిత కార్యక్రమాలు, పాలసీ వివరణలు, నిధుల సేకరణలు, సామాజిక మాధ్యమాల్లో ప్రచారాలు లాంటివి నిర్వహించవచ్చు. నేటి ప్రజా సమస్యల సకారాత్మక పరిష్కారానికి ప్రభుత్వాలు చేస్తున్న కృషితో పాటు ప్రభుత్వేతర సంస్థల సహాయ సహకారాలు కూడా దోహదపడుతున్నాయి. ఆర్య సమాజ్, నేషనల్ కౌన్సిల్ ఫర్ వూమన్, సంకల్ప్ తరు ఫౌండేషన్ లాంటి స్వచ్ఛంద సంస్థల రాకతో భారత్‌లో ఎన్జీవోల ఉద్యమాలు ఊపందుకున్నాయి. గ్రామీణాభివృద్ధి, మహిళా సాధికారత, బాలల సంక్షేమం, ప్రజారోగ్యం, విపత్తుల నిర్వహణ, మానవ హక్కుల పరిరక్షణ, పర్యావరణ పరిరక్షణ లాంటి సమస్యలను ఎన్జీవోలు పరిష్కరించడానికి ప్రయత్నాలు చేయడం కొనసాగుతున్నది. నిధుల కొరత, సుస్థిరత, జవాబుదారీతనం, ప్రభుత్వ నిర్లక్ష్యం లాంటి సవాళ్లను ఎదుర్కొంటున్న ఎన్జీవోల ఉద్యమాలు కొనసాగుతున్నాయి. గివ్ ఇండియా, స్మైల్ ఫౌండేషన్, గూంజ్, హెల్పేజ్ ఇండియా, ఆక్షన్‌ఏయిడ్, చైల్డ్‌లైన్ ఇండియా ఫౌండేషన్ లాంటి ప్రముఖ ఎన్జీవోలు భారత దేశాభివృద్ధికి నిస్వార్థంగా సేవలు అందిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 10 మిలియన్ల ఎన్జీవోల ద్వారా 50 మిలియన్ల స్వచ్ఛంద కార్యకర్తలు సేవలు అందిస్తున్నారు. ఇలాంటి ఎన్జీవో సంస్థలతో మనం కూడా కలిసి నిర్భాగ్యుల ముఖాల్లో ఆనంద భాష్యాలను చూద్దాం, బాధలే లేని భారతిని నిర్మిద్దాం.

# బ్రిటీష్ పాలకులకు సింహ స్వప్నం

భారత స్వాతంత్ర ఉద్యమంలో దేశమాత విముక్తి కోసం సాయుధ పోరాటం చేసి అమరుడైన వీరుడు చంద్రశేఖర్ ఆజాద్. భగత్ సింగ్, రాజగురు, సుఖదేవ్, పండిత్ రామ్ ప్రసాద్ బిస్మిల్, ఠాకూర్ రోషన్ సింగ్, ప్రేమ్ కిషన్ ఖన్నా, అష్ఫాకుల్లా ఖాన్‌ల సహచరుడిగా బ్రిటీషువారి గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన ఆజాద్ గర్వించదగ్గ అసహాయ శూరుడు, అసమాన వీరుడు. భగత్ సింగ్ మార్గ నిర్దేశకుడిగా పేరుగాంచిన ఆజాద్ పూర్తిపేరు చంద్రశేఖర సీతారామ్ తివారి. ఆయన “పండిత్‌జీ”గా కూడా పిలువ బడ్డాడు. 1857 తరువాత సాయుధ పోరాటం చేసిన వీరుల్లో మొట్టమొదటి వాడు, దేశ ప్రజల రక్షణ కోసం ధర్మ యుద్ధమే సరైనది గట్టిగా నమ్మినవాడు ఆజాద్. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఝూబువా జిల్లా, బాబ్రా గ్రామంలో పండిట్ సీతారామ్ తివారి, జగరానీ దేవీలకు 1906 జూలై 23వ తేదీన చంద్రశేఖర్ ఆజాద్ జన్మించాడు. ప్రాథమిక విద్యను సొంత గ్రామం లోనే పూర్తి చేసి, తర్వాత వారణాసిలో సంస్కృత పాఠశాలలో హయ్యర్ సెకండరీ విద్యను అభ్యసించాడు. ఆయన చిన్నప్పటి నుంచి హనుమాన్ భక్తుడిగా ఉండేవాడు. 1919 లో అమృత్‌సర్‌లో జరిగిన జలియన్ వాలాబాగ్ దుర్ఘటనతో తీవ్రంగా కలత చెందిన ఆజాద్.. ఆ తరువాత 1921లో మహాత్మా గాంధీ నడిపిన సహాయ నిరాకరణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నాడు. ఈ ఉద్యమంలో పాల్గొన్న నేరానికి తన పదిహేనేళ్ల ప్రాయంలోనే అరెస్టయ్యాడు. విచారణ సందర్భంగా కోర్టులో ఆయనను విచారిస్తున్న బ్రిటిష్ న్యాయాధికారి ఖరేఘాట్‌కు ఆ బాలుడిచ్చిన సమాధానంతో మతి పోయింది. వాస్తవానికి తన పేరు ‘ఆజాద్’ అని, తన తండ్రి పేరును ‘స్వతంత్రం’, తన నివాసం ‘జైలు’ అని చెప్పాడు. “మతిపోయిన ఆ న్యాయాధికారి చిదిమితే పాలుగారే ముఖారవిందు డైన ఆ బాలుడిని చూస్తూ కూడా అధికార దర్పంతో ‘15 కొరడాల దెబ్బల’ శిక్ష ప్రకటించాడు. నరరూప రాక్షసులు కొరడా ఝుళిపిస్తూ ఒక్కొక్క దెబ్బ కొడుతుంటే.. ఆ బాలుని శరీరమంతా రక్తసిక్తమై పోయింది. అయినా ఆ బాలుడు దెబ్బ పడినపుడు వందేమాతరం, భారత్‌మాతాకీ జై అంటున్నాడు. ఈ ధైర్యం చాలా గుర్తింపు తెచ్చిపెట్టింది. ఆ రోజు నుండి ఆయన పేరు ‘చంద్ర శేఖర్ ఆజాద్’ గా మారింది. “సహాయ నిరాకరణోద్యమం ఆజాద్‌లో దాగి ఉన్న విప్లవ వాదిని మేల్కొలిపింది. ఎలాగైనా సరే భారత దేశాన్ని బ్రిటీష్‌వారి కబంధ హస్తాల నుంచి విడిపించాల్సిందే నని ఆయన బలంగా నిశ్చయించు కున్నాడు. అనుకున్నదే తడవుగా ఆయన హిందూస్థాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్‌ను స్థాపించాడు. భగత్ సింగ్, సుఖదేవ్, తదితరులకు మార్గ నిర్దేశకుడిగా మారి పోయాడు. ఆజాద్... 1926లో కకోరీ ట్రైన్ దోపిడీ, అదే సంవత్సరంలో వైశ్రాయి రైలును కాల్చి వేయడం, లాలా లజపతి రాయ్ మరణానికి కారణమైన బ్రిటిష్ వారిపై పగతీర్చు కోవడానికి 1928వ సంవత్సరంలో లాహోర్‌లో జె.పి. సాండర్స్‌ను కాల్చి వేయడం తదితర హింసాత్మక కార్యక్రమాల్లో పాలు పంచు కున్నాడు. ఒకానొక దశలో ఆజాద్ బ్రిటీష్ పోలీసులకు సింహస్వప్నంలా నిలిచారు. పోలీసుల హిట్‌లిస్ట్‌ను తయారు చేసుకున్న ఆయన వారిని చంపేదాకా వదిలి పెట్టలేదు. పదిహేనేళ్ల ప్రాయంలో అరెస్టయిన తరువాత బయటికి వచ్చి పోరాటంలో పాలు పంచుకున్న ఆజాద్... ఆ తరువాత తన మరణం దాకా కూడా ఒక్కసారి కూడా పోలీసులకు చిక్కలేదు. 1931, ఫిబ్రవరి 27వ తేదీన తన ఇద్దరు సహచరులను కలిసేందుకు అలహాబాదు లోని ఆల్ఫ్రెడ్ పార్క్‌కు చేరుకోగా, ఇన్ఫార్మర్లు ఇచ్చిన సమాచారం మేరకు బ్రిటీష్ పోలీసులు చుట్టు ముట్టారు. ఆజాద్‌ను లొంగి పోవాలంటూ హెచ్చరికలు చేశారు. అయినా కూడా మొక్కవోని ధైర్యంతో పోలీసులకు ఎదురు తిరిగాడు. వెంబడిస్తున్న పోలీసుల్లో ముగ్గురిని కాల్చి చంపాడు. ఐనా తరుముతూ వస్తున్న పోలీసులకు చిక్కే పరిస్థితి వచ్చింది. ఇక తుపాకీలో ఒకే ఒక్క బుల్లెట్ వుంది. దానితో వాళ్లను మట్టుబెట్ట లేనని తెలుసుకుని, బ్రిటిష్ వారి చేతిలో చనిపోవడం కంటే తనకు తానే ఆత్మత్యాగం చేసుకోవాలను కున్నాడు. వెంటనే తుపాకీని తన తలకు గురిపెట్టి కాల్చుకుని అమరడయ్యాడు. “నీలో ఉన్నది ఉప్పునీరా? అయితే నీకోసమే బతుకు. కాదూ ఉడుకు రక్తమంటావా? అయితే దేశం కోసం మరణించు. నీ దేహం నిప్పుకణాల కొలిమి అయితే అనుక్షణం నీ ప్రాణాన్ని సంఘానికి సమర్పించు. నీ గుండెకాయ పత్తికాయ అయితే భరత మాతను మరిచిపోయి నీ సుఖమే చూసుకో” - ఇలా రోమాలు నిక్కబొడుచు కునేలా పలికిన వీరుడు చంద్రశేఖర్ ఆజాద్. బతికుండగా బ్రిటీష్ వారు నన్ను పట్టుకోలేరు. వాళ్ళకు అంత దమ్ము లేదు. అని పదే పదే ఆజాద్ అంటుండే వాడు. “నా చావు నా చేతుల్లోనే ఉంది, శత్రువుల చేతుల్లో చావను” అంటూ చిన్ననాడు చేసిన శపథం నిజంచేస్తూ, పోలీసులకు చిక్కక, పిస్తోలుతో పేల్చుకుని స్వతంత్ర జీవిగా అస్తమించాడు. అజాద్ పోరాడిన తీరు భారతదేశ స్వాతంత్ర చరిత్రకే వన్నె తెచ్చిన ఘటన. భారతీయ యువతకు ఒక మహోజ్వల ప్రేరణ, అసమాన ఉదాహరణ. చివరిదాకా ఆజాద్‌ను ప్రాణాలతో పట్టుకోవాలని భావించిన బ్రిటీష్ పోలీసులు సాధ్యంకాక... ఆయన మృత దేహాన్ని స్వాధీనం చేసుకోవాల్సి వచ్చింది. ఆజాద్ ఆత్మత్యాగం ప్రజల్లో మరింత పట్టుదలను పెంచి, దేశభక్తిని రగిల్చింది. పోరాట పథం పట్టేలా ప్రోత్సహించింది. ఆజాద్ మరణించిన అలహాబాదు లోని ప్రయాగ్‌రాజ్ పార్కుకు చంద్రశేఖర్ ఆజాద్ పార్కుగా నామకరణం చేయ బడింది. మరణించే సమయంలో ‘ఆజాద్’ వద్ద ఉన్న పిస్టల్ అలహాబాద్ మ్యూజియంలో ప్రదర్శించ బడింది. 1988లో భారత ప్రభుత్వం చంద్రశేఖర్ ఆజాద్ ముఖచిత్రంతో తపాలా బిళ్ళను విడుదల చేసింది. 1965లో షహీద్ సినిమాతో ప్రారంభించి పలు భాషలలో ఎన్నో సినిమాలు నిర్మించ బడ్డాయి. 2018లో టెలివిజన్ సీరీస్ తీయబడింది. చంద్రశేఖర్ ఆజాద్ జన్మించిన మధ్య ప్రదేశ్‌లోని భబ్రా (భవ్రా) గ్రామం చంద్రశేఖర్ ఆజాద్ నగర్‌గా పిలవడం జరుగుతోంది.

# బిసిల చాంపియన్ శివశంకర్

తామే వెనకబడిన తరగతుల వారికి నాయకులమని, తోటి వారి అభ్యున్నతే తమ ఏకైక లక్ష్యమని చాలా మంది వకాలతా పుచ్చుకుని, ఎన్నికల్లో, లేదా పదవులు పొందడంలో బిసి కార్డులను ఉపయోగించుకుని, తీరా పదవులు పొందాక, లక్ష్యాన్ని నిర్లక్ష్యం చేయడం సర్వసాధారణం. కానీ అలాకాక తాము పొందిన పదవుల ద్వారా బిసిల అభివృద్ధికి పాటుపడిన వారు బహు అరుదుగా కనిపిస్తారు. అలా బీసీల అభివృద్ధికి తోడ్పడిన వాళ్లలో పుంజాల శివ శంకర్ గారు మొదటి వరుసలో ఉంటారు.కింది స్థాయి నుంచి ఎదిగి నాయకులూ అయ్యే వారు చాల మంది ఉంటారు, కాని ఒక బలహీన వర్గాల కుటుంబంలో అది కూడా ఒక పేద కుటుంబంలో పుట్టి దేశ రాజకీయలను ఒక దశాబ్దం పాటు శాసించే స్థాయికి ఎదగటం, అది కూడా ఇందిరా గాంధీ లాంటి శక్తిశాలికి కుడి భుజంలాగా ఉండటం, ఇందిర, రాజీవ్ అధికార నివాసాలకు పక్కనే ఎప్పటికీ ఇల్లు ఉండటం ఒక్క శివశంకర్ కే సాధ్యమైంది. బలహీన వర్గాల నాయకుడిగా పేరున్న శివశంకర్ తెలంగాణ మూన్నూరు కాపు కులానికి చెందిన నాయకుడు. 1929, ఆగస్టు 10న హైదరాబాద్ సమీపంలో ని మామిడి పల్లిలో ఆయన జన్మించారు. శివశంకర్ మెట్రిక్యులేషన్ వరకు హైదరాబాద్ లో చదివి ఆ తర్వాత చదువుకు ఇంట్లో ఇబ్బందులు ఏర్పడడముతో తన అన్నతో కలిసి పంజాబ్ కు వెళ్లి, కూలి పనులు చేస్తూ కొన్ని సందర్భాలలో తిండిలేక మజ్జిగ తాగుతూ, పల్లీలు తింటూ చదువుకుంటూ అమృత్ సర్ హిందూ కాలేజీ నుండి బీ.ఏ.పూర్తి చేశారు. తర్వాత ఉస్మానియా యూనివర్శిటీ నుంచి ఎల్ ఎల్ బి పూర్తి చేశారు. న్యాయ శాస్త్రాల్లో, ఇంగ్లీష్ భాషలో మంచి పట్టుగల శివశంకర్ హైదరాబాద్ లో న్యాయవాదిగా ప్రాక్టీసును ప్రారంభించి పేదల బడుగు బలహీన వర్గాల కేసులను ఉచితంగా కోర్టులలో వాదించేవారు. మంచి సమర్థుడైన న్యాయవాదిగా పేరు తెచ్చుకొని సిటీ సివిల్ కోర్ట్ బార్ అసోసియేషన్ కార్యదర్శిగా, 1956లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడిగా పని చేశారు. 1972లో ఆంధ్రప్రదేశ్ లో వెనుకబడిన తరగతులకు 25 శాతం రిజర్వేషన్లు కల్పించారు. ఆ తర్వాత అనంతరామన్ కమిషన్ ప్రభుత్వానికి సూచనలు చేస్తూ బీసీ కులాలకు 30% రిజర్వేషన్లు ప్రతిపాదించింది. దీనిపై ఏపీ హైకోర్టులో 110 రిట్ పిటిషన్లు దాఖలయ్యాయి, అప్పుడు బీసీలకు 30% రిజర్వేషన్లు చెల్లవని హైకోర్టు తీర్పునివ్వగా... నాటి జేఏసి తరపున శివశంకర్ సొంత ఖర్చుతో 18 నెలలు ఢిల్లీలో ఉండి సుప్రీం కోర్టులో బీసీ రిజర్వేషన్లను గెలిపించుకొని తిరిగి వచ్చారు. 1974 నాటికి చిన్న వయసులోనే ఆంధ్రప్రదేశ్ హై కోర్ట్ జడ్జిస్థాయికి ఎదిగారు. ఆంధ్రప్రదేశ్ లోని న్యాయ వ్యవస్థలో ఒకే కులానికి చెందినవారు ఆధిపత్యం వహిస్తూ సీనియారిటి ప్యానల్ లో మిగతా వారిని పరిగణన లోకి తీసుకోక పోవడం గమనించి తను ప్రభుత్వ న్యాయమూర్తి పరిధిలో పేదల బడుగు బలహీన వర్గాల తరపున పోరాటం చేయలేక పోతున్నానని ఏకంగా ఉద్యోగానికి రాజీనామా చేశారు. చదువు కోవడమంటే ప్రభుత్వ ఉద్యోగం సాధించడము సమాజాన్ని పట్టించు కోకుండా వ్యక్తిగత ఎదుగుదలే ముఖ్యంగా భావించే నేటి తరానికి సమాజం కోసం హై కోర్ట్ జడ్జి స్థాయి ఉద్యోగాన్ని వదులుకోవడము ఆయన చిత్తశుద్ధికి, త్యాగ నిరతికి నిదర్శనం. హై కోర్టు జడ్జిగా రాజీనామా చేసి హైకోర్టు, సుప్రీం కోర్టులల్లో న్యాయ వాదిగా ప్రాక్టీసు చేస్తూ అన్ని వర్గాలకి సామాజిక న్యాయం విషయములో అధ్యయనం చేస్తుండే వారు. ఆయన మొదటి సారి గా 1977 లో ఇందిరాగాంధీని కలుసుకున్నా తమ అపార న్యాయ విజ్ఞానంతో ఆమె మనసు చూరగొనడమే కాకుండా అతితక్కువ కాలంలో ఆమెకు అత్యంత సన్నిహితుడయ్యారు. 1974-75లో ఆంధ్రప్రదేశ్ హైకోర్ట్ న్యాయమూర్తిగా ఉన్నారు. 1977 లో ఎమర్జెన్సీ తర్వాత ఆయన ఇందిగా గాంధీకి న్యాయవాదిగా కూడా ఉన్నారు. 1979లో సికిందరాబాద్ నుంచి లోక్ సభకు ఎన్నికయ్యారు. ఆ నియోజకవర్గం నుంచి 1980 లో రెండో సారి ఎన్నికయ్యారు. 1981లో ఇందిరాగాంది మంత్రివర్గంలో చాలా కీలకమయిన నాయకుడిగా ఉన్నారు. 1985లో శివశంకర్ రాజ్యసభకు ఎన్నికయ్యారు. 1993 దాకా రాజ్యసభలోనే కొనసాగారు. ఈ మధ్యలో ఆయన విదేశీ వ్యవహారాల శాఖ, మానవ వనరుల శాఖ మంత్రిగా పనిచేశారు. కొద్ది రోజులు ప్లానింగ్ కమిషన్ డిప్యూటీ చైర్మన్ గా కూడా పనిచేశారు. 1988-89 లో రాజ్యసభ కాంగ్రెస్ పక్ష నాయకుడి గా ఉన్నారు. తర్వాత సిక్కిం, కేరళ వర్నర్ గా నియమితులయ్యారు. 1998లో తెనాలి నుంచి లోక్ సభ కు పోటీచేసి గెలుపొందారు. ప్రధాని నివాసానికి దగ్గరలో 5, సఫ్దర్ జంగ్ లేన్ బంగళాను ఆయన కేటాయించారు. ఇంధన శాఖను నిర్వహించిన సమయంలో, రాజకీయ జోక్యం లేకుండా, పెట్రోలు బంకులు, గ్యాస్ ఏజెన్సీల కేటాయింపులను క్రమబద్ధీకరించారు. మానవ వనరుల శాఖ మంత్రిగా కేంద్రీయ విద్యాలయాల విస్తరణకు కృషి చేశారు. ఇందిరాగాంధి మరణానంతరం రాజీవ్ గాంధీ ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావడానికి ముఖ్య పాత్ర పోషించిన శివశంకర్ మెదక్ (గతములో ఇందిరాగాంధి గెలిచిన స్థానం) నుండి లోక్ సభకు పోటీ చేసి స్వల్ప తేడాతో ఓడిపోవడముతో 1985 నుండి 1993 వరకు గుజరాత్ నుండి రాజ్యసభకు ఎన్నికై కేంద్ర వాణిజ్య శాఖామంత్రిగా 1985 లో ,1986 లో విదేశాంగ వ్యవహారాల మంత్రిత్వ శాఖనూ నిర్వహించారు. ఏ సభలో సభ్యత్వం లేని రోజులలో కూడా ఆయనకు ప్రధాని నివాసంతో విడదీయని సంబంధాలు ఉండేవి. అందుకే సఫ్దర్ జంగ్ లేన్ నివాసం చాలాకాలం కొనసాగింది. ఇందిర, రాజీవ్ కాలంలో అన్ని కీలకమయిన పార్టీ, ప్రభుత్వ నిర్ణయాలలో ఆయన పాత్ర వుండేది. రాజీవ్ హాయంలో చాలా కీలకమయిన నిర్ణయాలెన్నో తీసుకున్నా సరే ఆయన పనితీరు ఎపుడూ వివాదాస్పదం కాలేదు. ఆయన కూడా ఎపుడూ వార్తలక్కే ప్రయత్నం చేయలేదు. రాజీవ్ దూతగా ఆయన నేపాల్, బంగ్లాదేశ్ లను సందర్శించి ఇరుగు పొరుగు దేశాలతో సత్సంబంధాలు నెలకొల్పడంలో ప్రధానికి బాగా సహకరించే వారని ఆయన మిత్రులు చెబుతారు. పంజాబ్ ఒప్పందంలో కూడా శివశంకర్ కీలక ప్రాత పోషించారని చెబుతారు. కాంగ్రెస్ లో సరైన గుర్తింపు లేక, స్వార్థ రాజకీయాలకు తట్టుకోలేక 2004 లో ఆయన కాంగ్రెస్ ను వదిలేశారు. 2017 ఫిబ్రవరి 27న ఆయన మరణించారు. శివశంకర్ జీవితాంతం అంబేద్కర్ , పూలే ఆదర్శంగా, ఆ మహా నాయకుల కాన్సెప్ట్ మీద పని చేశారు. జ్యుడీషియల్ తో సహ అన్నీ రంగాల్లో దళితులకు ప్రాతినిధ్యం ఉండాలని శివశంకర్ కోరుకునే వారు.ఇందిరా గాంధీ పక్షాన కేసులను వాదించి, ఆమెకు అత్యంత సన్నిహితులుగా ఉండేవారు. రాజీవ్ గాంధీ హాయంలో ప్రభుత్వంలో ప్రధాని తర్వాత చాలా పలుకుబడి ఉన్న వ్యక్తి శివశంకరే. నేడు, పి శివ శంకర్ ప్రధానమంత్రి తర్వాత దేశములో అత్యంత శక్తివంతమ్కైన వ్యక్తి” 1986 నాటికి ఇండియా టుడే పత్రిక రాసిన కథనాని బట్టి శివశంకర్ పలుకుబడి ఏ పాటిదో చెప్పకనే చెపుతుంది.

# ఆ రెండు పథకాలకు గ్రీన్ సిగ్నల్

విజయవాడ, ఫిబ్రవరి 26 ఏపీ ప్రజలకు మంత్రి నారా లోకేష్ గుడ్ న్యూస్ చెప్పారు. ఏకంగా రెండు పథకాలను అమలు చేసే విషయంపై నారా లోకేష్ శాసనమండలిలో ప్రకటించడం విశేషం. ఎప్పుడెప్పుడా అంటూ ఏపీ ప్రజలు సూపర్ సిక్స్ పథకాల కోసం ఎదురుచూపులు చూస్తున్న సమయంలో, నారా లోకేష్ చేసిన ప్రకటన పెద్ద ఊరట నిచ్చిందని చెప్పవచ్చు. ఇప్పటికే సూపర్ సిక్స్ హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం చెందిందని, వైసీపీ విమర్శలు గుప్పిస్తున్న తరుణంలో లోకేష్ ప్రకటనతో ఆ విమర్శలకు ఫుల్ స్టాప్ పడినట్లే.ఏపీలో కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసే హామీని గుప్పించి అధికారంలోకి వచ్చిన విషయం తెలిసిందే. అయితే దీపం పథకం 2.నీ మినహాయించి మరే పథకం ప్రారంభం కాకపోవడంతో ప్రజలు సైతం ప్రభుత్వ ప్రకటనల కోసం ఎదురుచూపులు చూస్తున్న పరిస్థితి. అయితే ప్రభుత్వం ఏర్పడిన ఉంటేనే వరదలు రావడంతో, ప్రభుత్వ నష్టపోయిన రైతులను ఆదుకుంది. అంతేకాదు గ్రామీణ ప్రాంతాలలో రహదారులను అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక నిధులు కేటాయించి, గుంతలు లేని రాష్ట్రంగా గుర్తించబడేందుకు తీవ్రంగా కృషి చేస్తోంది.ఓ దశలో సీఎం చంద్రబాబు సైతం గత ప్రభుత్వం చేసిన అరాచకంతో ప్రజలకు త్వరగా సూపర్ సిక్స్ పథకాలను అందించలేక పోతున్నామని నిట్టూర్చారు. అలాగే ఎట్టి పరిస్థితుల్లో తాము ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని సీఎం చంద్రబాబు నాయుడు హామీ సైతం ఇచ్చారు. ఇటువంటి సమయంలో వైసీపీ, కాంగ్రెస్ పార్టీ లు సూపర్ సిక్స్ ఎక్కడ అంటూ సోషల్ మీడియాలో కూటమి ప్రభుత్వాన్ని ఇరకాటం పెట్టే ప్రయత్నాలకు పూనుకున్నాయి. అందుకే శాసనమండలిలో మంత్రి నారా లోకేష్ సూపర్ సిక్స్ పథకాలపై మంగళవారం కీలక ప్రకటన చేశారు.తల్లికి వందనం పథకం ద్వారా ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ. 15 వేలు అందించనున్నట్లు, అలాగే రైతన్నలకు అండగా నిలిచేందుకు అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేసి ఏడాదికి రూ. 20 వేలు అందించేందుకు ప్రభుత్వం సిద్ధమైందంటూ లోకేష్ ప్రకటించారు. ఈ రెండు పథకాలను ఏప్రిల్, మే నెలలో ప్రారంభిస్తామని, అర్హత గల ప్రతి లబ్ధిదారునికి ప్రయోజనం చేకూరుస్తామన్నారు. ఓ వైపు అభివృద్ధి, మరోవైపు ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వం పాలన సాగిస్తుందని, ప్రజలకు మేలు చేకూర్చేందుకు ప్రభుత్వం వెనుకడుగు వేసే ప్రసక్తే లేదని లోకేష్ అన్నారు.గత ప్రభుత్వం పింఛన్ నగదు పెంపుపై దోబూచులాడిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన మాట మేరకు పింఛన్ నగదును పెంచిందని లోకేష్ శాసనమండలిలో తెలిపారు. మొత్తం మీద ఏప్రిల్, మే నెలలో తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలు రాష్ట్రంలో అమలు కానున్నట్లు లోకేష్ ప్రకటనతో క్లారిటీ వచ్చింది. సూపర్ సిక్స్ లో ఈ పథకాలు అమలైతే, మూడు పథకాలు అమలులోకి వచ్చినట్లుగా భావించవచ్చు. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభంలో తల్లికి వందనం ప్రారంభం కానుండగా, ఆ సమయంలో పథకం అమలు కావడమే మంచిదిగా ప్రజలు భావిస్తున్నారు. అలాగే అన్నదాత సుఖీభవ స్కీమ్ కూడా ప్రారంభం కానున్నట్లు లోకేష్ చెప్పడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# మేళ్లచెరువులో మంత్రి ఉత్తం దంపతుల పూజలు



**సూర్యాపేటప్రజాబలం ప్రతినిధి:** జిల్లా మేళ్లచెరువు లో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి దంపతులు పూజలు జరిపారు. ఆలయ అర్చకులు మంత్రి ఉత్తం దంపతులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. మహా శివరాత్రి సందర్భంగా శ్రీ స్వయంభు లింగేశ్వర స్వామి దేవాలయంలో మంత్రి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసారు.

# జీవీరెడ్డి బాటలో మరింత మంది...?

విజయవాడ, ఫిబ్రవరి 26, టీడీపీ అధిష్టానంపై కార్యకర్తలు ఆగ్రహంతో ఉన్నారా? ధిక్కార స్వరం వినిపించే సమయం కోసం ఎదురు చూపుల్లో ఉన్నారా? ఆ ప్రభావమే జీవీ రెడ్డి రాజీనామాతో బహిర్గతమైందా? వైసీపీ దారిలో టీడీపీ వెళ్తుందని కార్యకర్తల కామెంట్స్ వెనుక అసలు కారణం ఏమిటి? పాలన తప్ప కార్యకర్తలను పట్టించుకోవడం లేదన్న విమర్శలలో వాస్తవమెంతఏపీ ఫైబర్ నెట్ ఛైర్మన్ గా జీవీ రెడ్డి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. టీడీపీ అధికారంలో లేని సమయంలో వైసీపీ తన విమర్శలతో ముచ్చెమటలు పట్టించిన వారిలో జీవీ రెడ్డి ఒకరు. జీవీరెడ్డి లైన్ దాటకుండా విమర్శలు గుప్పిస్తారని, అదే ఆయనకు పార్టీలో సుస్థిర స్థానం కల్పించిందని రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం. అందుకే సీఎం చంద్రబాబు కూడా జీవీరెడ్డికి ప్రాధాన్యత కల్పిస్తూ, ఏపీ ఫైబర్ నెట్ ఛైర్మన్ గా నియమింపజేశారు. అలా భాధ్యతలు స్వీకరించారో లేదో ఛైర్మన్ స్థాయిలో ఆయన పూర్తి ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు. ఈ దశలో ఎండీగా ఉన్న దినేష్ ఐఏఎస్ కు జీవీ రెడ్డికి విభేధాలు వచ్చాయని టాక్. అందుకే నిరంతరం ఏపీ ఫైబర్ నెట్ వార్తల్లో నిలుస్తూ వచ్చింది.ఆ విభేధాల కారణంగానే జీవీ రెడ్డి రాజీనామా చేశారన్నది ఎవరూ కాదనలేని వాస్తవం. కానీ ఇక్కడ అందరికీ వస్తున్న ఏకైక డౌట్ ఒక్కటేనట. ఏపీ ఫైబర్ నెట్ లో వివాదం ఉంటే, ఛైర్మన్ పదవికి రాజీనామా చేయాలి. కానీ ఏకంగా టీడీపీ సభ్యత్వానికి కూడా జీవీ రాజీనామా చేయడమే సంచలనంగా మారింది. ఇదే టీడీపీకి పెద్ద మైనస్ అయిందని విశ్లేషకుల అభిప్రాయం. జీవీ రాజీనామా చేసిన వెంటనే వైసీపీ పెద్ద ఎత్తున విమర్శలు చేస్తుందని అందరూ భావించారు. కానీ ఇక్కడ అంతా వ్యతిరేకంగా సాగింది. టీడీపీకి కరడుగట్టిన సైనికులు సోషల్ మీడియాలో మంచి పని చేశారు జీవీ రెడ్డి అన్నా అంటూ మారుమ్రోగించారు. అంతేకాదు టీడీపీకి వైసీపీ గతేనంటూ సీరియస్ కామెంట్స్ చేస్తున్నారు. ఈ కామెంట్స్ వెనుక పెద్ద కారణమే ఉందట.రెడ్డి లాంటి నిజాయితీ పరుడైన నాయకుడికి పార్టీ అండగా ఉండలేదన్నది కార్యకర్తల మనోగతం. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు తీరున జీవీ రాజీనామాతో అధిష్టానం అలర్ట్ అయినా అప్పటికే జరిగే నష్టం జరిగిందని కార్యకర్తలు అభిప్రాయ పడుతున్నారు. ఎండీ దినేష్ ను బదిలీ చేసినప్పటికీ, ఇదే పని ముందే చేసి ఉంటే జీవీ రాజీనామా ఉండదని కామెంట్స్ వినిపిస్తున్నాయి. అధికారంలోకి వచ్చాక టీడీపీ అధిష్టానం కార్యకర్తలను పట్టించుకోవడం లేదని, వైసీపీ దారిలో నడుస్తుందని పలువురు తెలుగు తమ్ముళ్లు బాహాటంగానే విమర్శిస్తున్నారుపార్టీ క్యాడర్ పట్టించుకోకనే వైసీపీకి 11 సీట్లు దక్కాయన్న విషయాన్ని జగన్ ఆలస్యంగా గుర్తించారని, అధికారంలో ఉన్న టీడీపీ మాత్రం నాయకుల, కార్యకర్తల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలని లేకుంటే పెను ప్రమాదమే పొంచి ఉందన్న టాక్ నడుస్తోంది. పాలన ఒక్కటే కాదు, పార్టీని కాపాడుకోవాలని టీడీపీ అధిష్టానానికి క్యాడర్ సూచిస్తోంది. జీవీ రాజీనామా పెద్ద మైనస్ గా పేర్కొంటున్న తెలుగు తమ్ముళ్లు, ఇప్పటికైనా అధిష్టానంపై సోషల్ మీడియా వేదికగా ధిక్కార స్వరం వినిపిస్తున్నారు. మరి క్యాడర్ ను నచ్చజెప్పుకొనే ప్రయత్నాలు టీడీపీ అధిష్టానం చేస్తుందా? లేక సైలెంట్ గా జరిగే పరిణామాలను చూస్తూ ఉంటుందా అన్నది మున్ముందు తెలియాల్సి ఉంది.

# 15 వేల మంది ఉద్యోగుల సర్దుబాటు షురూ...

నెల్లూరు, ఫిబ్రవరి 26, ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయాల్లో అదనపు సిబ్బంది లెక్క తేలింది. రాష్ట్ర వ్యాప్తంగా సచివాలయాల్లో 15,498 మంది సిబ్బంది అదనంగా ఉన్నట్టు గుర్తించారు. సచివాలయాల్లో జనాభా ప్రాతిపదికన ఎంత మంది పనిచేయాలో ఇప్పటికే ఖరారు చేవారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని గ్రామ సచివాలయాలు, వార్డు సచివాలయాల్లో అదనంగా ఉన్న సిబ్బందిని గుర్తించారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ సచివాలయాల్లో 12,126 మంది అదనంగా ఉండగా, పట్టణ ప్రాంతాల్లోని వార్డు సచివాలయాల్లో 3,372 మంది ఉన్నారు.సచివాలయ సిబ్బందిని వారి ఆసక్తి మేరకు విధులు అప్పగించాలని ప్రభుత్వం భావిస్తోంది. మిగిలిన సచివాలయ ఉద్యోగులను డిప్యూటేషన్‌పై ఇతర ప్రభుత్వ శాఖల్లో సర్దుబాటు చేస్తారు. ఈ ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని భావిస్తోంది. మరోవైపు సచివాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం సీనియర్ అధికారులతో కమిటీ ఏర్పాటు చేయనున్నారు. ఇతర ప్రభుత్వ శాఖల్లో సర్దుబాటు చేయడంపై ఉద్యోగులు లేవనెత్తిన సందేహాలను నివృత్తి చేయడంతో సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో సమన్వయం చేసి వాటిని పరిష్కరించేందుకు కమిటీలను ఏర్పాటు చేస్తారు.ప్రస్తుతం గ్రామ సచివాలయాల్లో అదనంగా పనిచేస్తున్న ఉద్యోగుల్లో డిజిటల్ అసిస్టెంట్లు 173, వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు 414, గ్రామ మహిళా పోలీసులు 2107మంది, వీఆర్వోలు 2899, గ్రామ సర్వేయర్ అసిస్టెంట్లు గ్రేడ్ 3- 4,722, అగ్రికల్చర్ హార్టి కల్చర్, సెరి కల్చర్ అసిస్టెంట్లు 1154, ఎనర్జీ అసిస్టెంట్లు 405, వెటర్నరీ, ఫిషరీస్ అసిస్టెంట్లు 252 మంది ఉన్నారు.పట్టణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వార్డు సచివాలయాల్లో వార్డు వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్యదర్శులు 37, మహిళా పోలీసులు 913, వార్డు రెవిన్యూ కార్యదర్శులు 1006, వార్డు ప్లానింగ్, రెగ్యులేషన్ కార్యదర్శులు 1336, వార్డు, ఎనర్జీ కార్యదర్శులు 80 మంది ఉన్నారు. వీరిలో ఇప్పటికే కొందరిని పట్టణ ప్రణాళిక శాఖకు తరలించారు.గ్రామ, వార్డు సచివాలయాలను మూడు క్యాటగిరీలుగా విభజించారు. 2500లోపు జనాభా ఉన్న సచివాలయాలను ఏ క్యాటగిరీలో, 2501 నుంచి 3500 లోపు జనాభాను బీ క్యాటగిరీగా, 3501పైగా జనాభా ఉన్న వాటిని సీ క్యాటగిరీలో చేర్చారు. 2500లోపు జనాభా ఉంటే ఆరుగురు ఉద్యోగుల పనిచేయాల్సి ఉంటుంది. ఇలా రాష్ట్ర వ్యాప్తంగా 3015 గ్రామ సచివాయాలు, 547 వార్డు సచివాలయాలు ఉన్నాయి. మొత్తం 3562 సచివాలయాల్లో 2500లోపు జనాభా ఉంది.2501 నుంచి 3500 జనాభా ఉన్న సచివా?లయాలకు ఏడుగురు సిబ్బందిని కేటాయిస్తారు. ఈ విభాగంలో 3,884 గ్రామ సచివాలయాలు, 1504 వార్డు సచివాలయాలతో కలిపి మొత్తం 5,388 ఉన్నాయి.3501కు పైగా జనాభా ఉన్న సచివాలయాల్లో8మంది సిబ్బందిని నియమిస్తారు. ఈ విభాగంలో 4,263 గ్రామ సచివాలయాలు, 1791 వార్డు సచివాలయాలు ఉన్నాయి. సీ క్యాటగిరీలో మొత్తం 6054 సచివాలయాలు ఉన్నాయి.ఏపీలో ప్రస్తుతం 11,162 గ్రామ సచివాలయాలు, 3841 వార్డు సచివాలయాలు ఉన్నాయి. మొత్తం రాష్ట్ర వ్యాప్తంగా 15,004 సచివాలయాలను వైసీపీ హయంలో ఏర్పాటు చేశారు.

# తునిలో వైసీపీకి దెబ్బ

కాకినాడ, ఫిబ్రవరి 26, తుని మున్సిపల్ మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఎన్నిక విషయంలో టీడీపీ, వైసీపీ మధ్య రాజుకున్న ఆధిపత్య పోరులో క్రమక్రమంగా వైసీపీ పట్టు తప్పుతున్నట్లు తెలుస్తోంది. తాజాగా వైసీపీకి చెందిన అయిదుగురు కౌన్సిలర్లు రాజీనామా చేయడంతో వైసీపీ బలం 12 మందికి పడిపోగా టీడీపీ 16 మందితో ఛైర్మన్‌గిరి దక్కించుకోవడానికి సిద్ధ పడుతోంది. దీంతో ముందస్తుగానే తుని మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి రాజీనామా చేశారు. మున్సిపాలిటీలో తమకు 18 మంది బలం ఉందని వైసీపీ చెబుతూ రాగా అప్పటికి 15మంది మాత్రమే హాజరు అవుతుండగా అందులో ముగ్గురు మున్సిపల్ సమావేశానికి గైర్హాజరు అయ్యారు. మరో ముగ్గురు టీడీపీ క్యాంప్‌లో చేరారు. దీంతో వైసీపీ బలం 12కు పడిపోయింది. అయితే తన పదవికి రాజీనామా చేసిన చైర్‌పర్సన్ సుధారాణి తాను సాధారణ కౌన్సిలర్‌గానే కొనసాగుతానని వెల్లడిరచినట్లు తెలుస్తోంది. తుని మున్సిపల్‌లో 30 మంది కౌన్సిలర్లుకు ప్రస్తుతం 28 మంది వరకు కౌన్సిలర్లు ఉండగా వీరిలో 18 మంది వైసీపీ కౌన్సిలర్లు ఉండగా మిగిలిన 10 మంది టీడీపీ కౌన్సిలర్లు.. ఇదిలా ఉంటే మున్సిపల్ వైస్ ఛైర్మన్ పదవికోసం టీడీపీ, వైసీపీ పోటీ పడుతున్నాయి. దీంతో ఇటీవల పరిస్థితి ఉద్రిక్తతకు దారి తీసింది. ఇప్పటికే మూడు సార్లు వాయిదా పడిన తుని మున్సిపల్ వైస్ ఛైర్మన్ నాలుగోసారికూడా మళ్లీ వాయిదాపడింది. దీని వెనుక మాజీ మంత్రి దాడిశెట్టి రాజానే కారణమని కూటమి నేతలు విమర్శిస్తున్నారు. పది మంది వరకు వైసీపీ కౌన్సిలర్లు వైసీపీను వీడి టీడీపీలో చేరారు. వీరిని మాజీ మంత్రి యనమల రామృకృష్ణుడు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఒక్కొక్కరూ పార్టీని వీడిపోవడంపై రాజీనామా చేయాలని మాజీ మంత్రి దాడిశెట్టి రాజా కౌన్సిలర్లుపై ఒత్తిడి తెచ్చారని, అయితే తాము రాజీనామా చేయమని తేల్చిచెప్పి టీడీపీలో చేరినట్లు వారు చెబుతున్నట్లు తెలుస్తోంది. మొత్తం మీద తుని పురపాలక సంఘం టీడీపీ ఖాతాలో ఖరారు కాబోతున్న పరిస్థితి కనిపిస్తోందితుని పట్టణంలో శాంతి భద్రతలు ఉండేందుకే తాను తన ఛైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఏలూరి సుధారాణి అన్నారు. తన రాజకీయ చరిత్రలో మహిళా ప్రజాప్రతినిధిపై కేసు పెట్టిన ఘనత యనమల కుటుంబానికే చెల్లుతుందన్నారు.

కౌన్సిలర్లును మేము నిర్భంధించినట్లు తప్పుడు ఆరోపణలు చేస్తూ తనపైనా, వైసీపీ జిల్లా అధ్యక్షులు దాడిశెట్టి రాజాపై కేసులు పెట్టారన్నారు.

వైస్ ఛైర్మన్ ఎలాగూ దౌర్జన్యంతో లాక్కుంటున్నారని, వారికి కావ్వాల్సింది ఇక ఛైర్మన్ పదవి అని, వారికి కావాల్సిన ఎజెండా నెరవేర్చుకునేందుకు అధికారమధంతో తమ కౌన్సిలర్లుపై దాడులకు తెగబడుతున్నారని, అందుకే తానే రాజీనామా చేసినట్లు తెలిపారు.

## ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఘనంగా మహాశివరాత్రి వేడుకలు

**కరీంనగర్ ప్రజాబలం ప్రతినిధి:** ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మహాశివరాత్రి వేడుకలు ఘనం గా జరుగుతున్నాయి. శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. శివాలయాలు శివనామ స్మరణతో మారుమ్రోగుతున్నాయి. వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి భక్తులు భారీగా తరలివచ్చారు. రాజన్న దర్శనానికి 4 గంటల సమయం పడుతోంది. భక్తుల దర్శనం ఏర్పాట్లలో అధికారుల సమన్వయ లోపం కనిపించింది. గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు అవస్థలు పడుతున్నారు. అధికారులతో భక్తులు వాగ్వాదానికి దిగారు.

## గోధుమ వర్ణంలో దర్శనం ఇచ్చిన సోమేశ్వరస్వామి

భీమవరం పంచారామ క్షేత్రం శివనామస్మరణతో మారుమ్రోగుతుంది. భీమవరం పంచారామక్షేత్రం సోమారామంకు భక్తులు పోటెత్తారు. మహాశివరాత్రి సందర్భంగా సోమేశ్వరస్వామికి ఆర్చకులు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేస్తున్నారు. స్వామివారి దర్శనానికి బారులు తీరిన భక్తులు. సోమేశ్వరస్వామి గోధుమ వర్గంలో దర్శనం ఇస్తున్నారు. స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు ఆలయ అధికారులు పూర్తి చేసారు.

## బీరంగూడ ఆలయంలో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ప్రత్యేక పూజలు

**సంగారెడ్డి ప్రజాబలం ప్రతినిధి:** బీరంగూడ లోని శివాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు దర్శనానికి పోటెత్తిన భక్తులు. శివాలయంలో తెల్లవారుజామున మొదలుకొని భారీ ఎత్తున భక్తులు శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, సతీమణి విచ్చేసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శివరాత్రి ఉత్సవాల్లో ఆ శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించమన్నారు. ప్రతి ఒక్కరు సుఖసంతోషాలతో ఉండాలని ఆ భగవంతుడిని ప్రార్థించమన్నారు. అనంతరం ఆలయ చైర్మన్ సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ శ్రీ మల్లికార్జున భ్రమరాంబ దేవాలయంలో శివరాత్రి సందర్భంగా ఆలయంలో అన్ని ఏర్పాట్లు నిర్వహించమన్నారు. ప్రత్యేక క్యూ లైన్ లో పద్ధతిగా భక్తులు ఆలయానికి ప్రవేశిస్తున్నారన్నారు. ఆలయం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ భద్రత, అంబులెన్స్ ఏర్పాటు చేశామన్నారు. భక్తులందరికీ

# కుంకీ ఏనుగులు ఎప్పుడొస్తాయి...

తిరుపతి, ఫిబ్రవరి 26, ఏపీలో ఏనుగుల దాడుల్ని నివారించేందుకు కర్ణాటక నుంచి శిక్షణ పొందిన కుంకీ ఏనుగుల్ని తెచ్చేందుకు ఆ రాష్ట్రంతో ఒప్పందం చేసుకుని ఐదు నెలలు దాటింది. గత ఏడాది ఆగస్టు 8న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్వయంగా బెంగుళూరు వెళ్లి కుంకీ ఏనుగుల కోసం సీఎం సిద్ధరామయ్యను అభ్యర్థించారు.ఆ తర్వాత కర్ణాటక అటవీ శాఖతో గత ఏడాది సెప్టెంబర్ 27న కుంకీ ఏనుగుల కోసం విజయవాడలో ఒప్పందం చేసుకున్నారు. కర్ణాటకలో శిక్షణ పొందిన ఏనుగులతో ఏపీకి చెందిన అటవీ సిబ్బంది శిక్షణ కూడా ఇప్పిస్తున్నట్టు ప్రచారం జరిగింది. ఐదు నెలలు గడిచినా కుంకీ ఏనుగుల జాడ మాత్రం లేదు.కర్ణాటక నుంచి 8 కుంకీ ఏనుగులను ఆంధ్రప్రదేశ్ పంపేందుకు ఇరు రాష్ట్రాల ప్రభుత్వాల మధ్య సెప్టెంబర్ 27న విజయవాడలో అవగాహన ఒప్పందం జరిగింది. దీంతో కర్ణాటక నుంచి కుంకీ ఏనుగులు వచ్చేస్తాయని అటవీ శాఖ చెప్పింది. దీంతో చిత్తూరు, అన్నమయ్య, కడప జిల్లాలతో పాటు ఉత్తరాంధ్రలతో తరచూ ఏనుగుల దాడులకు ముగింపు లభిస్తుందని భావించారు.కుంకీ ఏనుగుల కోసం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా చొరవ తీసుకోవడంతో వీలైనంత త్వరగా ఏనుగులు ఏపీకీ వచ్చేస్తాయని భావించారు. అయితే అటవీ శాఖ నియమనిబంధనలు ఏనుగుల తరలింపుకు అడ్డంకిగా మారాయి. వన్య ప్రాణుల తరలింపు, వాటి సంరక్షణ విషయంలో ఉన్న నిబంధనలతో ఏపీకి కుంకీ ఏనుగుల తరలింపు ఆలస్యమైనట్టు తెలుస్తోందిఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు, కడప జిల్లాలకు పొరుగు రాష్ట్రాలతో సరిహద్దులు ఉన్నాయి. చిత్తూరు జిల్లాకు తమిళనాడు, కర్ణాటక అటవీ ప్రాంతాల నుంచి వచ్చే ఏనుగులు తరచూ దాడులు చేస్తున్నాయి.

ఇటు ఉత్తరాంధ్రలో ఒడిశా అటవీ ప్రాంతం నుంచి వచ్చే ఏనుగులు తరచూ ప్రజలపై దాడులు చేస్తున్నాయి.అటవీ ప్రాంతాలకు దగ్గర్లో ఉన్న గ్రామాల్లోని పంట పొలాలు, ఊళ్లపై ఏనుగుల మందలు తరచుగా దాడులు చేస్తున్నాయి. ఈ దాడుల్లో ప్రాణ నష్టం జరుగుతోంది. గ్రామస్తులు కొన్ని సార్లు ఏనుగులు అదలించి, శబ్దాలు చేసి తరిమి కొడుతున్నా తరచూ గాయపడటమో, ప్రాణ నష్టమో తప్పడం లేదు.ఏనుగులు గుంపు, గుంపులుగా దాడులు చేస్తే భారీ నష్టం వాటిల్లుతోంది. ఏనుగులు మందలుగా పంటల్ని సర్వనాశనం చేస్తున్నాయి. కనిపించిన మనుషుల్ని తొక్కి చంపేస్తున్నాయి. ఏపీలోని శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, చిత్తూరు జిల్లాల్లో ఈ పరిస్థితులు ఎక్కువగా కనిపిస్తూ ఉన్నాయి.సాధారణంగా వీటిని ఎదుర్కోవడం, వాటిని అడవుల్లోకి తిప్పి పంపడం కష్టం. అదే శిక్షణ పొంన కుంకీలతో వాటిని కట్టడి చేయడం సులువుగా ఉంటుంది. వాటిలో సుశిక్షుతులైన మావటిలు జనావాసాల్లోకి వచ్చిన ఏనుగుల్ని వెనక్కి తరుముతారు.అడవుల్లో ఒంటరిగా తిరిగి మగ ఏనుగుల్ని బంధించి కుంకీ ఏనుగులుగా లొంగదీసుకుంటారు. ఏనుగుల మందల్ని అడవుల్లోకి తరమడంలో ఇవి సమర్థంగా వ్యవహరిస్తాయి. ఒక్కోసారి వాటితో తలపడతాయి. బలంగా, వయసులో ఉన్న ఏనుగుల్ని పోరాటాల కోసం తయారు చేస్తారు.ఆంధ్రప్రదేశ్‌లో శిక్షణ పొందిన కుంకీ ఏనుగుల కొరత ఉంది. ప్రస్తుతం ఏపీలో జయంత్, వినాయక్ అనే రెండు కుంకీలు ఉన్నాయి. అయితే అవి వయసు పైబడ్డాయి. చిత్తూరు జిల్లా కౌండిన్య అడవుల్లో ప్రభుత్వం నిర్వహిస్తున్న ననియాల సంరక్షణ కేంద్రంలో ఈ రెండు ఉన్నాయి. ప్రస్తుతం ఎక్కడకు పడితే అక్కడకు తరలించేందుకు అనువుగా లేవు.తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడ ఏనుగులు దాడి జరిగినా వీటినే తీసుకు వెళ్లేవారు. వృద్ధాప్యంలో ఉన్న ఏనుగులతో మందలపై యుద్ధాలకు వెళ్లడం సాధ్యం కాకపోవడంతో కర్ణాటకతో ఒప్పందం చేసుకున్నారు.

కర్ణాటకతో చేసుకున్న ఒప్పందం మేరకు ఏపీకి 8 కుంకీ ఏనుగులు రావాల్సి ఉంది. అయితే సాంకేతిక కారణాలతో వీటి రాక ఆలస్యమైనట్టు అటవీ శాఖ చెబుతోంది. ప్రస్తుతం కర్ణాటక అటవీ శాఖ మంత్రి వద్ద కుంకీల బదలాయింపు ఫైల్ పెండింగ్‌లో ఉంది. అక్కడ నుంచి కర్ణాటక సీఎం అమోదం లభించాల్సి ఉంటుంది. తొలి విడతలో మార్చిలోగా నాలుగు కుంకీ ఏనుగులు ఏపీకి వస్తాయని చెబుతున్నారు.మరోవైపు కర్ణాటక నుంచి వచ్చే ఏనుగుల కోసం మావటిలకు ఇప్పటికే శిక్షణ ఇచ్చారు.

కొత్త ఏనుగులను అదుపులో ఉంచేందుకు మావటిలను సిద్ధం చేస్తున్నారు. కుంకీల అవసరం, వాటి దాడుల నేపథ్యంలో ఏపీలోనే శాశ్వతంగా కుంకీల తయారీ చేపట్టాలని డిప్యూటీ సీఎం, అటవీ శాఖ మంత్రి పవన్ భావిస్తున్నారు. ఇందుకు అనుగుణంగా అటవీ శాఖ సన్నద్ధం అవుతోంది.

# భారీ డిమాండ్లతో భార్యా బాధితుల సంఘం

## 15 ఏళ్ల కిందట పురుడు

విజయవాడ, ఫిబ్రవరి 26, సమాజంలో ఇటీవల భార్యాబాధితుల సమస్యలపై చర్చ జరుగుతోంది. భార్యలకు ఏ సమస్యల వచ్చినా.. వారి తరపున నిలబడేందుకు మహిళా సంఘాలు ఉన్నాయి. భర్తలకు వచ్చిన సమస్యలను తీర్చేందుకు ఏ సంఘం ముందుకు రాదు.

ఈ నేపథ్యంలోనే భార్యాబాధితుల సంఘం ఏర్పడింది.దేశంలోని మొదటి సారిగా భార్యాబాధితుల సంఘం 2010లో ఆంధ్రప్రదేశ్‌లోని తాడేపల్లిగూడెంలో పురుడు పోసుకుంది. అనంతరం దేశవ్యాప్తంగా విస్తరించింది.

తాడేపల్లిగూడెం, నందిగామ, హైదరాబాద్, ఖమ్మంలో బలమైన కమిటీలతో కార్యక్రమాలను నిర్వహిస్తోంది. 2010లో 35 మందితో భార్యా బాధితుల సంఘం ఏర్పడింది. ఈ సంఘంలో ప్రస్తుతం సుమారు 10 వేల మంది వరకు సభ్యులు ఉన్నారు. 25 మంది క్రియాశీలకంగా కోర్ కమిటీగా ఏర్పడి సంఘం తరపున న్యాయం కోసం గళం విప్పుతున్నారు. అమెరికా , మలేషియా, దుబాయ్‌ల నుంచి కూడా భార్యా బాధితులు ఫోన్‌లో సంప్రదిస్తున్నారని.. జాతీయ అధ్యక్షుడు జి.బాలాజీ రెడ్డి తెలిపారు. భార్యా బాధితుల రక్షణ కోసం చట్టాలు రావాల్సిందేనని అంటున్నారు. గౌరవం కోల్పోతున్నామని, మనశ్శాంతి ఉండటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎందరో బలవన్మరణాలకు పాల్పడుతున్నారని, తప్పు లేకుండా పరిహారాలు కోరవద్దని అన్నారు. తమ ఆస్తులకు తమను దూరం చేస్తున్నారని, భార్యలతో ఇబ్బంది పడే భర్తల తరపున పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

13 డిమాండ్లు..

1. భార్యలు ఎన్ని రకాల కేసులు పెడితే అన్ని రకాల కేసులకు.. భర్తలు, భర్తల కుటుంబాలందరికీ కూడా కౌన్సెలింగ్‌లు ఇచ్చి సరైన న్యాయం జరిగేలా చూడాలి.

2.భార్యలు ఎన్ని రకాల కేసులు పెడితే అన్ని రకాల కేసులకు హాజరుకావాలి. అలా రెండుసార్లు హాజరుకాని పక్షంలో ఆ కేసులను పూర్తిగా రద్దు చేయాలి.

3.498 (ఏ) గృహ హింస కేసు పెట్టిన ఏడాది తరువాత కేసు తేలినా, తేలకపోయినా కోర్టు విడాకులు మాంజూరు చేసి.. రెండో వివాహానికి అనుమతి ఇవ్వాలి.

4.498 (ఏ) గృహ హింస తప్పుడు కేసు అని తేలితే.. భార్య, భార్య తల్లిదండ్రులకు మూడేళ్ల జైలు శిక్ష, భర్తలకు నష్టపరిహారం, పరువు మర్యాదలు ఇప్పించాలి.

5.ఎంసీ, డీవీసీ (డొమెస్టిక్ వైలన్స్)లను చట్టం నుంచి పూర్తిగా రద్దు చేసి.. పెండింగ్‌లో ఉన్న కేసులను రద్దు చేయాలి. జైలు శిక్షలు అనుభవిస్తున్న వారిని వెంటనే విడుదల చేయాలి.

6. పూర్వం ఈ కేసుల వల్ల నష్టపోయిన వారికి భార్యలతో ఆ నష్టపరిహారాన్ని ఇప్పించాలి. ఏడాది పాటు భార్యలకు, భార్యల తల్లిదండ్రులకు జైలు శిక్ష విధించాలి.

7. గృహ హింస కేసు పెట్టిన తరువాత.. భార్యా భర్తలిద్దరి శాంపిల్స్ డీఎన్ఏ టెస్ట్‌లకు పంపాలి.

8. భార్యలు కేసులు పెట్టిన తరువాత ఒక వేళ పిల్లలు ఉంటే.. భార్యల వద్ద నాలుగు రోజులు, భర్తల వద్ద మూడు రోజులు ఉండేటట్లు అనుమతి ఇవ్వాలి.

9. భర్తలు అవసరం లేదని వెళ్లిన భార్యలకు నష్టపరిహారం చెల్లించకూడదు.

10. భార్యలు పెట్టిన కేసుల వల్ల భర్తలకు ఉద్యోగాలు పోకుండా చూడాలి. భర్తలు, వారి తల్లిదండ్రులు కష్టపడి సంపాదించుకున్న ఆస్తిపాస్తులు భార్యా పిల్లలకు చెందకూడదు.

11. పెళ్లి అయిన ఏడాది తరువాత నుంచి భార్యలు పుట్టింటికి చూడటానికి వెళ్తే.. నెల రోజుల లోపు భర్తల దగ్గరకు రావాలి. అలా రాకపోతే భర్తలకు విడాకులు మంజూరు చేయాలి.

12. భర్తల దగ్గర నుంచి భార్యలు విడాకులు తీసుకున్న తరువాత.. భార్యలు, పిల్లలు భర్తల ఇంటి పేర్లను ఎటువంటి వాటిలో ఉపయోగించకూడదు. అలా ఉపయోగించిన పక్షంలో కోర్టు శిక్ష విధించాలి.

13. మహిళలకు ఎటువంటి చట్టాలు, పథకాలు ఇచ్చారో.. అలాంటి చట్టాలు, పథకాలు పురుషులకు కూడా ఇవ్వాలి.

# కృష్ణా తీరం.. శోభాయమానం..





విజయవాడ మహాశివరాత్రి సందర్భంగా తెల్లవారుజాము నుంచే భక్తుల పుణ్యస్నానాలతో స్నాన ఘాట్లు కిటకిటలాడాయి. శివాలయాలు శివనామ స్మరణతో మారుమ్రోగుతున్నాయి. ఘాట్ల వద్ద పిత్రు దేవతలకు పిండ ప్రదానం, తర్పణాలు వదిలిన భక్తులు, దానధర్మాలు చేసారు. వేలాది మంది భక్తుల పుణ్యస్నానాలతో దుర్గాఘాట్, భవానీఘాట్, పున్నమిఘాట్లు అలరారుతున్నాయి.

# మూడు, రెండు పద్ధతిలో ఎమ్మెల్సీ సీట్లు

కడప, ఫిబ్రవరి 26, ఏపీలో ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో అప్పుడే సందడి మొదలైంది. ఎమ్మెల్సీ సీటు కోసం ఆశావహులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. కేవలం ఐదు సీట్లు కావడంతో కూటమి పార్టీల మధ్య బలమైన పోటీ నెలకొంది. ఇందులో జనసేనకు ఒకటి ఖాయమైంది. కాకపోతే బీజేపీ కూడా మాకు ఇవ్వాలని పట్టుబడినట్టు వార్తలు వస్తున్నాయి. అదే జరిగితే టీడీపీకి కేవలం మూడు మాత్రమే మిగలనున్నాయి.ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ ఎన్నికలకు ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. మార్చి 3న ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. ఎమ్మెల్యే కోటాలో జరుగుతుండడంతో అవన్నీ ఏకగ్రీవంగా ఎన్నిక జరగనుంది. ముఖ్యంగా కూటమి పార్టీల నుంచి అభ్యర్థులంతా ఎన్నిక కానున్నారు. ఏపీలో ఐదు ఎమ్మెల్సీ స్థానాలకు కూటమి నేతల మధ్య పోటీ నెలకొంది.పదవీకాలం ముగిసిన వారిలో జంగా కృష్ణమూర్తి , దువ్వారపు రామారావు, యనమల, అశోక్‌బాబు, తిరుమలనాయుడులకు మార్చి 29న ముగియనుంది. ఇందులో జంగా కృష్ణమూర్తి మినహా అంతా టీడీపీకి చెందినవారు. ఎన్నికలకు ముందు జంగా కృష్ణమూర్తి టీడీపీలో చేరారు. ఎమ్మెల్సీ స్థానాలకు టీడీపీ, జనసేన, బీజేపీ నుంచి బలమైన పోటీ ఉంది.జనసేన నుంచి నాగబాబు సీటు ఖాయం. ఆ తర్వాత ఆయన్ని కేబినెట్‌లోకి తీసుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇదివరకే చెప్పారు. ఇకపోతే బీజేపీ వంతైంది. మిత్ర ధర్మ ప్రకారం ఒక సీటు కేటాయిస్తారని ఆ పార్టీ నేతలు అంచనాలు పెట్టుకున్నారు. ఒక్కసీటు కోసం గోదావరి జిల్లాల నుంచి సోము వీర్రాజు, ఉత్తరాంధ్ర నుంచి మాధవ్, రాయలసీమ నుంచి ఒకరు రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల రాజ్యసభ సభ్యత్వానికి విజయసాయిరెడ్డి రాజీనామా చేశారు. ఆ సీటును బీజేపీకి కేటాయిస్తే టీడీపీకి నాలుగు ఎమ్మెల్సీ సీట్లు దక్కే అవకాశముంది.ఇక టీడీపీ విషయానికి వద్దాం. ఒకవేళ బీజేపీకి గనుక ఒక్కసీటు కేటాయిస్తే టీడీపీకి మూడు మాత్రమే మిగలనున్నాయి. పిఠాపురం నుంచి వర్మ, బెడవాడ నుంచి వంగవీటి రాధ, దేవినేని ఉమామహేశ్వరరావు రేసులో ఉన్నారు. బీసీ కోటాలో మాజీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న, మైనారిటీ కోటాలో విశాఖకు చెందిన ఎండీ నజీర్ పోటీపడుతున్నారు.వసంత కృష్ణ ప్రసాద్ కోసం మైలవరం సీటును దేవినేని త్యాగం చేశారు. దీంతో ఆయనకు సీటు ఇస్తారన్నది కొందరు నేతల మాట. ఇక వంగవీటి రాధ ఎప్పటినుంచో పార్టీలో కొనసాగుతున్నారు. ఈసారి రేసులో ఆయన ఉన్నట్లు బలంగా సంకేతాలు వస్తున్నాయి.

గతంలో చాలా సార్లు ఎమ్మెల్సీ రేసులో ఆయన పేరు వినిపించింది.దీనికితోడు పదవీకాలం ముగియనున్న నేతల్లో జంగా కృష్ణమూర్తి , దువ్వారపు రామారావు, యనమల సైతం రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఎలా ముందుకు వెళ్లాలని అనేదానిపై కొందరు నేతలతో అధినేత మంతనాలు జరిపినట్టు సమాచారం. వీరిలో కొందరికి నామినేటెడ్ పోస్టులు ఇచ్చి పార్టీకి నమ్మినబంటుగా ఉన్నవారికి ఎమ్మెల్సీ సీట్లు ఇస్తారని అంటున్నారు. ఏదిఏమైనా బడ్జెట్ సమావేశాలు పూర్తి అయ్యేసరికి సీట్లపై ఓ కొలిక్కి రావచ్చని అంటున్నారు.

# అంతా తానై...

విజయవాడ ఫిబ్రవరి 26, నారా లోకేష్ తెలుగుదేశం పార్టీలో కీలకంగా మారారు. గత ఎన్నికలలో కూటమి ప్రభుత్వం విజయం సాధించడం వెనక కూడా లోకేష్ కృషి ఉంది. యువగళం పాదయాత్రతో రాష్ట్ర మంతటా పర్యటించడమే కాకుండా యువనేతలను అభ్యర్థులుగా ఎంపిక చేయడంలో కూడా లోకేష్ కీలక పాత్ర పోషించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే లోకేష్ ముఖ్యమైన ఐటీ, విద్యాశాఖలను అడిగి మరీ తీసుకున్నారు. విద్యాశాఖ అన్ని శాఖల్లో ముఖ్యమైనది. ఎందుకంటే లక్షలాది మంది విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో నిరంతరం సర్కస్ చేయాల్సి ఉంటుంది. అతి కీలకమైన సున్నితమైన శాఖ కావడంతో ఈ శాఖను డీల్ చేయడం అంత ఆషామాషీ కాదు.అంతేకాకుండా బడ్జెట్ లో ఈ శాఖకు ఎక్కువ నిధులు కేటాయించాల్సి వస్తుంది. అనేక పథకాలు ఈ శాఖలతోనే ముడిపడి ఉన్నాయి. ప్రధానంగా తల్లికి వందనం పథకంతో పాటు ఫీజు రీఎంబర్స్ మెంట్, విద్యార్థులకు స్కాలర్ షిప్ లు, ఉపాధ్యాయుల బదిలీలు.. వేతనాలు సకాలంలో చెల్లించడం, వారి డిమాండ్లను నెరవేర్చడం అంటే సామాన్యమైన విషయం కాదు. ఈ శాఖలో నలిగిన వారు ఎవరైనా సరే మరోశాఖను దేనినైనా సులువుగా డీల్ చేయగలరన్నది ప్రభుత్వంలో ఎవరైనా అంగీకరించే విషయమే. అందుకే ఈ బడ్జెట్ లో తన శాఖకు సంబంధించిన నిధులను కేటాయింపు జరగడంలో లోకేష్ ముందుంటారని అందరూ చెబుతున్నారు. ఇప్పటికే తల్లికి వందనం ఆలస్యం కావడంతో ఇక ఈ బడ్జెట్ లో నిధుల కేటాయింపు జరిగి తీరుతుంది.పార్టీ కార్యక్రమాల పర్యవేక్షణ బాధ్యతను కూడా లోకేష్ తన భుజాలపైకి ఎత్తుకున్నారు. చంద్రబాబు అలా వచ్చి ఒకసారి వెళ్లి ప్రసంగించి వెళ్లడమే కానీ, ముఖ్యమైన నేతలతో సమావేశాలు, జిల్లాల్లో నేతల మధ్య నెలకొన్న విభేదాలను పరిష్కరించడం, నామినేటెడ్ పోస్టులను భర్తీ చేయడం వంటి వాటిలో లోకేష్ అన్ని రకాలుగా ఆలోచించి నిర్ణయం తీసుకుని చంద్రబాబుకు నివేదిక సమర్పిస్తున్నారని తెలిసింది. ఇందుకోసం లోకేష్ ప్రత్యేకంగా ఒక టీంను ఏర్పాటు చేసుకున్నట్లు తెలిసింది. టీమ్ అన్ని రకాలుగా సర్వేలు చేసిన తర్వాతే వారికి నామినేటెడ్ పోస్టులను కేటాయిస్తున్నారు. అసంతృప్తులు వస్తాయని తెలిసినా పార్టీకి ఉపయోగపడే నిర్ణయాలను తీసుకోవడం లోకేష్ కు సవాల్ గా మారింది. తాజాగా ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలోనూ లోకేశ్ పాత్రను ఎవరూ కాదనలేరు.పార్టీ పరంగా కార్యకర్తలను కూడా కాపాడుకోవాల్సిన బాధ్యత కూడా లోకేష్ పైనే ఉంది. చంద్రబాబు నాయుడు దృష్టికి కొన్ని వెళతాయి. మరికొన్ని వెళ్లవు. కానీ లోకేష్ టీంకి మాత్రం రాష్ట్రంలో ఏ నియోజకవర్గంలో ఏమి జరుగుతుందో ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటిని సరిదిద్దే ప్రయత్నం చేస్తున్నారు. వచ్చే ఏ ఎన్నికల్లోనైనా కూటమిని గెలిపించే బాధ్యతను తాను తీసుకున్నారు. చంద్రబాబు కు కొంత వెసులుబాటు కల్పించి ఆయనను పరిపాలనపై దృష్టి పెట్టేందుకు లోకేష్ పార్టీ కార్యక్రమాలన్నీ అంతా తానే అయి చూస్తున్నారు. దీంతో పాటు ఉండవల్లిలోని నివాసంలో ప్రజాదర్బార్ పేరిట ప్రజలను కలుసుకుంటూ వాటిని పరిష్కరిస్తూ వారి మన్ననలను పొందుతున్నారు. ఢిల్లీలో కూడా పనులు చక్కబెట్టేందుకు రెడీ అయ్యారు. ఎదిగేందుకు ప్రయత్నిస్తున్నారని కొందరు విమర్శించినా లోకేష్ మాత్రం ఇప్పుడు టీడీపీలో నెంబర్ వన్ అని సీనియర్ నేతలే బహిరంగంగా చెబుతున్నారు.

## ఏకాంబరనాధ స్వామి ఆలయంలో శివరాత్రి వేడుకలు

**కూకట్ పల్లిప్రజాబలం ప్రతినిధి:** కేపిహెచ్ బి కాలనీ, రోడ్ నెంబర్ 3 లోగల శ్రీచక్ర అధిష్టాన కామాక్షి సమేత ఏకాంబరనాథ స్వామి దేవాలయంలో మహా శివరాత్రి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. భక్తుల సందడి మధ్య, ఆలయం ఆనందోత్సాహంగా మారింది. అర్చకులు తెల్లవారుజాము నుంచే స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తున్నారు. భక్తులు క్యూలైన్లో భక్తిశ్రద్ధలతో బార్లు తీరారు. వారి సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకొని, ఆలయ చైర్మన్ పివి శ్రీ రమణ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రత్యేకంగా, ఆలయం చుట్టూ రంగురంగుల విద్యుత్ దీపాల అలంకరణ ఆహ్లాదకరమైన వాతావరణాన్ని సృష్టించింది. భక్తులు ఈ దివ్యమైన క్షణాలను ఆస్వాదిస్తూ, స్వామివారిని దర్శించుకుంటున్నారు.

# కుంభమేళకు 45 లక్షలు.. అయినా ఫుల్ డిమాండ్

**హైదరాబాద్ప్రజాబలం ప్రతినిధి: ఫిబ్రవరి 26,** ప్రపంచంలోనే అతిపెద్ద హిందూ ధార్మిక కార్యక్రమం అయిన కుంభమేళ చివరి దశకు చేరుకుంది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి అనేక మంది.. ఈ పవిత్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. మరికొందరు ఇప్పటికీ ప్రయాణాలు పెట్టుకుంటున్నారు. వారిలో హైదరాబాద్ వంటి సంపన్న నగరాల నుంచి ఉన్నత వర్గం ప్రజలు భారీగానే ఖర్చు చేస్తున్నట్లు చెబుతున్నారు. భారీగా అంటే మామూలు భారీగా కాదు.. ఏకంగా ఒక్కో ట్రిప్ నకు రూ.15 లక్షల నుంచి రూ.45 లక్షల వరకు ఖర్చు చేస్తున్నారంట. ఏంటీ.. ఆశ్చర్యంతో నోరెళ్లబెడుతున్నారా.?. అయితే.. ఇంకో విషయం వీళ్లు ఎన్ని లక్షలు పెట్టినా, ప్రయాగ్ రాజ్ కు వెళ్లేందుకు ప్రైవేట్ జెట్లు, హెలీకాప్టర్లు దొరకడం లేదంటా.. అంటే మధ్యతరగతి జనాని సంక్రాంతికి బస్సులు నిండిపోయినట్లు.. కుంభమేళ పుణ్యమా అని అన్ని ప్రైవేట్ జెట్లు ఫుల్ డిమాండ్ తో నడుస్తున్నాయంట

.ఇన్నాళ్లు వివిధ కారణాలతో పవిత్ర సంగమంలో స్నానం ఆచరించలేకపోయిన ధనవంతులు.. ఇక ఇప్పుడు సంగమంలో పవిత్ర స్నానం కోసం డబ్బుల్ని నీళ్లలా ఖర్చు చేసేందుకు సైతం వెనుకాడడం లేదంటా. గత కొన్ని రోజులుగా వరుసపెట్టి వస్తున్న ఆర్డర్ల గురించి ఓ బుకింగ్ ఏజెన్సీ చెప్పిందీ విషయం. కుంభమేళ చివరికి చేరుకునేంటప్పటికి.. డిమాండ్ పెరుగుతుందని చెబుతున్న ట్రావెల్ అండ్ బుకింగ్ ఏజెన్సీలు.. గత కొన్ని వారాల్లో హైదరాబాద్‌లోని వ్యాపార, రాజకీయ, టెక్ రంగాలకు చెందిన ప్రముఖుల బుకింగ్స్ తో 25-30 ట్రిప్పుల వరకు ప్రయాగ్ రాజ్ వెళ్లొచ్చినట్లు చెబుతున్నారు. ఇక.. ఈ రెండు రోజులు అయితే.. ధరలు మరింత పెరగగా.. అయినా ఆయా వర్గాలు వెనక్కి తగ్గడం లేదని సమాచారం. పవిత్ర సంగమంలో స్నానం చేసేందుకు ఎంత ఖర్చు పెట్టేందుకైనా సిద్ధపడుతున్నారంట. ఈ డిమాండ్ ను ముందే అంచనా వేసిన కొన్ని సంస్థలు.. వివిధ రకాల విమానాల్ని లీజుకు తీసుకున్నాయంట.హైదరాబాద్ నుంచి ప్రయాగ్‌రాజ్ విమానాశ్రయానికి.. ప్రైవేట్ జెట్ లో వెళ్లేందుకు సుమారు 1 గంట 45 నిమిషాలు పడుతుంది. అక్కడి నుంచి సంగమం దగ్గరే కావడంతో.. ఒక్కరోజులోనే త్రివేణి సంగమంలో స్నానం చేసి వచ్చేయొచ్చు. ప్రస్తుతం ఓ ఏజెన్సీ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి 6 సీట్ల టర్బోప్రాప్ విమానం రెంట్ కు తీసుకోవాలి అనుకుంటే.. రూ.15 లక్షలకు పైగానే చెల్లించుకోవాల్సి ఉంటుంది. అదే 8-సీట్ల జెట్ లో ఓ కుటుంబం వెళ్లి రావాలి అనుకుంటే మాత్రం రూ.30 లక్షలు, పన్నులు చెల్లించాల్సిందే అంటున్నారు. అదే.. ఓ రెండు, మూడు కుటుంబాలు కలిసి వెళ్లాలి అంటే మాత్రం.. 13-సీట్ల జెట్ బుక్ చేసుకుంటున్న ఐశ్వర్యవంతులు ఇందు కోసం రూ.45 లక్షలు చెల్లిస్తున్నారు. కుంభమేళ చివరి దశకు చేరుకోవడంతో.. ఈ ధరలు మరింత భారీగా పెరిగే అవకాశాలున్నాయని పరిశ్రమ నిపుణులు అంచనా వేస్తున్నారు.ధనవంతుల నుంచి వస్తున్న డిమాండ్‌ను బట్టి చూస్తే? ధరలు మరో 20% నుంచి 30% వరకు పెరగడంలో పెద్దగా ఆశ్చర్యం లేదంటున్నారు బెంగళూరుకు చెందిన థంబీ ఏవియేషన్ అఖా గోవింద్ నాయర్. ఆయన సంస్థ మహా కుంభ్ కోసం ప్రభుత్వ అధికారులు, ఫార్మా కంపెనీల అధిపతులు, టెక్ రంగ నాయకులు, రాజకీయ ప్రముఖులకు హెలికాప్టర్లను అద్దెకు ఇస్తోంది. ప్రస్తుత రద్దీ నేపథ్యంలో.. వారి సంస్థ ఒక్క రోజులోనే మూడు నుంచి నాలుగు ట్రిప్పులు నిర్వహిస్తోందని చెప్పారు. హైదరాబాద్ నుంచి ప్రయాగ్‌రాజ్ విమానాశ్రయానికి చేరుకుని, అక్కడి నుంచి ఘాట్ హెలిప్యాడ్ (త్రివేణి సంగమం సమీపంలో) వరకు హెలికాప్టర్‌లో తీసుకెళ్తున్నట్లు తెలిపారు.కుంభమేళ నుంచి విమానాశ్రయానికి తిరుగు ప్రయాణంలో ఒక్కో సీటుకు దాదాపు ?33,000 ఖర్చవుతుందని తెలుపుతున్నారు. అయితే.. విమానాశ్రయం నుంచి ఘాట్ వరకు దూరం సుమారు 12 కిలోమీటర్లు మాత్రమే. అధిక ధరలున్నా, మహా కుంభ్ డిమాండ్ ఉన్నా.. వ్యాపారం మాత్రం భారీ లాభదాయకంగా లేదంటున్నాయి విమానయాన సంస్థలు. పరిమిత హెలిప్యాడ్‌లు, పార్కింగ్ సమస్యలు వంటి అనేక సవాళ్లు ఎదురవుతున్నాయని చెబుతున్నారు. ప్రయాగ్ రాజ్ విమానాశ్రయానికి విమానాల రద్దీ భారీగా ఉండటంతో.. ఒక రాత్రి ఉండాలంటే హెలికాప్టర్లను వారణాసి, అయోధ్య లేదా లక్నోకి తీసుకెళ్లి పార్కింగ్ చేయాల్సి వస్తోందని చెబుతున్నారు. ఇది చాలా ఖర్చుతో కూడుకున్న వ్యవహారమని.. అలా లాభాల్లో భారీగా కోత పడుతున్నట్లు చెబుతున్నారు.

# సోషల్ ఇన్ ఫ్లూయెర్స్ కు దిమ్మ తిరిగే షాక్...

సోషల్ మీడియాలో లక్షలాది ఫాలోవర్స్, సబ్ స్క్రైబర్స్ ఉన్న వాళ్లు తాము ఏది చేసినా చెల్లుతుంది అనుకుంటున్నారు. ఆడిందే ఆట పాడిందే పాట.. అడిగేవారు ఎవరూ లేరనుకుంటున్నారు. రాత్రికి రాత్రే ఫుల్ డబ్బులు సంపాదించాలనుకుంటున్నారు. అందుకే బెట్టింగ్ యాప్స్ ను గేమింగ్ యాప్స్ ను ప్రమోట్ చేస్తున్నారు. నిజానికి ఏపీ, తెలంగాణలో ఆన్ లైన్ బెట్టింగ్స్, గేమింగ్స్ పై బ్యాన్ ఉంది. అయినా సరే ఈ బ్యాన్ మమ్మల్ని ఏం చేస్తుందని అనుకుంటున్నారు. ఎవరికీ బెదిరేదే లేదనుకుంటున్నారు. సీన్ కట్ చేస్తే ఇదీ లోకల్ బాయ్ నాని పరిస్థితి. బెట్టింగ్ ప్రమోషన్స్ చేస్తూ అరెస్టై రిమాండ్ లో ఉన్నాడు.చిన్న గేమ్ ఆడండి.. చిటికెలో సంపాదించండి. బెట్టింగ్ ఆడేందుకు మేమే మొదట డబ్బులు వేస్తాం. డోంట్ వర్రీ.. ఆడండి సంపాదించండి. ఇవీ ఏ సోషల్ మీడియా ప్లాట్ ఫాం ఓపెన్ చేసినా ఫాలోవర్లు ఎక్కువగా ఉన్న వారు చేస్తున్న పని. ఈజీ మనీకి అలవాటు పడి.. జనాలందరినీ ఈ రొంపిలోకి దింపే ప్రయత్నాలు ఇటీవల పెరిగిపోయాయి. యూట్యూబ్, ఇన్ స్టా, ఈః, గూగుల్ నుంచి వచ్చే డబ్బులతో సంతృప్తి పడకుండా.. జనాలను ఆన్ లైన్ బెట్టింగ్ లకు, గేమింగ్ లకు, గ్యాంబ్లింగ్ లకు, డేటింగ్ లకు అలవాటు చేస్తున్నారు. తాజాగా లోకల్ బాయ్ నాని అరెస్ట్ తో సోషల్ మీడియా ఇన్ ఫ్లూయెన్సర్ల ఆటలు ఇక సాగబోవని రుజువైంది.రండి వచ్చి ఆడండి.. అంటూ తలా కొంత మొత్తం ముందే ఇచ్చి ఇష్టంలేని వారిని కూడా ఈ కూపంలోకి లాక్కురావడం వేరు. రెండింటికీ చాలా తేడా ఉంది. బలవంతంగా ఈ ఆన్ లైన్ బెట్టింగ్ లోకి దింపే బ్యాచులు ఎక్కువవుతున్నాయి. సోషల్ మీడియాలో ఏది చూసినా అయితే బెట్టింగ్.. లేదంటే డేటింగ్ యాప్స్ ప్రమోషన్ చేసే వాళ్లే ఎక్కువగా కనిపిస్తున్నారు. లోకల్ బాయ్ నాని విశాఖకు చెందిన యూట్యూబర్. చేపలు పట్టడం వృత్తి. అవే సముద్రం వీడియోలు తీస్తూ జనంలో మంచి క్రేజ్ సంపాదించుకున్నాడు. కానీ ఈ మధ్య బెట్టింగ్ ప్రమోషన్స్ షురూ చేయడంతో అది సజ్జనార్ దృష్టికి వెళ్లింది. దీంతో ఆ వీడియోను ట్యాగ్ చేస్తూ మీరు డబ్బు సంపాదించుకోవాలంటే అనేక మార్గాలు ఉన్నాయని, ఇవేం దిక్కుమాలిన పనులు అంటూ పోస్ట్ పెట్టారు. ఇప్పటికైనా సమాజ శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్లను ఆపండి అంటూ ట్వీట్ చేశారు సజ్జనార్. ఈ పోస్ట్ వైరల్ కావడంతో యూట్యూబర్ లోకల్ బాయ్ నాని రియాక్ట్ అయ్యాడు. కానీ అప్పటికే సమయం మించిపోయింది. ఇకపై బెట్టింగ్ యాప్‌లకు ప్రమోషన్లు చేయనని, ప్రమోట్ చేస్తే సోషల్ మీడియా నుంచే శాశ్వతంగా తప్పుకుంటానని చెప్పాడు నాని. ఈయనలో మార్పు వచ్చినందుకు సజ్జనార్ ప్రశంసించారు కూడా.సోషల్ మీడియా ముసుగులో ఏది చేసినా చెల్లుతుందని చాలా మంది అనుకుంటున్నారు. లక్షల సంఖ్యలో ఫాలోవర్లు ఉన్న వారి సంగతి చెప్పక్కర్లేదు. యూట్యూబ్, గూగుల్, పెయిడ్ ప్రమోషన్స్, అఫిలియేట్ మార్కెటింగ్ ఇలా రకరకాల రూపాల్లో సోషల్ మీడియా నుంచి డబ్బులు వస్తున్నా.. చాలా మంది సోషల్ మీడియా ఇన్ ఫ్లూయెన్సర్లు, సెలబ్రిటీలు ఇంకా అత్యాశకు పోతున్నారు. ఎక్కువ కమిషన్లు వచ్చే పనులు చేస్తున్నారు. ఏపీ తెలంగాణలో ఆన్ లైన్ బెట్టింగ్స్, గేమింగ్స్ బ్యాన్ ఉన్నా సరే.. నిస్సిగ్గుగా ప్రమోషన్స్ చేస్తున్నారు. రండి ఆడండి గెలుచుకోండి అంటున్నారు. తీరా చూస్తే మొదట్లో బాగానే డబ్బులు వస్తుంటాయి.రైట్ ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో సోషల్ మీడియా ఇన్ ఫ్లూయెన్సర్ల విషయానికి వద్దాం. కొందరు ట్రావెలింగ్ చేస్తూ లశ్రీనీబ పెడుతున్నారు. ఇంకొందరు తాము చేసే పనులనే వీడియోలుగా తీసి పెడుతున్నారు. ఒక్కొక్కరికి ఒక్కో ట్యాలెంట్ ఉంది. అయితే ఇందులో కొందరు చాలా తెలివి మీరుతున్నారు. ఈ డబ్బులు సరిపోవడం లేదని ఎక్కువ కమిషన్లు ఇచ్చే ఆన్ లైన్ బెట్టింగ్, గేమింగ్స్ యాప్స్ ను ప్రమోట్ చేస్తున్నారు. షార్ట్ ఫిల్మ్స్ పెడుతున్న వారైతే డేటింగ్ యాప్ లను పరిచయం చేస్తున్నారు. ఫుల్ సెక్యూరిటీ అంటున్నారు. కుటుంబాలను నాశనం చేసేందుకు ఇదే సోషల్ మీడియా ఇన్ ఫ్లూయెన్సర్లు ప్రత్యక్షంగానే కారణమవుతున్నారు. జనాల చావులకు కారణమవుతున్నారు. ఎవరు చస్తే మాకేంటి అనుకున్న ధోరణితోనే పరిస్థితి ఇక్కడిదాకా వచ్చింది. ఇకపై ఆటలు సాగబోవంటూ పోలీస్ డిపార్ట్ మెంట్ స్ట్రాంగ్ గానే వార్నింగ్ ఇస్తోంది. అంతే కాదు.. బెట్టింగ్ యాప్స్ ను ప్రమోట్ చేయొద్దంటూ మరికొందరు సోషల్ మీడియా ఇన్ ఫ్లూయెన్సర్లు ఎంత ప్రయత్నించినా వర్కవుట్ కావడం లేదు.ప్రభుత్వాలు ఒకవైపు ఆన్ లైన్ బెట్టింగ్ లను కట్టి చేస్తుంటే.. ఇంకోవైపు ఈ సోషల్ కేటుగాళ్లు రెచ్చిపోతూ ప్రమోట్ చేస్తూ అందరినీ అందులోకి లాగుతున్నారు. ఈః, ఇన్ స్టాగ్రామ్, యూట్యూబ్ ఇలా ఏది ఓపెన్ చేసినా ఇవే పనికిమాలిన ప్రమోషన్లు కనిపిస్తున్నాయి. ఇక చూస్తూ ఊరుకోబోమని పోలీసులు డైరెక్ట్ గానే వార్నింగ్స్ ఇస్తున్నారు. ఇది వరకు ఇలా బెట్టింగ్స్ ప్రమోట్ చేసిన వారి వీడియోలు, వారి వివరాలు సేకరిస్తున్నారు. తాము లక్షలకు లక్షలు సంపాదించామని ఫేక్ వీడియో తీసి పెడుతుంటారు. సోషల్ మీడియా ఇన్ ఫ్లూయెన్సర్లను సోషల్ మీడియా వరకే ఆపేయాలి. ఆ ఫాలోయింగ్ అక్కడివరకే ఉండాలి. తప్పుదోవ పట్టించే వారు చెప్పే విషయాలను నిజజీవితం లోకి తీసుకుంటే మొదటికే మోసం వస్తుందన్నది గ్రహించాలి.ఆలిండియా గేమింగ్ ఫెడరేషన్, ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఫాంటసీ స్పోర్ట్స్, పలు గేమింగ్ కంపెనీల సీఈఓలు, ఇంటర్నెట్ సర్వీసు ప్రొవైడర్లు, టెలికాం సర్వీసు ప్రొవైడర్లు, డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికాం ప్రతినిధులతో ఇటీవలే మీటింగ్ కూడా పెట్టి స్ట్రిక్ట్ గా చెప్పేశారు. ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్‌కు బానిసలై పలువురు ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని ప్రస్తావించారు. గేమింగ్ సంస్థలు జియో ఫెన్సింగ్ పాటించకపోవడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. నిషేధిత గేమింగ్ యాప్‌ల్లో బెట్టింగ్‌లకు పాల్పడుతున్న వారిపై 1930కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో పిలుపునిచ్చింది.

# అన్ని స్కూళ్లలో తెలుగు కంపల్సరీ

**హైదరాబాద్ప్రజాబలం ప్రతినిధి: ఫిబ్రవరి 26**, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పాఠశాలల్లో తెలుగు సబ్జెక్ట్ తప్పనిసరిగా బోధించాలని రేవంత్ సర్కార్ నిర్ణయించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ జిల్లా పరిషత్, మండల పరిషత్, ఎయిడెడ్, ఇతర బోర్డు అనుబంధ పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతుల విద్యార్థులకు తెలుగు తప్పనిసరిగా సబ్జెక్టుగా అమలు చేయాలని ఆదేశించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. 9వ తరగతి విద్యార్థులకు 2025-26 విద్యా సంవత్సరం నుంచి, పదో తరగతి విద్యార్థులకు 2026-27 నుంచి ఈ అమలు చేసేలా చూడాలని విద్యాశాఖకు సూచించింది.కాగా పాఠశాలల్లో తెలుగును తప్పనిసరిగా బోధించడానికి రాష్ట్ర ప్రభుత్వం 2018లో తెలంగాణ చట్టాన్ని తీసుకువచ్చింది. అయితే, గత ప్రభుత్వం వివిధ కారణాల వల్ల పాఠశాలల్లో తెలుగు బోధనను పూర్తి స్థాయిలో అమలు చేయలేకపోయింది. రాష్ట్రంలో గతేడాది అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు అమలుకు పూర్తిస్థాయి చర్యలు తీసుకువచ్చింది. తదనుగుణంగా యాజమాన్యంతో సమావేశం నిర్వహించి, రాబోయే విద్యా సంవత్సరం నుంచి అబాఇ, ఎఆూఇ వంటి ఇతర బోర్డు స్కూళ్లలో కూడా 9, 10 తరగతులకు తెలుగు సబ్జెక్టును బోధించాలనే నిర్ణయాన్ని తాజా ప్రకటన ద్వారా వెల్లడించింది.అయితే బోర్డు విద్యార్థులకు తెలుగు సబ్జెక్టును సులభంగా బోధించడానికి 'వెన్నెల' అనే 'సరళ తెలుగు' పాఠ్యపుస్తకాన్ని ఉపయోగించాలని ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి మంగళవారం తెలిపారు. 'సరళ తెలుగు' పాఠ్యపుస్తకాన్ని అమలు చేయడం వల్ల తెలుగు మాతృభాషగాలేని విద్యార్థులకు, ఇతర రాష్ట్రాలకు చెందిన విద్యార్థులకు కూడా ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు.

సింగిడి స్థానంలో వెన్నల

ఇతర సిలబస్ స్కూళ్లలోనూ 100 శాతం తెలుగు సబ్జెక్ట్ అమలు లక్ష్యంగా ఈ సమావేశం జరిగింది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం 'సింగిడి' పుస్తకాన్ని తీసుకొచ్చిన విషయం తెల్సిందే. వచ్చే విద్యా సంవత్సరం నుంచి 9, 10 తరగతుల విద్యార్థులకు 'వెన్నెల' తెలుగు పుస్తకాన్ని బోధించాలని తెలిపింది.ఇతర రాష్ట్రాలు, ఇతర దేశాల విద్యార్థులు తెలుగు సబ్జెక్టును సులభతరంగా అర్థమయ్యేలా 'వెన్నెల' విధానాన్ని అమలు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల అధికారులకు సూచించారు. దీంతో ఈ విధానాన్ని వచ్చే విద్యా సంవత్సరం 2025?26 నుంచి అమలు చేయాలని ఆ శాఖ నిర్ణయించింది. దీని ఆధారంగా పరీక్షను నిర్వహించాలంటూ రాష్ట్ర ప్రభుత్వం మెమో ద్వారా పాఠశాల యాజమాన్యాలను ఆదేశించింది.ఇది నాణెనికి ఒకవైపు మాత్రమే. రెండో వైపు చూద్దాం. విద్యార్థుల స్కోర్ కోసం సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఐబీ వంటి కొన్ని పాఠశాలలు సంస్కృతం సబ్జెక్ట్ పక్కాగా అమలు చేశాయి. దీనివల్ల విద్యార్థుల మార్కులు పెరుగుతుందని భావించారు. చాలామంది స్టూడెంట్స్ దీన్ని ఫాలో అవుతూ వచ్చారు. తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఆయా విద్యార్థులు సందిగ్ధంలో పడ్డారు. మధ్యలో తెలుగు సబ్జెక్ట్ అంటే కష్టంగా ఉంటుందని అంటున్నారు.మళ్లీ మొదట నుంచి తెలుగు నేర్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు కొందరు స్టూడెంట్స్. సంస్కృతం సబ్జెక్ట్ తీసుకున్న విద్యార్థుల సంఖ్య ప్రైవేటు పాఠశాలలో ఎక్కువగా ఉందని అంటున్నారు. చాలా పాఠశాలలను ఐదు నుంచి అమలు చేయడం మొదలుపెట్టారు. నార్మల్‌గా అయితే ఇంటర్‌లో స్కోర్ కోసం సంస్కృతం సబ్జెక్ట్‌ను విద్యార్థులు ఎక్కువగా తీసుకున్న సందర్భాలు కనిపిస్తాయి. దీనివల్ల వందకు వంద స్కోర్ వచ్చిన సందర్భాలు ఉన్నాయి.

# కమలం గూటికి శశిధరూర్..

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26, (న్యూస్ పల్స్) మాజీ కేంద్ర మంత్రి శశి థరూర్ కాంగ్రెస్ పార్టీని వీడనున్నారా? కాంగ్రెస్ పార్టీని వీడితే ఆయన ఏ పార్టీలో చేరుతారు..? జాతీయ రాజకీయ వర్గాల్లో ఇప్పుడు ఇదే అంశం హాట్ టాపిక్‌గా మారింది. కాంగ్రెస్ హైకమాండ్, శశి థరూర్ మధ్య గ్యాప్ వచ్చినట్లు తెలుస్తోంది. ఇటీవల ఆయన ప్రధాని నరేంద్ర మోదీని మెచ్చుకోవడమే దీనికి కారణమన్న టాక్ వినిపిస్తోంది. ఇప్పటికే దీనిపై ఆయన కాంగ్రెస్ హైకమాండ్‌కు వివరణ కూడా ఇచ్చుకున్నారు. ఈ నేపథ్యంలో ఆయన మంగళవారం ఉదయం సోషల్ మీడియాలో షేర్ చేసిన ఓ ఫొటో..ఆయన కాంగ్రెస్‌ను వీడుతారన్న ఊహాగానాలకు మరింత బలం చేకూర్చేలా ఉంది. కేంద్ర మంత్రి, బీజేపీ సీనియర్ నేత పీయూష్ గోయల్‌తో దిగిన ఫొటోను సోషల్ మీడియాలో థరూర్ షేర్ చేశారు. ఈ ఫొటోలో బ్రిటీష్ ట్రేడ్ సెక్రటరీ ఆఫ్ స్టేట్ జొనాథన్ రెనాల్డ్స్ కూడా ఉన్నారు. ఈ పొటోతో శశి థరూర్ రాజకీయ భవితవ్యానికి సంబంధించిన ఊహాగానాలు జోరందుకున్నాయి. శశి థరూర్ బీజేపీలో చేరుతారన్న ప్రచారం జరుగుతోంది.పార్టీలో తన పాత్ర ఏంటో స్పష్టం చేయాలని శశి థరూర్ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని కోరారు. అయితే రాహుల్ గాంధీతో జరిగిన చర్చల్లో ఈ విషయంలో శశి థరూర్‌కి స్పష్టత రాలేదని తెలుస్తోంది. తాను పార్టీ కోసం పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నానని.. వద్దు అనుకుంటే తనకు ప్రత్యామ్నాయం కూడా ఉందంటూ శశి థరూర్ రెండ్రోజుల క్రితం కీలక వ్యాఖ్యలు చేశారు. అయితే ప్రధాని మోదీ అమెరికా పర్యటనను మెచ్చుకోవడంతో పాటు కేరళలోని ఎల్డీఎఫ్ ప్రభుత్వాన్ని కొనియాడుతూ థరూర్ వ్యాఖ్యలు చేయడం కాంగ్రెస్ పార్టీకి ఇబ్బందికరంగా మారింది. తాజా పరిణామాలు ఎక్కడికి దారితీస్తాయోనన్న అంశం రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.ఎంపీ శశి థరూర్ వరుసగా నాలుగు సార్లు కేరళలోని తిరువనంతపురం లోక్‌సభ నియోజకవర్గానికి ప్రాతినిధ్యంవహిస్తున్నారు. పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం కోసం పట్టుబడుతూ 2002 అక్టోబర్‌లో జరిగిన కాంగ్రెస్ జాతీయ అధ్యక్ష ఎన్నికల్లో శశి థరూర్ పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో మల్లికార్జున ఖర్గేపై పోటీ చేసి ఆయన ఓడిపోయారు. గాంధీ కుటుంబం మద్దతుతో ఆ ఎన్నికల్లో మల్లికార్జున ఖర్గే విజయం సాధించారు. నాటి ఎన్నికల్లో ఖర్గేకు 7,897 ఓట్లు దక్కగా.. శశి థరూర్ కేవలం 1,072 ఓట్లు సాధించారు.

# కాంగ్రెస్ లో అంతే... సొంత పార్టీపైనే విమర్శలు

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:ఫిబ్రవరి 26,**అధికారంలో లేనప్పుడు కనీసం కాంగ్రెస్ పార్టీని గెలిపించడానికి ఎటువంటి ప్రయత్నం చేయరు. అంతెందుకు తమకు తాము గెలిచేందుకు కూడా వారి సామాజికవర్గంతో పాటు చేసిన పనులు కూడా సహకరించవు. కానీ పార్టీ అధికారంలోకి రాగానే తమకు మంత్రి పదవులు కావాలంటూ గొంతు చించుకుంటారు. అది కాంగ్రెస్ లోనే సాధ్యం. పదేళ్ల పాటు గెలుపునకు దూరంగా ఉన్న నేతలు ఇప్పుడు అధికారంలోకి రాగానే తాము ఇరగదీసే నేతలమంటూ, తమకు అన్యాయం చేస్తున్నారంటూ సొంత పార్టీపైనే విమర్శలకు దిగడం విడ్డూరమన్న కామెంట్స్ వినపడుతున్నాయి.

అధికారంలోకి తీసుకు వచ్చేందుకు మీరు ఏం చేశారన్న ప్రశ్నకు మాత్రం వారి వద్ద సమాధానం ఉండదు.. 2004, 2009 ఎన్నికల్లో వరసగా సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గం నుంచి గెలిచిన అంజనీకుమార్ యాదవ్ ఇప్పుడు సొంత పార్టీ పై విమర్శలకు దిగడం పై సోషల్ మీడియాలో సెటైర్లు వినిపిస్తున్నాయి. 2014 నుంచి మళ్లీ ఆయన గెలవలేదు. అప్పుడు కాంగ్రెస్ గాలివాటంలో గెలిచిన అంజనీకుమార్ యాదవ్ కాంగ్రెస్ 2023 లో అధికారంలోకి రాగానే ఆయన కుమారుడికి రాజ్యసభ పదవిని ఇప్పించుకున్నారు. ఇప్పుడు ఆయనలో మళ్లీ అసంతృప్తి తలెత్తింది. అందుకు కారణం తనకు మంత్రి పదవి ఇవ్వడం లేదనే. ఒకే ఇంట్లో ఇంతమందికి పదవులు ఇచ్చుకుంటూ పోతే ఎలా అని కాంగ్రెస్ శ్రేణులే ప్రశ్నిస్తున్నాయి. అంత ఓటు బ్యాంకు ఉన్న నేత అయితే 2023 ఎన్నికల్లో హైదరాబాద్ నగరంలో ఒక్క సీటును కూడా ఎందుకు కాంగ్రెస్ కు తెచ్చి పెట్టలేకపోయారని కొందరు కాంగ్రెస్ కార్యకర్తలే ప్రశ్నిస్తున్నారు... వనపర్తి మాజీ ఎమ్మెల్యే చిన్నారెడ్డి కూడా అంతే. ఆయన 2014లో వనపర్తి నుంచి గెలిచారు. తర్వాత ఆయన ఇక గెలవలేదు. కానీ సొంత పార్టీ ఎమ్మెల్యేపైనే ఆయన విమర్శలకు దిగారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే మేఘారెడ్డి పై అవినీతి ఆరోపణలు చేస్తున్నారు. చిన్నారెడ్డి సీనియర్ లీడర్. అయితే ఆయన పార్టీలో చర్చించాల్సిన అంశాలు మీడియా సమావేశం పెట్టి మరీ సొంత పార్టీ ఎమ్మెల్యేపై ఆరోపణలు చేయడాన్నిపలువురు తప్పుపడుతున్నారు. కేవలం పదవుల కోసమే పార్టీ నాయకత్వాన్ని బ్లాక్ మెయిల్ చేసే ఉద్దేశ్యంతో ఈ సీనియర్లు ప్రయత్నిస్తున్నారని, కాంగ్రెస్ లో అంతర్గత ప్రజాస్వామ్యం ఎక్కువ కావడంతో వీరు ఎన్ని మాటలు మాట్లాడినా వీరిపై చర్యలు ఉండవు. ప్రజలు తిరస్కరించిన నేతలు తమకు దొడ్డిదారిన పదవులు కావాలంటూ పార్టీ నాయకత్వాన్ని బెదిరించడంతో పాటు పార్టీ ప్రతిష్టను దిగజార్చడం ఎంత వరకూ సబబని పలువరు కాంగ్రెస్ శ్రేణులు ప్రశ్నిస్తున్నాయి

ఇక చిన్నారెడ్డి

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వానికి వేరే ప్రతిపక్షం అక్కర్లేదు. ఆ పార్టీ నేతలే విమర్శిస్తున్నారు. సీనియర్లు అలుగుతారు. బహిరంగ ఆరోపణలు చేస్తారు. ఈ స్థాయిలో వేరే పార్టీ నేతలు కూడా చేయబోరు. అందుకే కాంగ్రెస్ నిత్యం కుమ్ములాటలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తుందనే ఆరోపణలు వినిపిస్తుంటాయి. తాజాగా కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి, కాంగ్రెస్ క్రమశిక్షణ సంఘం అధ్యక్షుడు చిన్నారెడ్డి వనపర్తిలో మాట్లడుతూ చేసిన వ్యాఖ్యలు పెను దుమారం రేపుతున్నాయి. ఏకంగా క్రమశిక్షణ సంఘం అధ్యక్షుడే క్రమశిక్షణ తప్పారని కొందరంటే, ఉన్నది ఉన్నట్లు ధైర్యంగా మాట్లడారని మరికొందరంటున్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని సొంత పార్టీ ఏర్పాటు చేసిన ప్రభుత్వంపైనే తీవ్ర ఆవేదనతో మండిపడ్డారు చిన్నారెడ్డి. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యానికి రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతున్న విధానం అద్దం పడుతోందని ఆరోపించారు. మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్ధి జీవన్ రెడ్డితో 90లక్షల రూపాయలు ఖర్చుపెట్టించారని అన్నారు. ఓట్లు కొనుగోలు చేసే క్రమంలో ఎంపీటీసిలకు, జడ్పిటిసిలకు ఒక్కొక్కరికి 5 నుంచి 10లక్షలు జీవన్ రెడ్డితో ఇప్పించి నిండా ముంచేశారని కామెంట్స్ చేశారు. చిన్నారెడ్డి చేసిన వ్యాఖ్యలు ప్రధాన ప్రతిపక్షం అయిన బిఆర్‌ఎస్‌కు ఆయుధంగా మారాయి. ఇదే అంశంపై మాజీ మంత్రి బిఆర్ఎస్ నేత హరీష్ రావు ఎక్స్ వేదికగా చిన్నారెడ్డి వీడియోను పోస్ట్ చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కార్నర్ చేశారు. ఇందిరమ్మ రాజ్యం.. పోలీసు రాజ్యమైంది, మా కార్యకర్తల నుంచి నాయకుల దాకా అక్రమ కేసులు, వేధింపులు సర్వసాధారణమైపోయాయి. ఈ ఆరోపణలు వాస్తవమని కాంగ్రెస్ నాయకుడైన చిన్నారెడ్డి వ్యాఖ్యల ద్వారా స్పష్టమవుతున్నది. అని హరీష్ రావు మండిపడ్డారు. ఆయన పోస్టు చేసిన పోస్టులో ఏముందంటే...'పోలీసులు కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఇంటి కావలికారుల్లాగా పని చేస్తున్నారు.

ఎమ్మెల్యే కేసు పెట్టుమంటే పెట్టాలె, తీసేయమంటే తీసేయాలె అనే స్థాయికి దిగజారారు. గతంలో ఎన్నడూ ఒక ఎమ్మెల్యేకు అధికారులు ఇంతగా భయపడిన దాఖలాలు లేవు. నా 46ఏండ్ల రాజకీయ జీవితంలో ఇంత దారుణంగా పోలీసులు, అధికారులు ఎన్నడూ ప్రవర్తించలేదు" అని చిన్నారెడ్డి బహిరంగంగా ప్రభుత్వ తీరును ఎండగట్టారు.

కొందరు పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని బీఆర్ఎస్ ముందు నుంచి చెబుతున్నది నిజమేనని నాడు జగిత్యాలలో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, నేడు వనపర్తిలో ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి చేసిన వ్యాఖ్యలు తేటతెల్లం చేస్తున్నాయి.రేవంత్ రెడ్డి ప్రభుత్వం పోలీసులు, అధికారుల తీరు ఇట్లా ఉంటే, రేవంత్ రెడ్డి నాయకత్వంలో నోట్ల రాజకీయం నగ్న తాండవం చేస్తోందని చిన్నారెడ్డే అంగీకరించారు.మహబూబ్ నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి జీవన్ రెడ్డితో రూ.90 కోట్లు ఖర్చు పెట్టించారని, ఓట్లు కొనుగోలు చేసే క్రమంలో ఎంపీటీసీలు, జెడ్పీటీసీలకు 5నుంచి 10లక్షల వరకు ఇస్తామని హామీ ఇచ్చి, రెండున్నర లక్షలు మాత్రమే ఇచ్చారని చిన్నారెడ్డి చెప్పడం బీఆర్ఎస్‌కు మంచి అస్త్రం ఇచ్చినట్టు అయింది. చిన్నారెడ్డి చేసిన కామెంట్స్‌ను హరీష్ పోస్టు చేస్తూ..."ఈడీలు, సీబీఐలు, ఐటీలు, ఎన్నికల్ కమిషన్లు ఎందుకు ఈ విషయంపై నోరు మెదపడం లేదు? సుమోటోగా తీసుకొని కేసులు ఎందుకు పెట్టడం లేదు? బీఆర్ఎస్ నాయకులపై నిరాధారమైన కేసులు పెట్టటంలో చూపించే అత్యుత్సాహం ఆధారాలున్నా, స్వయంగా క్యాబినెట్ ర్యాంకులో ఉండి, ప్రభుత్వంలో ఉన్న కాంగ్రెస్ నాయకుడే చెబుతున్నా ఎందుకు పెట్టడం లేదు? కాంగ్రెస్ మార్కు ప్రజాపాలన, రాజ్యాంగ పరిరక్షణ అంటే ఇదేనా? రాజ్యాంగం చేతిలో పట్టుకొని తిరిగే రాహుల్ గాంధీ ఏ విధంగా సమర్థిస్తారు? ఏం సమాధానం చెబుతారు? బడే భాయ్, ఛోటే భాయ్ బంధానికి ఇంతకంటే సాక్ష్యం ఏం కావాలి? బిజేపీ, కాంగ్రెస్ చీకటి ఒప్పందానికి ఇంతకంటే నిదర్శనం ఏం కావాలి? వెంటనే కేసులు పెట్టి, విచారణ జరపాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నాం." అని సోషల్ మీడియా వేదికగా సవాల్ చేశారు.

ఇలా చిన్నారెడ్డి చేసిన కామెంట్స్‌ను ఆయుధంగా చేసుకొని రేవంత్ రెడ్డి సర్కాను మాజీ మంత్రి బిఆర్ ఎస్ నేత హరీష్ రావు తీవ్ర స్థాయిలో విమర్శించారు. మాపై కేసులు పెట్టి, అరెస్టులు చేసే రేవంత్ రెడ్డి , ఇప్పుడు తమ పార్టీ సీనియర్ నేత బహిరంగంగా చేసిన ఆరోపణలపై ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. మీపార్టీలో ఓట్లు కొనేందుక కోట్లు ఖర్చు చేసారని మీ పార్టీ నేత చెబుతుంటే ఎందుకు కేసులు కట్టరని నిలదీశారు. బాధ్యులపై ఎందుకు చర్యలు తీసుకోరని డిమాండ్ చేసారు హరీష్ రావు. మొత్తానికి సొంత పార్టీలో చిన్నారెడ్డి పెట్టిన చిచ్చుతో బిఆర్ఎస్ అస్త్రాలు సంధిస్తోంది.

## రెడీ అవుతున్న స్మార్ట్ కార్డులు...

**వరంగల్‌ప్రజాబలం ప్రతినిధి: ఫిబ్రవరి 26,** తెలంగాణ ప్రభుత్వం లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేసేందుకు కసరత్తు ముమ్మరం చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరించిన ప్రభుత్వం.. అర్హత ఉన్న లబ్ధిదారులను ఎంపిక చేసింది. వారందరికీ కొత్త రేషన్ కార్డులు అందించనుంది. అయితే, ఈసారి రేషన్ లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. వీటిని ఏటీఎం కార్డు తరహాలో ప్రత్యేక చిప్, యూనిక్ నెంబర్ తో అందుబాటులోకి తేనుంది.రాష్ట్రంలో 90లక్షలకు పైగా ఉన్న పాత లబ్ధిదారులతోపాటు కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులను గుర్తించి అందరికీ స్మార్ట్ రేషన్ కార్డులు అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కార్డుల తయారీకోసం షార్ట్ టెండర్ పిలిచే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. కార్డు నమూనా అప్రూవల్ కోసం ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వద్దకు ఫైల్ ను పంపించారు. సీఎం నుంచి అనుమతి రాగానే కార్డుల ప్రింటింగ్ ప్రక్రియను వేగవంతం చేయనున్నారు. ఎమ్మెల్సీ కోడ్ ముగియగానే రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ స్మార్ట్ కార్డులను ప్రభుత్వం లబ్ధిదారులకు పంపిణీ చేయనుంది.మార్చి 3వ తేదీన ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు వెల్లడికానున్నాయి. ఆ తరువాత కోడ్ తొలగిపోతుంది. దీంతో మార్చి మొదటి వారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. లబ్ధిదారులకు అందించే స్మార్ట్ రేషన్ కార్డుపై ఎవరి ఫొటో ఉండదు. కేవలం యూనిక్ నెంబర్ తోపాటు ఏటీఎం కార్డు తరహాలో కార్డుపై చిప్ తో ఉండేలా ఈ కార్డును తయారు చేస్తున్నారు. ఏటీఎం కార్డు తరహాలో ఉండే స్మార్ట్ రేషన్ కార్డును స్వైప్ చేస్తే లబ్ధిదారుల పేర్లు, ఆధార్ నెంబర్లు, అడ్రస్, రేషన్ దుకాణం వివరాలు వచ్చేలా కార్డును రూపొందిస్తున్నారు. తద్వారా భవిష్యత్తులో స్మార్ట్ కార్డుతో ఎక్కడైనా రేషన్ తీసుకునేలా ఏర్పాట్లు చేస్తున్నామని సివిల్ సప్లయ్ అధికారులు చెబుతున్నారు.రాష్ట్రంలో మీ సేవా ద్వారా కొత్త రేషన్ కార్డుల కోసం ఇప్పటి వరకు 1.50 లక్షల దరఖాస్తులు వచ్చినట్లు పౌరసరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు. అయితే, గతంలో దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులను అధికారులు ఎంపిక చేశారు. కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి దరఖాస్తులను కూడా పరిశీలన ప్రక్రియను పూర్తి చేసి అర్హులైన వారికి దశల వారీగా స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేయటం జరుగుతుందని అధికారులు

## రంగంలోకి మార్కోస్.. కీలకం కానున్న 40 మీటర్లు

**మహబూబ్ నగర్‌ప్రజాబలం ప్రతినిధి: ఫిబ్రవరి 26,** ఎస్ఎల్బీసీటన్నెల్ ప్రమాదం జరిగి నాలుగు రోజులు గడిచిపోయింది. ఈనెల 22న టన్నెల్ ప్రమాదం చోటు చేసుకోగా.. ఐదు రోజులుగా 8 మంది కార్మికులు లోపలే చిక్కున్నారు. ప్రస్తుతం టన్నెల్‌లో రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది. టన్నెల్ బోరింగ్ మిషన్ వద్ద పరిస్థితిని అంచనా వేయడానికి 34 మందితో కూడిన సైన్యం, ఎన్‌డీఆర్‌ఎఫ్‌ల ప్రత్యేక బృందం మంగళవారం సొరంగంలోకి వెళ్లింది. ప్రస్తుతం అక్కడ తక్షణ సహాయక చర్యలకు పరిస్థితులు అనుకూలంగా లేనట్లు వారు అంచనా వేశారు. ముఖ్యంగా 13.85 కిలోమీటర్ల పొడవైన సొరంగంలో చివరి 40 మీటర్లు సహాయ చర్యలకు సవాల్‌గా మారినట్లు తెలిసింది.టన్నెల్‌లో 15 అడుగుల ఎత్తులో10 వేల క్యూబిక్ మీటర్ల బురద ఉందని ఇంజినీర్లు అంచనా వేశారు. ఆ బురదను బయటికి తీసేందుకు కన్వేయర్ బెల్ట్‌కు మరమ్మతులు చేస్తున్నారు. సొరంగం చివరలో పైకప్పు నుంచి పెద్ద ఎత్తున మట్టి పడుతుండటం.. సొరంగం దిగువన 15 అడుగుల ఊబిలాంటి బురద ఉండటం, అక్కడ కారు చీకటి, సరైన గాలి లేకపోవటం సహాయ చర్యలకు ఆటంకం కలిగిస్తోంది. అధునాతన కెమెరాలు, పరికరాలు కూడా పని చేయటం లేదు. సొరంగంలో 12వ కి.మీ. దాటిన తర్వాత బురద, నీళ్లలో నడిచి వెళ్లాల్సి ఉండటంతో రెస్క్యూ టీమ్స్ ఇబ్బంది పడుతున్నాయి.టన్నెల్‌లో సరిగ్గా 13.85 కిలోమీటర్ల పొడవున్న సొరంగం చివరి భాగంలో పైకప్పు కూలి ప్రమాదం చోటు చేసుకుంది. ఆ ప్రాంతంలో ప్రత్యేక బృందంతో అన్వేషించాలని ప్రభుత్వం భావిస్తోంది. కార్మికులను రక్షించేందుకు నేడు ఆపరేషన్ మార్కోస్ చేపట్టనున్నారు. నేల, నీరు, ఆకాశం... ఎక్కడైనా, ఎలాంటి క్లిష్ట పరిస్థితుల్లోనైనా సహాయక చర్యలకు దిగే సత్తా ఉన్న ఇండియన్ మెరైన్ కమాండో ఫోర్స్ సభ్యులనే మార్కోస్‌గా పిలుస్తారు. కార్గిల్‌తోపాటు కశ్మీర్ తదితర ప్రాంతాల్లో ప్రతికూల పరిస్థితుల్లో ఫలితాలను సాధించిన చరిత్ర ఆ టీంకు ఉంది. మార్కోస్‌తో పాటుగా బోర్డర్ రోడ్ ఆర్గనైజేషన్(బీఆర్‌వో) కూడా రంగంలోకి దిగనుంది. గుట్టలు, పర్వత ప్రాంతాల్లో సొరంగాలు నిర్మాణం, నిర్వహణ రికార్డు బీఆర్వోకు ఉంది.టన్నెల్ ప్రమాదంలో చిక్కుకున్న వారిని సురక్షితంగా బయటకు తెచ్చేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ఈ ఘటనపై త్వరలో పూర్తి స్థాయి విచారణ జరిపిస్తామన్నారు. అనుకోకుండా జరిగిన ఘటనపై ప్రతిపక్షాలు నీచ రాజకీయాలు చేస్తున్నాయని ఆయన మండిపడ్డారు.

## రాజన్నకు పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి పొన్నం



**రాజన్న సిరిసిల్ల ప్రజాబలం ప్రతినిధి:**మహా శివరాత్రి సందర్భంగా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర ఆలయంలో స్వామి వారికి రాష్ట్ర ప్రభుత్వం తరుపున ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ కుటుంబ సమేతంగా పట్టు వస్త్రాలు సమర్పించారు. మంత్రి మాట్లాడుతూ తెలంగాణ ప్రజలు సుభిక్షంగా ఉండాలని, ప్రభుత్వం తీసుకున్న అనేక కార్యక్రమాలకు స్వామి వారి ఆశీస్సులు ఉండాలి. వేములవాడ రాజన్న ఎంతో మహిమ గల దేవుడు. దేవాలయ అబివృద్ధి విషయంలో కట్టుబడి ఉన్నాం. శివరాత్రి పూర్తి కాగానే అభివృద్ధి పనులు వేగవంతం చేసి మళ్ళీ శివరాత్రి నాటికి చెప్పిన పనులు పూర్తి చేస్తామని అన్నారు.

## తెలంగాణలో విచిత్ర వాతావరణం

**ప్రజాబలం ప్రతినిధి:హైదరాబాద్, ఫిబ్రవరి 26,** తెలంగాణలో భిన్నమైన వాతావరణం నెలకొంది. ఉదయం పూట చలి, పది గంటల నుంచి ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది. గత కొద్ది రోజుల నుంచి ఇదే పరిస్థితి నెలకొంది. మరో మూడు రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరుగుతాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. మార్చి నెల వస్తుండటంతో ఎండల తీవ్రత మరింత ఎక్కువవుతుందని అధికారులు హెచ్చరిస్తున్నారు. గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండటంతో ప్రజలు ఉదయం ఎనిమిది గంటలు దాటితే బయటకు రావడానికి భయపడిపోతున్నారు. సాయంత్రం ఆరు గంటల వరకూ ఉష్ణోగ్రతల తీవ్రత తగ్గడం లేదు.. తెలంగాణలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఎండల తీవ్రత ఎక్కువగా ఉందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే సాధారణ ఉష్ణోగ్రతలు కంటే రెండు నుంచి మూడు డిగ్రీల ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం 35 నుంచి 37 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని, ప్రధానంగా ఆదిలాబాద్, మంచిర్యాల, నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లో ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నాయి. కరీంనగర్ జిల్లాలోనూ ఎండల తీవ్రత ఎక్కువగా ఉందని అధికారులు చెబుతున్నారు.రానున్న కాలంలో ఉష్ణోగ్రతలు మరింతగా పెరుగుతాయని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ ఏడాది ఎండల తీవ్రత గతంలో కంటే ఎక్కువగా ఉంటుందన్న అంచనాలు వినపడుతున్నాయి. ప్రజలు కూడా తగిన జాగ్రత్తలు పాటించాలని, లేకుంటే వడదెబ్బ తగిలే అవకాశముందని కూడా హెచ్చరికలు జారీ అవుతున్నాయి. వృద్ధులు, చిన్నారులు ఎండలకు బయటకు రాకుండా ఉండటమే మంచిదని సూచిస్తున్నారు. విద్యాసంస్థలకు కూడా ఒంటిపూట నిర్వహించాలన్న డిమాండ్ వినిపడుతుంది. పరీక్షల సమయంలో విద్యార్థులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తల్లిదండ్రులకు వైద్యులు సూచిస్తున్నారు. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ఇబ్బందులు తప్పవని హెచ్చరిస్తున్నారు.

## చిన్నారుల ట్రాఫికింగ్ గాంధీనగర్ టూ హైదరాబాద్,

**హైదరాబాద్‌ప్రజాబలం ప్రతినిధి: ఫిబ్రవరి 26,** చిన్న పిల్లలతో వ్యాపారం చేసే ముఠాలు ఈ మధ్య కాలంలో రెచ్చిపోతున్నాయి. సంతానం లేని దంపతుల అవసరాన్ని ఆసరాగా తీసుకొని చేయకూడని నీచమైన పనులు చేస్తున్నారు కొందరు కేటుగాళ్లు. ఇలాంటి వారంతా ముఠాలుగా ఏర్పడి పెద్ద పెద్ద నెట్‌వర్క్‌లను ఫామ్ చేసి అప్పుడే పుట్టిన పసికందులను కిడ్నాప్ చేస్తూ దందాలు సాగిస్తున్నాయి. చైతన్యపురి పోలీసుల, మల్కాజిగిరి ఎస్‌ఓటీ పోలీసులతో కలిసి ఓ స్టింగ్ ఆపరేషన్ చేశారు. ఈ ఆపరేషన్‌లో సంచలనం సృష్టించిన ఓ చైల్డ్ ట్రాఫికింగ్ ముఠా గుట్టు రట్టు అయింది. అంతర్‌రాష్ట్ర గ్యాంగ్‌కు చెందిన 11 మందిని రాచకొండ పోలీసులు అరెస్టు చేశారు. అప్పుడే పుట్టిన శిశువులను తీసుకొచ్చి అవసరమైన తల్లిదండ్రులకు అమ్మకాలు చేస్తున్నారు. అప్పుడే పుట్టిన నలుగురు పిల్లల అమ్మకాలు చేయనీయకుండా అడ్డుకున్నారు. వీళ్లంతా కలిసి ఓ నెట్‌వర్క్‌గా ఏర్పడి వివిధ రాష్ట్రాల్లో టీంలను ఏర్పాటు చేసుకున్నారు. ఇప్పుడు తాజాగా గుజరాత్ నుంచి పిల్లలను తీసుకొచ్చి అమ్మకాలు సాగించారు. విషయం ముందే తెలుసుకున్న పోలీసులు స్టింగ్ ఆపరేషన్ చేపట్టారు. అంతే ముఠా గుట్టు వీడింది. వీళ్లతోపాటు చట్ట విరుద్ధంగా పిల్లలను కొంటున్న తల్లిదండ్రులను కూడా అరెస్టు చేశారు. ఈ ముఠాకు చెందిన వారు గుజరాత్‌లో పిల్లల్ని పోషించలేని తల్లిదండ్రులను పట్టుకుంటారు. వారికి డబ్బులను ఎర చూపించి అప్పుడే పుట్టిన పిల్లల్ని కొనుక్కొని తీసుకొస్తారు. హైదరాబాద్‌లో ఉన్న ముఠా సభ్యులు ముందుగానే ఇక్కడ కొనే వ్యక్తులను గుర్తించి వారితో మాట్లాడి పెడతారు. అలా తీసుకొచ్చిన బిడ్డల్ని వాళ్లకు ఇచ్చి డబ్బులు తీసుకుంటారు. గుజరాత్ నుంచి తీసుకొచ్చే ఆడ శిశువును రెండున్నర లక్షలకు, మగ శిశువు అయితే నాలుగున్నర లక్షల రూపాయలకు అమ్ముతున్నారు. ముందుగా కొంత డబ్బులు ఇచ్చిన తర్వాతే వీళ్లకు బిడ్డల్ని తీసుకొచ్చి ఇస్తారు. గుజరాత్ నుంచి హైదరాబాద్ వరకు ఇదో పెద్ద నెట్‌వర్క్ అనిపోలీసులు చెబుతున్నారు. ఇంకా ఇందులో ఉన్న వారి కోసం గాలిస్తున్నామని పోలీసులు అంటున్నారు. ప్రస్తుతం చిక్కిన వారిని విచారించి మరిన్ని వివరాలు రాబడతామన్నారు. చిన్న పిల్లలు ఉన్న తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, పార్కులు, సినిమా థియేటర్లు వంటి జన సంచారం ఎక్కువగా ఉండే పబ్లిక్ ప్లేసుల్లో ఈ ముఠాలు తిరుగుతుంటాయని తెలిపారు. ఒంటరిగా ఉండే చిన్న పిల్లల్ని టార్గెట్ చేసి ఎత్తుకుపోతుంటారని.. వేరే రాష్ట్రాల్లో ఆ పిల్లల్ని విక్రయిస్తుంటారని తెలిపారు. కాబట్టి పిల్లల్ని ఒంటరిగా వదలొద్దని.. వారిపై ఓ కన్నేసి ఉంచాలని సూచిస్తున్నారు. మరీ ముఖ్యంగా జన సంచారం ఎక్కువగా ఉండే పబ్లిక్ ప్లేసుల్లో అపరిచత వ్యక్తులకు పిల్లల్ని ఆడించేందుకు ఇవ్వొద్దని పోలీసులు చెబుతున్నారు. ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచిస్తున్నారు.

## ఎల్ ఆర్ ఎస్ తో 5 లక్షల మందికి లబ్ధి

**హైదరాబాద్‌ప్రజాబలం ప్రతినిధి:** ఫిబ్రవరి 26,తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని అనధికార లేఅవుట్లు, అందులోని ప్లాట్ల క్రమబద్ధీకరణ మరోసారి లేఅవుట్ రెగ్యులేషన్ స్కీమ్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఎల్ఆర్ఎస్ కోసం ప్రభుత్వం నుంచి 25 శాతం స్పెషల్ డిస్కౌంట్ కూడా ప్రకటించారు. ఈ ఏడాది మార్చి 31లోగా ఎల్ఆర్ఎస్ ఫీజుతో పాటు ఓపెన్ స్పేస్ ఛార్జీలు చెల్లిస్తే ఈ డిస్కౌంట్ వర్తిస్తుందని అధికారులు స్పష్టం చేశారు. కాగా, ఈ పథకం ద్వారా కొత్తగా మరో 5 లక్షల మందికి లబ్ధి చేకూరే ఛాన్స్ ఉంది. రాష్ట్రంలో స్థలాల క్రమబద్ధీకరణకు తొలిసారిగా 2020లో ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆ సమయంలో 25.67 లక్షల దరఖాస్తులు వచ్చాయి. వివిధ కారణాలతో వచ్చిన అప్లికేషన్లలో ఇప్పటివరకు సుమారు 9 లక్షల దరఖాస్తులను మాత్రమే పరిష్కరించగలిగారు.ఒకేసారి పరిష్కరించేందుకు 25 శాతం స్పెషల్ డిస్కౌంట్ ఇస్తూ ఇటీవల రేవంత్ ప్రభుత్వం ఓటీఎస్‌ను ప్రకటించింది. ఇదే కాకుండా ఏదైనా లే అవుట్‌లో 10 శాతం స్థలాలు మాత్రమే అమ్ముడై.. మిగతా 90 శాతం ఖాళీగా ఉన్న ప్లాట్లకు కూడా నిర్ధారిత ఫీజు చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకునే ఛాన్స్ కల్పించారు. దీనివల్ల దాదాపు 5 లక్షల మందికి లబ్ధి చేకూరుతుందని అధికారులు భావిస్తున్నారు. ఇలాంటి స్థలాలను కొన్నవారు సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులకు వెళ్లి నేరుగా రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చునని చెప్పారు. ఇక ఎల్ఆర్ఎస్ అప్లికేషన్లలో ప్రస్తుతం 16 లక్షల వరకు పెండింగ్‌లోనే ఉన్నాయి. వీటి విస్తీర్ణం ఆధారంగా ఎంత ఫీజు చెల్లించాలన్నది ఆటోమెటెడ్‌గా నిర్ధరణ కానుంది. అందుకు సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ) ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను సిద్ధం చేసింది.ఈ మేరకు అప్లికేషన్ చేసుకున్న వ్యక్తి ఫోన్‌కు లింకును పంపుతారు. దాన్ని ఓపెన్ చేసి ఆన్‌లైన్ ఫీజు చెల్లించిన వారి స్థలాన్ని అధికారులు తనిఖీ చేశారు. అన్నీ కరెక్టుగా ఉన్నాయనుకుంటే ప్రొసీడింగ్స్ ఇస్తారు. దాంతో స్థల క్రమబద్ధీకరణ పూర్తవుతుంది. ప్రభుత్వ భూముల సర్వే నంబర్లను, నీటి వనరులకు 200 మీటర్ల పరిధిలో ఉన్న భూముల సర్వే నంబర్లను అధికారుల ఇప్పటికే ఆన్‌లైన్ చేశారు. పెండింగ్ అప్లికేషన్లలో ఈ నంబర్లుంటే వాటిని పక్కన పెడతారు. ఇలాంటి స్థలాలు మొత్తం అప్లికేషన్లలో 5 శాతం వరకు ఉండవచ్చని అంచనా. ఇవిపోను మిగతావన్నీ సవ్యంగా ఉంటే.. మరోసారి క్షేత్రస్థాయి పరిశీలన అవసరం లేదని అధికారుల భావిస్తున్నారు. వచ్చే వారం నుంచి ఈ ప్రక్రియ ప్రారంభించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

# కీసర ఆలయం లో మహా శివుడికి ప్రత్యేక పూజలు



**మేడ్చల్ ప్రజాబలం ప్రతినిధి:**మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం ఉదయం అమృత కాలంలో కీసర గుట్ట రామలింగేశ్వర స్వామి వారి ఆలయం లో మహా శివుడికి ప్రత్యక పూజలు నిర్వహించి,అభిషేకం చేసిన మాజీ రాజ్య సభ సభ్యులు జోగినపల్లి సంతోష్ కుమార్, స్థానిక ఎంఎల్ఏ మల్లారెడ్డి, వారి కుటుంబ సభ్యులు. శివరాత్రి పార్వదినాన్ని పురస్కరించుకొని స్వామి వారి అభిషేక కార్యక్రమంలో పాల్గొనడం చాలా ఆనందంగా ఉందన్నారు. స్వామి వారి ఆశీస్సులు ఎప్పుడు తెలంగాణ ప్రజల మీద ఉండాలని కోరుకున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని కీసర గుట్ట ఆలయ పరిధిలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమం లో గ్రీన్ ఇండియా ఛాలెంజ్ కో ఫౌండర్ రాఘవేందర్ యాదవ్, కీసర గుట్ట మాజీ సర్పంచ్ మాధురి వెంకటేష్, బి ఆర్ ఎస్ స్థానిక నాయకులు మహేష్, రాజలింగం తదితరులు పాల్గొన్నారు

# గజవాహనదీశుడైన శ్రీశైలమల్లన్న

శ్రీశైలం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఏడవ రోజు శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. లోక కళ్యాణం కోసం రుద్ర హోమం ,చండీ హోమం, జపాలు, పారాయణలు నిర్వహించారు. సాయంత్రం గజవాహనంపై స్వామి అమ్మవార్లను అదిరోహింపజేసే ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ పూజా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజకుమారి గణీయా, జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్ శ్రీశైల దేవస్థానం ఈఓ ఎం శ్రీనివాసరావు దంపతులు పాల్గొన్నారు. అనంతరం గజ వాహనంపై స్వామి అమ్మవారి గ్రామోత్సవం వైభవంగా సాగింది




# ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న లారీ యువకుడు మృతి

తిరుపతి నారాయణవరం మండలం, పడయేటమ్మ గుడి సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద లారీ బైకును ఢీకొట్టింది. ఘటన యువకుడకి తీవ్ర గాయాలయ్యాయి. తిరుపతి రుయా ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడు నారాయణ వరం మండలం లోని వెత్తల తడుకు గ్రామానికి చెందిన యువకుడుగా గుర్తించారు

# అంబర్ పేట్ ఫ్లైఓవర్ మీదుగా వాహనాలపై రయ్.. రయ్....

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:**గోల్నాక నుంచి ఛే నంబర్ జంక్షన్ మీదుగా ముఖం హోటల్ వరకు నిర్మించిన అంబర్ పేట్ ఫ్లై ఓవర్ మహాశివరాత్రి సందర్భంగా బుధవారం తెల్లవారుజాము నుండే వాహనాలు రయి రయి మంటూ దూసుకెళ్తున్నాయి. నగరంలో కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మించిన మొట్టమొదటి ఫ్లైఓవర్ ఇదే. నాలుగేళ్లుగా కొనసాగుతున్న పనులు పూర్తయి వాహనాలకు అనుమతి ఇస్తుండడంతో నగరవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సుమారు రూ.445 కోట్లతో 1.625 కిలోమీటర్ల పొడవు, నాలుగు లేన్లతో నేషనల్ హైవే అథారిటీ ఈ ఫ్లైఓవర్ నిర్మించింది. కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మించినప్పటికీ భూ సేకరణకు టూ బై థర్డ్ నిధులను రాష్ట్ర ప్రభుత్వమే ఇచ్చింది. మొత్తంగా రూ.180 కోట్లు భూ సేకరణ కోసం ఖర్చుకాగా, ఇందులో రాష్ట్ర ప్రభుత్వం రూ.140 కోట్లు ఇచ్చింది. ఈ ఫ్లైఓవర్కు 2018లో శంకుస్థాపన చేయగా, 2021లో పనులు మొదలు పెట్టారు. 2023 చివరి నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నా పలు కారణాలతో ఆలస్యమయింది.

# సిద్దిపేట వెంకన్న స్వర్ణోత్సవ వైభవం వెల్లి విరియాలి

మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు
సిద్దిపేటస్వర్ణోత్సవ వార్షిక బ్రహ్మోత్సవాలకు చిన్న జీయర్ స్వామి కి ఆహ్వానం
సమన్వయం తో ఉత్సవాలను నిర్వహించాలి.
స్వర్ణోత్సవ వేడుకలకు లక్ష రూపాయల విరాళం ప్రకటించిన హరీష్ రావు.
సిద్దిపేట వెంకటేశ్వర స్వామి



**సిద్దిపేట ప్రజాబలం ప్రతినిధి:**దేవాలయ స్వర్ణోత్సవ వార్షిక బ్రహ్మోత్సవాల పై సమీక్ష నిర్వహించిన మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు సిద్దిపేట శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం 50 ఏళు , పూర్తయితున్న సందర్భంగా స్వర్ణోత్సవ వార్షిక బ్రహ్మోత్సవాలు వేడుకగా నిర్వహించాలాని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. సిద్దిపేట శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం లో స్వర్ణోత్సవ బ్రహ్మోత్సవాల పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. ఈ ఆలయం ఎంతో ప్రాచస్యం కలిగిఉందని అంతే గౌరవం ఉండేల బ్రహ్మోత్సవాలు నిర్వహించాలాన్నారు.. 1971 లో పెద్ద జీయర్ స్వామి వారి కరకములచే ప్రతిష్ట జరిగిందని, అదేవిదంగా 1991లో చిన్న జీయర్ స్వామి స్వహస్తాలచే ఆలయ గోపుర ప్రతిష్ట కార్యక్రమం జరిగిందన్నారు. ఇప్పుడు కూడా అర్ధశాతబ్దపు ఉత్సవాలు శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్ స్వామి వారిచె జరగడం మన అదృష్టం ఇందులో భాగస్వామ్యం కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ వేడుకలు ఘనంగా అగంగరంగా వైభవం గా నిర్వహించాలని చెప్పారు అందుకు అందరు సమన్వయం తో రాజకీయాలకు అతీతంగా జరిపించాలన్నారు. నాడు ఆలయ నిర్మాణం లో భాగస్వామ్యం అయిన కొమ్మ వెంకటేశం, జిల్లా వెంకటేశం, సోహన్ లాల్, పబ్బ చంద్రయ్య ఉన్నారు వారి కుటుంబాలను, అదేవిదంగా 50 ఏళ్ల పాటు ఇందులో భాగస్వామ్యం అయిన ప్రతి ఒక్కరిని సన్మానం చేసుకోవాలన్నారు. 5 రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమం లో అందరూ భాగస్వామ్యం అయి బాధ్యత లు తీసుకోని చేయాలని చెప్పారు. చిన్న జీయర్ స్వామి పర్యవేక్షణ మే 21 వ తేదీన కళ్యానోత్సవమ్, 22 వ తేదీన మహా కుంభాభిషేకం జరుగుతుందన్నారు ఈ స్వర్ణోత్సవ బ్రహ్మోత్సవాలకు తన వంతు సహాయంగా లక్ష రూపాయలు విరాళం ప్రకటించారు. ఇలా అందరూ ముందుకు వచ్చి బృహత్కార్యం లో పాలు పంచుకోవాలన్నారు.

# టన్నెల్ బాధితులకోసం మంత్రి కోమటిరెడ్డి ప్రత్యేక పూజలు



శ్రీశైలం ఎస్ఎల్బీసీ టన్నెల్ లో చిక్కుకున్న 8 మంది సురక్షితంగా తిరిగిరావాలని రాష్ట్ర రోడ్ల భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి శ్రీశైలంలో ప్రత్యేక పూజలు చేసారు. మహాశివరాత్రి సందర్బంగా శ్రీశైలం మల్లికార్జున స్వామి వారిని దర్శించుకొని ఎస్ఎల్బీసీ టన్నెల్ లో చిక్కుకున్న 8 మంది సురక్షితంగా తిరిగి రావాలని కోరుకోవడం జరిగింది. లక్షలాది మంది రైతులు, ఫ్లోరైడ్ భాదితుల జీవితాలను మార్చే టన్నెల్ పనులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రాజెక్ట్ పనులు కొనసాగాలని ఆ దేవదేవుణ్ణి వేడుకోవడం జరిగిందని మంత్రి అన్నారు..

# రాష్ట్ర ప్రజలు సుబీక్షంగా ఉండాలి

**రాష్ట్ర ప్రభుత్వం, రాహుల్ గాంధీ పేరిట పూజలు**
**జాతరలో చిన్న నాటి మిత్రులతో కలసి మిఠాయిలు కొనుక్కొని సందడి**
**మహాశివరాత్రి వేడుకల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు**

వైరా రాష్ట్ర ప్రజలు సబీక్షంగా ఉండాలని, ప్రపంచం లో తెలుగు ప్రజలు ఎక్కడ ఉన్నా వారంతా క్షేమం గా ఉండాలని ఆ శివపార్వతులను వేడు కున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. బుధవారం ఆయన శ్రీమతి మల్లు నందినితో కలిసి స్వగ్రామమైన వైరా మండలం స్నానాల లక్ష్మిపురం లోని పురాతన శివాలయం లో, మధిర నియోజకవర్గ కేంద్రంలో నీ శివాలయం లో పూజ కార్యక్రమాలు నిర్వహించారు. శివరాత్రి పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం, దేశ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తండ్రి రాజీవ్ గాంధీ కుటుంబం పేరిట దేవాలయాల్లో పూజలు చేయించారు. ప్రజాసంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్న ప్రభుత్వానికి శివపార్వతుల ఆశీస్సులు ఉండాలని ఆయన పూజలు నిర్వహించారు. స్వగ్రామమైన స్నానాల లక్ష్మీపురంలో శివపార్వతుల పూజ అనంతరం జాతరలో ఏర్పాటుచేసిన దుకాణాల్లో చిన్ననాటి మిత్రులతో కలిసి కలియతిరిగారు. మిఠాయిలు కొనుగోలు చేసి మిత్రులకు పంచుతూ ఆనందంగా గడిపారు. ఆలయ పరిసరాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను సమీక్షించారు. కార్యక్రమంలో ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురామరెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, గిడ్డంగుల సంస్థ కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఝరా సంగం ఆలయంలో బారులు తీరిన భక్తులు

**సంగారెడ్డిప్రజాబలం ప్రతినిధి:** దక్షిణ కాశీగా పేరు గాంచిన సంగారెడ్డి జిల్లా ఝరా సంగం మండల కేంద్రం లోని శ్రీ కేతకి సంగమేశ్వర స్వామి ఆలయం లో శివరాత్రి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి.ఝరాసంగం కేతకి ఆలయలోని పార్వతి సహిత శ్రీ కేతకి సంగమేశ్వర స్వామి వారి దర్శనానికి భక్తులు శివరాత్రి పర్వదినాన తెల్లవారు జామునుంచే బారులు తీరతారు.అమృత గుండంలో స్నానాలు ఆచరించి, గర్భగుడిలోని శివలింగానికి అభిషేకం చేస్తూ భక్తులు స్వామి వారి దర్శనం చేసుకున్నారు.ఈ ఆలయానికి ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర ల నుండి భక్తులు భారీగా తరలి వస్తున్నారు.ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ఆలయ అధికారులు చలువ పందిరి వేసి క్యూలైన్లు ఏర్పాటు చేశారు. మొగిలి పూలతో స్వామి వారికి పూజలు చేయడం ప్రత్యేకత, కాగా ఇక్కడి భక్తుల అమృత గుండం లో స్నానం ఆచరిస్తే సర్వ రోగాలు నివారణ జరుగుతుందని, ఇక్కడి అమృత గుండం లో ప్రసాదం వదిలి పెడితే కాశి కి చేరుతుందని ప్రతీతి.సౌకర్యార్థం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మంచినీటి సౌకర్యం, ఎప్పటికప్పుడు ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు సిబ్బంది ని నియమించారు. ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పకడ్బందీగా పోలీసులు బందోబస్త్ ను ఏర్పాటు చేశారు.
శివరాత్రి సందర్భంగా ఆలయాన్ని, ఆలయ పరిసరాలను మొత్తం రంగులతో ముస్తాబు చేశారు.రంగు

## ఉమ్మడి నల్గొండ జిల్లా శివరాత్రి వేడుకలు

**నల్గోండ ప్రజాబలం ప్రతినిధి:**మహాశివరాత్రి సందర్భంగా ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలోని ప్రముఖ శైవ క్షేత్రాలన్నీ భక్తులతో కిటకిటలాడుతున్నాయి. నల్లగొండ పట్టణ సమీపంలోని చారిత్రాత్మక పానగల్ ఛాయా సోమేశ్వరాలయం, పచ్చల సోమేశ్వరాలయాల్లో బుధవారం తెల్లవారుజాము నుంచే భక్తులు కుటుంబ సమేతంగా పూజల కోసం బారులు తీరారు. ముక్కంటి పరమేశ్వరుడి కటాక్షం కోసం అభిషేకాలు, పూజాధి కార్యక్రమాల్లో భక్తులు పాల్గొన్నారు. ఆ పరమశివుడి కృప తమపై ఉండాలని వారంతా వేడుకున్నారు.

# తిరుమలలో క్షేత్రపాలకుడికి వేడుకగా అభిషేకం



తిరుమలలోని గోగర్భం సమీపంలో గల రుద్రుని రూపమైన క్షేత్రపాలకుడికి బుధవారం వేడుకగా అభిషేకం జరిగింది. తిరుమల క్షేత్రానికి పాలకునిగా ఉన్న రుద్రునికి మహాశివరాత్రి సందర్భంగా ప్రతి ఏటా అభిషేకం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.ఈ సందర్భంగా శ్రీవారి ఆలయం నుండి ఆలయ మర్యాదలతో అధికారులు, అర్చకులు క్షేత్రపాలక శిల వద్దకు చేరుకున్నారు. పాలు, పెరుగు, చందనం, పన్నీరు, కొబ్బరినీళ్లు తదితర ద్రవ్యాలతో విశేషంగా అభిషేకం చేశారు. ఆ తర్వాత నైవేద్యం సమర్పించారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

## పటిష్ట బందోబస్త్ మద్య పోలింగ్ కేంద్రాలకు బ్యాలెట్ బాక్స్ ల తరలింపు

## జిల్లా ఎస్పీ అశోక్ కుమార్




జగిత్యాలపట్టభద్రుల మరియు ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలు సందర్భంగా జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ మరియు రిసెప్షన్ సెంటర్ ను జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ తో కలిసి ఎస్పీ సందర్శించారు. ఈ యొక్క డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుండి ఆయా ప్రాంతాలకు ఎన్నికల సామగ్రి పటిష్ట పోలీస్ బందోబస్త్ మద్య తరలించడం జరిగిందని ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా రూటు మొబైల్స్ ను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు.

## మార్చి 1న లక్ష రేషన్ కార్డులు ఒక్క రోజే భారీ మొత్తంలో పంపిణీకి ఏర్పాట్లు

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:**రంగారెడ్డి మహబూబ్ నగర్ జిల్లాల్లో డిస్ట్రిబ్యూషన్ మార్చి 8 తర్వాత మిగతా ప్రాంతాల్లో పంపిణీ హైదరాబాద్: ఒక్క రోజే లక్ష రేషన్ కార్డులు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. మార్చి 1వ తేదీన వీటిని పంపిణీ చేయనున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కోడ్ అమలులో ఉన్న జిల్లాల్లో వీటిని పంపిణీ చేయడం లేదు. ఆ రోజు హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్ నగర్ ఉమ్మడి జిల్లాల్లో కొత్త రేషన్ కార్డుల పంపిణీ ఉంటుంది. ఒకే రోజు లక్ష రేషన్ కార్డుల పంపిణీకి అన్ని ఏర్పాట్లను చేయాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. మిగతా జిల్లాల్లో మార్చి 8న అందించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది.తెలంగాణలో సుమారు 90 లక్షల రేషన్ కార్డులు ఉండగా, 2.81 కోట్ల మంది లబ్ధిదారులున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త కార్డుల జారీ ప్రక్రియపై కసరత్తు చేస్తోంది. సుమారు 6 లక్షల వరకు కొత్త కార్డులు జారీ అయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతున్నది. ఇదిలా ఉండగా జనవరి 26న ఎంపిక చేసిన గ్రామాల్లో 16,900 కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేసిన సంగతి తెలిసిందే.

# నెల్లూరు జిల్లా రాపూరు వద్ద ఎర్రచందనం దుంగల డంప్ పై టాస్క్ ఫోర్సు దాడి

## 12ఎర్రచందనం దుంగలతో సహా రెండు మోటారు సైకిళ్లు స్వాధీనం

## నలుగురు స్మగ్లర్ల అరెస్టు




నెల్లూరు రాపూరు మండలంలోని మార్లపూడి ఫారెస్టు పరిధిలో 12 ఎర్రచందనం దుంగలు కలిగిన డంప్ పై తిరుపతి ఎర్రచందనం టాస్క్ ఫోర్సు పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. డంప్ లో దాచి ఉంచిన 12ఎర్రచందనం దుంగలతో పాటు రెండు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకుని, నలుగురు స్మగ్లర్లను అరెస్టు చేశారు. ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక టాస్క్ ఫోర్స్ హెడ్ శ్రీ ఎల్. సుబ్బారాయుడు గారి ప్రత్యేక కార్యాచరణ మేరకు టాస్క్ ఫోర్సు ఎస్పీ శ్రీ పీ.శ్రీనివాస్ గారి అధ్వర్యంలో డీఎస్పీ శ్రీ జి. బాలిరెడ్డి మార్గ నిర్దేశకత్వంలో రైల్వే కోడూరు సబ్ కంట్రోల్ ఆర్ఐ కృపానందకు చెందిన ఆర్ఎస్ఐ రాఘవేంద్ర టీమ్ స్థానిక ఎఫ్ ఆర్ ఓ మాన్యాద్రి, ఎఫ్బీఓ మహేష్ తో కలసి మంగళవారం నుంచి నెల్లూరు జిల్లా ఫారెస్టు డివిజన్ పరిధిలో కూంబింగ్ చేపట్టారు. బుధవారం తెల్లవారు జామున రాపూరు మండలం గండూరు పల్లి సమీపంలో కొంత మంది వ్యక్తులు రెండు మోటారు సైకిళ్లతో నిలబడి ఉన్నారు. అనుమానం వచ్చిన టాస్క్ ఫోర్సు సిబ్బందికి వారిని చుట్టుముట్టే ప్రయత్నం చేయగా, వారు పారిపోసాగారు. వారిని వెంబడించిన టాస్క్ ఫోర్సు సిబ్బంది నలుగురుని పట్టుకోగలిగారు. వారిని నెల్లూరు జిల్లాకు చెందిన వారిగా గుర్తించారు. ఆ ప్రాంతంలోఎర్రచందనం దుంగల డంప్ కనిపించింది. అందులో 12 దుంగలు ఉన్నాయి. వాటిని స్వాధీనం చేసుకుని, నలుగురినిఅరెస్టు చేశారు. వారిని తిరుపతి టాస్క్ ఫోర్సు పోలీసు స్టేషన్ కు తరలించి కేసు నమోదు చేశారు. ఈ కేసును ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నాట్లు ఎస్ హెచ్ఓ డీఎస్పీ శ్రీ శ్రీనివాస రెడ్డి తెలిపారు.పారిపోయిన వారి కోసం గాలిస్తున్నట్లు చెప్పారు.

# బోడబండ పుణ్యక్షేత్రం నందు అన్నదాన కార్యక్రమం

## ఆంజనేయులు తాతకు కేజీ వెండి గొడుగులను అందజేసిన మదనంతపురం శ్రీరాములు

తుగ్గలి: మహాశివరాత్రి పండుగను పురస్కరించుకొని బోడబండ పుణ్యక్షేత్రంలో వెలిసిన శ్రీ పక్కిరప్ప గురు స్వాములు,శ్రీ ఎల్లప్ప గురు స్వాములు మరియు శ్రీ ఆంజనేయులు తాత వారి మహాశివరాత్రి ఉత్సవ వేడుకలను నిర్వాహకులు మరియు గ్రామ ప్రజలు వేడుకలను బుధవారం రోజున ఘనంగా నిర్వహించారు. గురువారం ఉదయం గంగ స్నానం అనంతరం మదనంతపురం శ్రీరాములు దంపతుల గార్లచే బోడబండ పుణ్యక్షేత్రానికి విచ్చేసిన భక్తుల కొరకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మదనంతపురం శ్రీరాములు తెలియజేశారు.ఎన్నో సంవత్సరాలుగా బోడబండ పుణ్యక్షేత్రం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలియజేశారు

# దేశంలోనే అత్యుత్తమంగా మంగళగిరి వంద పడకల ఆసుపత్రి నిర్మాణం

## ప్రశాంత వాతావరణంలో వైద్యులు పనిచేసేలా ఆసుపత్రిని తీర్చిదిద్దాలి

## మంగళగిరి ప్రజలకు అత్యుత్తమ వైద్యం అందించేలా ఆసుపత్రిని తీర్చిదిద్దాలి

## ఆసుపత్రి భవన నమూనాపై అధికారులతో మంత్రి లోకేష్ సమీక్ష



ఉండవల్లిః మంగళగిరి చినకాకాని వద్ద ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్న వంద పడకల ఆసుపత్రిని దేశంలోనే అత్యుత్తమంగా తీర్చిదిద్దాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఆదేశించారు. ఉండవల్లి నివాసంలో ఆసుపత్రి భవన నమూనాపై అధికారులతో మంత్రి సమీక్షించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా భవన నమూనాను అధికారులు వివరించారు. ఈ సందర్భంగా అధికారులకు మంత్రి పలు సూచనలు చేశారు. మంత్రి మాట్లాడుతూ.. మంగళగిరి ప్రజల 30 ఏళ్ల కల వంద పడకల ఆసుపత్రి. అత్యాధునిక వసతులతో వంద పడకల ఆసుపత్రిని తీర్చిదిద్దాలి. వంద పడకల విభాగంలో దేశానికి రోల్ మోడల్ గా ఆసుపత్రి నిలవాలి. ప్రశాంత వాతావరణంలో వైద్యులు పనిచేసేలా ఉండాలన్నారు. రోగులకు అత్యుత్తమ వైద్యం అందించేలా ఆసుపత్రిని తీర్చిదిద్దాలి.

ఆసుపత్రిలో వైద్య సేవలు పొందేందుకు ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూడాలన్నారు. డాక్టర్లు, పేషంట్లు, విజిటర్స్ కోణంలో జోన్లు రూపొందించాలని అధికారులకు సూచించారు. పేరెన్నికగన్న ఆసుపత్రుల భవన నమూనాలను పరిశీలించి అందకనుగుణంగా మార్పులు, చేర్పులు చేయాలన్నారు. అన్ని రకాల ఆధునిక వసతులతో ఉండేలా ఆసుపత్రి నిర్మాణం ఉండాలన్నారు. పార్కింగ్, మార్చురీ, ఇతర మౌలిక సదుపాయాల విషయంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నమూనాను రూపొందించాలని సూచించారు. ఈ సమావేశంలో ఏపీఎమ్ఎస్ఐడీసీ(ఆంధ్రప్రదేశ్ వైద్య విద్య, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ) సీఈ జి.సుధాకర్ రెడ్డి, ఎస్ఈ వి.చిట్టిబాబు, ఈఈ సీవీ రమణ, భార్గవ్ గ్రూప్ చీఫ్ ఆర్కిటెక్చర్ శ్రీమతి నిఖిల, ఏపీఎమ్ఎస్ఐడీసీ డీఈఈ ఎమ్. హనుమంతరావు నాయక్, ఏఈ జి.గోపీచంద్, ఏఈ కె.శివ సత్యనారాయణ, భార్గవ్ గ్రూప్ డీజీఎమ్ ఏ.శ్యామ్ కిషోర్, సీనియర్ ఇంజనీర్ డి.అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వైభవోపేతంగా చక్రధారుడి చక్రస్నానం

**బాదం, ఎండు ద్రాక్ష, నెమలి ఈకల మాలలతో శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం**

**ముగిసిన శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు**

తిరుపతి శ్రీనివాస మంగాపురం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన బుధవారం ఉదయం చక్రస్నానం శాస్త్రోక్తంగా జరిగింది. అర్చకులు, అధికారులు, భక్తులు పెద్ద ఎత్తున స్నానాలు ఆచరించారు.

అంతకుముందు ఉదయం 6.30 నుండి 7.30 గంటల వరకు స్వామి, అమ్మవార్లకు పల్లకీ ఉత్సవం నిర్వహించారు. ఉదయం 9 నుండి 10 గంటల వరకు పుష్కరిణి ఎదురుగా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వస్వామివారికి, శ్రీ సుదర్శన చక్రత్తాళ్వార్లకు స్నపనతిరుమంజనం వైభవంగా నిర్వహించారు. అనంతరం ఉదయం 10 గంటలకు చక్రస్నానం ఘనంగా జరిగింది.

ముందుగా కంకణ బట్టార్ శ్రీ నారాయణ ఆచార్యులు ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వస్వామివారికి, శ్రీ సుదర్శన చక్రత్తాళ్వార్లకు స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. అనంతరం చక్రస్నానం జరిగింది. ఇందులో విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, ముఖ ప్రక్షాళన, ధూపదీప నైవేద్యం, ఛత్ర ఛామర వ్యజన దర్పణాది నైవేద్యం, రాజోపచారం నిర్వహించారు. అర్ఘ్యపాద నివేదనలో భాగంగా పాలు, తేనె, కొబ్బరి నీళ్లు, పసుపు, గంధంతో స్నపనం నిర్వహించారు. వీటిని శంఖనిధి, పద్మనిధి, సహస్రధార, కుంభధారణలతో వైఖానస ఆగమోక్తంగా స్నపనం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఉపనిషత్తు మంత్రాలు, దశశాంతి మంత్రాలు, పురుషసూక్తం, శ్రీసూక్తం, భూసూక్తం, నీలాసూక్తం, విష్ణుసూక్తం వంటి పంచసూక్త మంత్రాలు, దివ్యప్రబంధంలోని అభిషేక సమయంలో అనుసంధానం చేసే వేదాలను టిటిడి వేదపారాయణదారులు పారాయణం చేశారు. ఈ వేడుకలో ఒక్కో క్రతువులో బాదం, ఎండు ద్రాక్ష, నెమలి ఈకలు, పవిత్రాలు, తులసి, ఉత్తమ జాతి పుష్ప మాలలను స్వామి, అమ్మవార్లకు అలంకరించారు.

# మెదక్- -నిజామాబాద్- కరీంనగర్-ఆదిలాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికలు పకడ్బందీ ఏర్పాట్లు

## 15 జిల్లాలలో మొత్తం 773 పోలింగ్ స్టేషన్లు, కరీంనగర్లో 103

## కంట్రోల్ రూమ్ నుండి నిరంతర పర్యవేక్షణ

## ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

## 15 జిల్లాల బ్యాలెట్ బాక్స్ లో స్వీకరణకు సర్వం సిద్ధం

## ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి




**కరీంనగర్ ప్రజాబలం ప్రతినిధి:** మెదక్- -నిజామాబాద్- కరీంనగర్-ఆదిలాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గాల ఈనెల 27న జరగనున్న పోలింగ్ ప్రక్రియకు పకడ్బందీ ఏర్పాట్లు పూర్తయినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు.

కరీంనగర్ జిల్లా కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఎన్నికల మెటీరియల్, బ్యాలెట్ బాక్సుల డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్లను కలెక్టర్ సందర్శించారు.

ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ప్రిసైడింగ్ అధికారులకు సిబ్బందికి, అధికారులకు దిశా నిర్దేశం చేశారు. జిల్లాలోని పోలింగ్ కేంద్రాలకు వెళ్లే రూట్ మ్యాప్ పై రూట్ ఆఫీసర్లతో చర్చించారు. బ్యాలెట్ బాక్సుల లాకింగ్ సిస్టం, సీలింగ్ పై మరోసారి అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. పోలింగ్ మెటీరియల్ సరిచూసుకోవాలని తెలిపారు.

ఈ సందర్బంగా ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన పలు అంశాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెల్లడించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి 56 మంది, ఉపాధ్యాయ స్థానానికి 15 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నట్లు తెలిపారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్లు 3లక్షల 55 వేల 159 ఉన్నారని పేర్కొన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లు 27 వేల 88 మంది ఉన్నారని తెలిపారు. అన్ని జిల్లాలలో కలిపి 499 గ్రాడ్యుయేట్ పోలింగ్ స్టేషన్లు, 274 టీచర్స్ పోలింగ్ స్టేషన్లో ఉన్నాయని వివరించారు. 93 కామన్ పోలింగ్ స్టేషన్లు ( గ్రాడ్యుయేట్స్, టీచర్స్) ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొత్తంగా అన్ని జిల్లాల్లో 773 పోలింగ్ స్టేషన్లో ఎన్నికలు జరుగుతాయని తెలిపారు.

కరీంనగర్ జిల్లాలో..

కరీంనగర్ జిల్లాలో 71 వేల 545 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉండగా, 4 వేల 305 మంది టీచర్స్ ఓటర్లు ఉన్నారు.

మొత్తం 103 పోలింగ్ స్టేషన్లలో పోలింగ్ జరుగుతుందని, ఇందులో 85 గ్రాడ్యుయేట్ పోలింగ్ స్టేషన్లు కాగా, 18 ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని తెలిపారు. రెవెన్యూ డివిజన్లో వారీగా పరిశీలిస్తే కరీంనగర్ రెవెన్యూ డివిజన్లో 69 గ్రాడ్యుయేట్, 12 టీచర్ పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని తెలిపారు. హుజరాబాద్ రెవెన్యూ డివిజన్లో 16 గ్రాడ్యుయేట్ 6 టీచర్స్ ఎమ్మెల్సీ పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని అన్నారు.

కరీంనగర్ జిల్లాలో మొత్తం 103 మంది ప్రిసైడింగ్ ఆఫీసర్లు, 312 మంది పోలింగ్ ఆఫీసర్లు, 36 మంది రిజర్వు సిబ్బంది, మొత్తం 451 మంది పోలింగ్ విధుల్లో ఉన్నారని తెలిపారు. జిల్లాలో 36 మంది మైక్రో అబ్జర్వర్లు, 12 మంది సెక్టార్ ఆఫీసర్లు విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు.ఈ ఎన్నికలలో ఓటర్లు ఓటు వేసేందుకు ఓటరు గుర్తింపు కార్డుతో పాటు, కేంద్ర ఎన్నికల సంఘం అనుమతించిన 12 రకాల గుర్తింపు కార్డులలో ఏదో ఒకదానిని చూపించి వారి ఓటు హక్కును వినియోగించ ుకోవాలని కోరారు.ఈ నెల 27న ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. పోలింగ్ ముగిసిన అనంతరం అన్ని జిల్లాల నుండి బ్యాలెట్ బాక్సులను కట్టుదిట్టమైన భద్రత మధ్య కరీంనగర్లోని అంబేద్కర్ స్టేడియంలో గల రిసెప్షన్ సెంటర్కు తరలిస్తామని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత తో 144 సెక్షన్ అమలు ఉంటుందని తెలిపారు. సీసీ కెమెరాల నిఘా తో పాటు కంట్రోల్ రూమ్ నుండి నిరంతర పర్యవేక్షణ ఉంటుందని వివరించారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

ప్రత్యేక సెలవు..

గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం నమోదిత ఓటర్లుగా ఉన్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగులు తమ ఓటు వినియోగించుకునేందుకు ప్రత్యేక సెలవు వర్తిస్తుందని తెలిపారు. వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక సంస్థ లేదా ఇతర అన్ని ప్రైవేట్ మేనేజ్మెంట్, అథారిటీలలో పని చేస్తూ గ్రాడ్యుయేట్ ఓటు హక్కు ఉన్న ఉద్యోగులు, కార్మికులు సైతం వారి ఓటు హక్కును వినియోగించుకునేందుకు యాజమాన్యాలు అనుమతి, వెసులుబాట్లు ఇవ్వాలని కోరారు.

ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్ద జిల్లా కలెక్టర్ తో పాటు అడిషనల్ కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీ కిరణ్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, ఆర్డీవో మహేశ్వర్, ఇతర జిల్లా అధికారులు ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించారు.

# ఘనంగా కొటప్పలకొండ శివరాత్రి ఉత్సవాలు

పల్నాడు కోటప్పకొండపై మహాశివరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. కొండపై కొలువై వున్న త్రికోటేశ్వర స్వామికి బుధవారం తెల్లవారుజామున 2 గంటలకు తొలిపూజ ప్రారంభమైంది. ఆలయ పూజారులు బిందెతీర్థంతో స్వామి వారికి అభిషేకం చేశారు. తొలిపూజకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఎమ్మెల్యే అరవిందబాబు, ఆలయ ఈవో చంద్రశేఖర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వరస్వామి దేవాలయంలో ఘనంగా మహాశివరాత్రి వేడుకలు నిర్వహించారు. స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు పొటెత్తారు. శివ నామస్మరణతో పరిసర ప్రాంతాలు మారుమోగాయి. వేకువజామునుంచే కొండకు చేరుకుని మహిళలు దీపాలు వెలిగించి భక్తిని చాటుకున్నారు. దీంతో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఈ సందర్భంగా శ్రీ త్రికోటేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు

# కూలిపోయిన డ్రోన్

కోటప్ప కొండకు మహా శివరాత్రిని పురస్కరించుకొని భక్తులు తరలివచ్చారు. భక్తులు తెల్లవారుజా నుంచే అమరేశ్వరుని దర్శనానికి బారులుతీరారు. కృష్ణానదిలో పుణ్యస్నానాలు, అనంతరం ఆలయ ఆవరణలో దీపాలు వెలిగించి పూజలు చేస్తున్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్లు, బస్సులకోసం ప్రత్యేక పార్కింగ్ స్థలం కేటాయించారు. ఆలయ ఆవరణలో క్యూలెన్లు, చలువపందిళ్లు ఏర్పాటు చేశారు అధికారులు. పోలీసులు కోటప్పకొండపై శాంతి భద్రతల పర్యవేక్షణ కోసం నిఘా పెట్టిన డ్రోన్ కూప్పకూలిపోయింది. బుధవారం ఉదయాన్నే సాంకేతిక సమస్యతో డ్రోన్ క్యాంటీన్ పైన ఉన్న విద్యుత్ తీగలపై పడింది. డ్రోన్ పడటంతో వైర్లుతెగి సమీపంలో ఉన్న ట్రాన్స్ఫార్మర్ నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. డ్రోన్ పడటంతో క్యాంటీన్ మూసివేశారు. ప్రమాద సమయంలో ఘటనాస్థలంలోనే పల్నాడు జిల్లా ఎస్పి శ్రీనివాసరావు, అడిషనల్ ఎస్పీ లు ఉన్నారు. సిబ్బందిని క్యాంటిన్ పైకి ఎక్కించి డ్రోన్ సురక్షితంగా కిందకి తీసుకొచ్చారు.

# ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

విశాఖపట్నం ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికను ఈనెల 27న నిర్వహించేందుకు యంత్రాంగం పూర్తి చేసింది.ఉత్తరాంధ్ర పరిధిలో ఉన్న ఆరు జిల్లాల్లో 22,493 మంది ఓటర్లు ఉన్నారు.వీరిలో పురుషులు 13,508, మహిళలు 8985 మంది ఉన్నారు.శ్రీకాకుళంలో-5035, విజయనగరం-5223, పార్వతీపురం మన్యం-2333, అల్లూరి-1488, విశాఖపట్నం-5529, అనకాపల్లిలో-2885 మంది చొప్పున ఓటర్లుగా అదికారులు గుర్తించారు.మూడు జిల్లాల పరిధిలో 123 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.ఫిబ్రవరి 27వ తేదీ గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది.మార్చి 3న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.అదే నెల 8వ తేదీతో ఎన్నికల ప్రక్రియ ముగియనుంది.

# లక్ష్మనేశ్వర ఆలయంలో పోటెత్తిన భక్తులు

నర్సాపురం పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురం మండలం లక్ష్మనేశ్వరం గ్రామంలో కొలువైన శ్రీ దుర్గా లక్ష్మనేశ్వర స్వామి ఆలయంలో మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భారీ సంఖ్యలు పరమశివుడిని దర్శించేందుకు భక్తులు పోటెత్తారు. వశిష్ట గోదావరి తీరాన్న వేంచేసి ఉన్న ఈ ఆలయనీ దక్షిణ కాశీగా పేరుగాంచింది. 11 సోమవారాలు స్వామివారిని దర్శించుకుంటే సంతానం కలుగుతుందని, వివాహలు జరుగుతాయని, ఆర్థిక కష్టాలు తీరతాయన్నది భక్తుల విశ్వాసం. ఏటా మహాశివరాత్రి పర్వదినాన్న లక్షలాదిమంది భక్తులు స్వామివారిని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తుంది. ఈ శివరాత్రికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ఆలయ ప్రాంగణం చుట్టూ పందిరిలో వేసి క్యూ లైన్ లను ఏర్పాటు చేశారు.

# గోదావరిలో ఐదుగురు గల్లంతు..

రాజమండ్రి తాళ్లపూడి మండలం తాడిపూడి గ్రామంలో శివరాత్రి రోజున విషాదం జరిగింది. గోదావరిలో స్థానాన్ని దిగి ఐదుగురు యువకులు గల్లంతు అయ్యారు. తిరుమల శెట్టి పవన్ (20), పడాల దుర్గాప్రసాద్ ( 19), అనిశెట్టి పవన్ (19), గర్రె ఆకాష్ ( 19), పడాల సాయి (19) లు గల్లంతు అయ్యారు. పోలీసులు ఫైర్ సిబ్బంది గాలింపు చర్యలు ప్రారంభించారు. మధ్యాహ్నం వరకు ఐదు మృతదేహాలు లభ్యమయ్యాయి. జిల్లా కలెక్టర్ ప్రశాంతి తాళ్లపూడి ఘటన వద్దకు చేరుకున్నారు

# విద్యార్థులు ఇష్టంగా చదివి మంచి మార్కులు సాధించాలి

## సర్కిల్ ఇన్స్పెక్టర్ సురేష్ బాబు

## కేరళ హైస్కూల్ లో ఫేర్వెల్ పార్టీ వేడుకలు

కోరుట్ల, విద్యార్థులు కష్టంతో కాకుండా,ఇష్టంగా చదివి పదోతరగతి లో మంచి మార్కులు సాధించాలని సర్కిల్ ఇన్స్పెక్టర్ సురేష్ బాబు సూచించారు.మంగళవారం పట్టణంలోని కేరళ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ లో 2024-25 పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం చాలా అట్టహాసంగా జరిగింది.ఈ సమావేశానికి ముఖ్య అతిథిలుగా పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ సురేష్ బాబు,ఎస్సై శ్రీకాంత్, ప్రముఖ న్యూలైఫ్ లైఫ్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ రమేష్, రామకృష్ణ డిగ్రీ కళాశాల కరస్పాండంట్ అంజయ్య, పిఆర్బీఎం
అండ్ అరుణోదయ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ పోతని ప్రవీణ్,ఆర్ఐ మహమూద్, గ్రీన్ వుడ్ స్కూల్ కరస్పాండెంట్ మొయిజ్, రిటైర్డ్ పిఈటీ వెంకటరెడ్డి గంగాధర్ హాజరయ్యారు.
విద్యార్థులు తమ భవిష్యత్ ను ఎలా తీర్చిదిద్దుకోవాలో వివరించారు,
ఈ సందర్భంగా సర్కిల్ ఇన్స్పెక్టర్
సురేష్ బాబు మాట్లాడుతూ మార్చి 2025 లో జరగబోయే పదవ తరగతి బోర్డు పరీక్షలకు ఎటువంటి భయభ్రాంతులకి లోను కాకుండా పట్టుదలతో చదివి పరీక్షలు వ్రాయాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాలకు, తల్లితండ్రులకు మంచి పేరు తీసుకురావాలని, ఎలాంటి పోటీ పరీక్షలలోనైనా సరే నెగ్గాలంటే యువతను ముఖ్యంగా పాడు చేస్తున్న డ్రగ్స్ అండ్ మొబైల్ ఫోన్స్ లకు దూరంగా ఉండాలని సూచించారు. తల్లితండ్రులు కూడా పిల్లలపై నిరంతర పర్యవేక్షణ చేస్తూ ఎలాంటి తప్పుదారి లోకి వెళ్లకుండా శ్రద్ధ వహిస్తూ అవసరమైన సందర్భంలో సున్నితంగా హెచ్చరించాలని అప్పుడే విద్యార్థులు జీవితంలో ఉన్నత విజయాలను సాధించగలరని తెలియజేశారు, ఆనంతరం కేరళ హైస్కూల్ లో గత కొన్ని సంవత్సరాలుగా భోదిస్తూ ఇటీవలే ప్రభుత్వ ఉపాధ్యాయులు గా, ఉద్యోగులుగా ఎంపికైన విశ్వనాథ్, కుసుమ నరేష్,రవళి,మధు,రమ,శృతి
మరియం ఫాతిమ ఈ మధ్యే విడుదలైన జూనియర్ లెక్చరర్ (గెజిటెడ్)జువాలాజి లెక్చరర్ గా
ఎంపికై యువతకి ఆదర్శంగా నిలిచిన వీరందరిని ముఖ్య అతిథుల చేతులమీదుగా శాలువాలతో, పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చిన్నారులు ఆద్యంతం అనేక రకాల సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అందరిని అలరించారు.ఈ కార్యక్రమంలో కేరళ హైస్కూల్ కరస్పాండంట్ ఎం.ఏ బారి, ప్రిన్సిపాల్ సెలీన్ బారీ, చైర్మన్
ఎం.ఏ హాది, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రాడ్యుయేట్స్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం



జగిత్యాల, :జిల్లాలో స్వేచ్ఛయుత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు పోలీస్ అధికారులు, సిబ్బంది కృషి చేయాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు.ఎన్నికల విధుల్లో భాగంగా పోలీస్ అధికారులు,సిబ్బందితో జిల్లా కేంద్రం లోని దేవి శ్రీ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన బ్రీఫింగ్ కార్యక్రమం నిర్వహించారు.ఎన్నికల విధులకు సంబడించి పోలీసు అధికారులు, సిబ్బందికి ఎన్నికల ప్రాముఖ్యతను వివరిస్తూ, ఎన్నికల విధులు ఏవిధంగా పకడ్బందీగా నిర్వహించాలి అని, సిబ్బంది చేయవలసిన, చేయకూడాని విధుల గురించి జిల్లా ఎస్పీ క్షుణ్ణంగా వివరించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... గతంలో జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికలు నిర్వహించడం జరిగిందని అదే స్ఫూర్తితో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు.పోలింగ్ సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాన్ని ఎట్టి పరిస్థితులలోనూ వదిలి వెళ్లరాదన్నారు.ఓటు హక్కును వినియోగించుకోవడానికి వచ్చిన వారితో మర్యాద పూర్వకంగా ఉండాలని, అనవసర విషయాలు చర్చించవద్దన్నారు. పోలింగ్ జరుగుతున్న సమయంలో పోలింగ్ ప్రశాంత వాతావరణానికి భంగం కలిగే ఏ చిన్న సంఘటన ఎదురైన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలన్నారు. ఓటర్లు ఎవ్వరూ కూడా సెల్ ఫోన్ లు, మందుగుండు సామాగ్రి, ఇంక్ బాటిల్స్, వాటర్ బాటిల్స్, పోలింగ్ బూతు లోనికి తీసుకువెళ్లారాదని, సెల్ఫీలు దిగడం నిషేదం అన్నారు. పోలింగ్ ముగిసిన తరువాత ఉన్నతాధికారాలు ఆదేశాలు లేనిదే ఎవ్వరూ కూడా తమ విధులనుండి వెళ్లరాదన్నారు.ఎవరైనా చట్ట వ్యతిరేఖ కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరంగా




కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ఎన్నికల సంఘంచే జారీ చేయబడిన నియమాలను పక్కగా అమలు చేస్తామన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగటానికి ఆస్కారం ఉన్న వెంటనే సంబంధిత యస్.హెచ్.ఒ. లకు,రూట్ మొబైలు అధికారికి సమాచారం అంధించాలన్నారు.ఎట్టి పరిస్తుతుల్లోనూ అనాథరైజ్డ్ పర్సన్స్ పోలింగ్ స్టేషన్ లోనికి వెళ్లారాదని సూచించారు.జిల్లాలో మొత్తం (71) పోలింగ్ కేంద్రాల్లో గ్రాడ్యుయేట్స్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ జరుగుతుందని దీనికి సంబంధించి (233) మంది పోలీసు సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారని అన్నారు. పటిష్టమేనా ఎస్కార్ట్ తో పోలింగ్ సామాగ్రిని పోలింగ్ కేంద్రాలకు తరలించడం జరుగుతుంది (12) రూట్స్ లలో సిబ్బంది అప్రమత్తంగా ఉంటారని, ఇద్ధరు డీఎస్పీలతో స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ ,(6) సీఐ లతో స్ట్రైకింగ్ ఫోర్స్ టీమ్స్,ఎస్.ఐ లతో (18) పెట్రోలింగ్ టీమ్స్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు.
ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ భీంరావు, డిఎస్పీలు రఘు చందర్, రాములు,ఎస్బీ ఇన్స్పెక్టర్ ఆరీఫ్ అలీ ఖాన్, సి.ఐ లు వేణుగోపాల్,రవి,రామ్ నరసింహా రెడ్డి,సురేష్, రవి,ఆర్.ఐ లు వేణు,ఎస్.ఐ లు పోలీస్ సిబ్బంది,పాల్గొన్నారు.
పటిష్ట బందోబస్త్ మద్య పోలింగ్ కేంద్రాలకు బ్యాలెట్ బాక్స్ ల తరలింపు
పట్టభద్రుల,ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలు సందర్భంగా జిల్లా కేంద్రం లోని మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ అండ్ రిసెప్షన్ సెంటర్ ను జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ తో కలిసి ఎస్పీ సందర్శించారు. ఈ యొక్క డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుండి ఆయా ప్రాంతాలకు ఎన్నికల సామగ్రి పటిష్ట పోలీస్ బందోబస్త్ మద్య తరలించడం జరిగిందని ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా రూటు మొబైల్స్ ను ఏర్పాటు చేయడం జరిగిందని ఎస్పీ అన్నారు.

## శివగంగా రాజరాజేశ్వర స్వామిలో ఆలయం లో ఎమ్మెల్యే సబిత పూజలు

**మహేశ్వరం ప్రజాబలం ప్రతినిధి:** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండల కేంద్రంలోని శ్రీ శివగంగా రాజరాజేశ్వర స్వామిలో ఆలయం లో మహా శివ రాత్రి సందర్భంగా స్వామి వారిని,దర్శించుకున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, యువ నాయకులు, కౌశిక్ రెడ్డి. పూర్ణకుంబంతో స్వాగతం పలికిన ఆలయ ప్రధాన అర్చకులు, అనంతరం . ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తో పాటు తనయుడు కౌశిక్ కలిసి మహారుద్రబిషేకం నిర్వహించారు.
ఈసందర్భంగా సబిత మాట్లాడుతూ అందరికీ మహా శివరాత్రి శుభాకాంక్షలు తెలియజేస్తూ రాష్ట్ర ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకుంటూ మహేశ్వరంలో శ్రీ రాజరాజేశ్వరి శివగంగా భగవంతుని దర్శనం చేసుకోవడం సంతోషం. ఆ శివుని చల్లని చూపుతో ఈ రాష్ట్రంలో ఉన్న అన్ని సమస్యలు కూడా రైతులు గాని, మహిళల సమస్యలు అన్ని కూడా బయటపడాలని దేవుని వేడుకుంటున్నాం. ాఒఃఅ లో చిక్కిన 8 మందిని ప్రభుత్వం పట్టించుకోవడం లేదు, భగవంతుడైన రక్షించాలని దేవుని ఆశీర్వాదంతో బతికి రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా ఇక్కడకి వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం జరగకుండా మంచి ఏర్పాట్లు చేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం ప్రజలందరికీ మహాశివ రాత్రి శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రజానీకానికి మహాశివరాత్రి శుభాకాంక్షలు – మంత్రి ఆనం

కోటప్పకొండ పవిత్రమైన మహాశివరాత్రి సందర్భంగా, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి గారు నేడు నెల్లూరు జిల్లా, ములాపేట లోని స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించి, రాష్ట్ర ప్రజల సంక్షేమం, శాంతి, సౌభాగ్యాల కోసం ప్రార్ధనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహాశివరాత్రి పండుగను పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్నటువంటి దాదాపు 30 శైవక్షేత్రంలో మహాశివరాత్రి ఘనంగా నిర్వహిస్తూ ప్రజలందరికీ భాగస్వామ్యం కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం వ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు అనేక పండుగలు నిర్వహించిన మాదిరిగానే ఈ శివరాత్రిని కూడా ఘనంగా నిర్వహిస్తున్నాం. ప్రతి ఆలయంలో కూడా సామాన్య భక్తులకి పెద్దపీట వేసి వారందరికీ కూడా పరమ శివుని యొక్క దర్శనం అమ్మవారి ఆశీస్సులు కలిగే విధంగా అధికారులకు ఆదేశాలు ఇచ్చాం పాలకవర్గాలు గాని అధికారులు విధులు ఘనంగా నిర్వహిస్తున్నారు. అన్ని శైవ క్షేత్రలలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక దేవాదాయ శాఖ అధికారిని కూడా నియమించి ప్రత్యక్ష పర్యవేక్షణలో చూస్తూ ఉన్నాం.. గతంలో కంటే ఎక్కువ శాతం ప్రజలు భక్తులు ఆధ్యాత్మికంగా తమ భక్తి ప్రవర్తనని భగవంతుడు దగ్గర నిర్వహించుకోవడానికి దాదాపు గతం కన్నా ఎక్కువ గా అన్ని శైవ క్షేత్రాలకు భక్తులు రావడం జరుగుతుంది. రాష్ట్రంలో ప్రతి ఆలయంలో భక్తి భావం పరవశించిపోతుంది. ఎక్కడ కూడా ఎటువంటి అవాంతరం ఘటన లు జరగకుండా జిల్లా స్థాయి అధికారి మొదలు అందరు అధికారులు స్వామి వారి సేవలో నిమగ్నమై ఉన్నారు.. అదే క్రమం లో లక్షలాదిగా ఇవాళ జన సమూహం కాలి నడకన భక్తులు కొండలు ఎక్కి దైవ దర్శనం కోసం వస్తున్నారు.. వాళ్ల అందరికి తగిన ఏర్పాట్లు చేశాము. మొన్న శ్రీశైలంలో ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలు సమర్పించాము, నిన్న శ్రీకాళహస్తిలో సమర్పించాము నేడు మూలస్థా?నేశ్వర స్వామి ఆలయానికి వచ్చి స్వామి ఆశీస్సులు తీసుకోవడం జరిగింది. ఈ రోజు సాయంత్రం కోటప్పకొండకు వెళ్లి ప్రభుత్వం తరఫున స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తాను.ప్రభుత్వం మూడు ఆలయాలను రాష్ట్ర పండుగలు నిర్వహించడానికి నిర్ణయం తీసుకుంది అందులో భాగంగానే శ్రీకాళహస్తి, శ్రీశైలం,కోటప్పకొండ క్షేత్రం రాష్ట్ర పండుగ గుర్తించడం జరిగింది. ఈరోజు స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి కోటప్పకొండ లో పట్టు వస్త్రాలు సమర్పించాల్సి ఉంది.కానీ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉండటం చేత రాష్ట్ర ప్రభుత్వం తరఫున దేవాదాయ శాఖ మంత్రి గా నన్ను పంపడం జరిగింది. స్వామి వారి ఆశీస్సులు అందరికి ఉండాలని కోరుకుంటూన్నాను... ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ అధికారులు, భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# కీసర బ్రహ్మోత్సవాల బందోబస్తును పర్యవేక్షించిన సీపీ సుధీర్ బాబు



**మేడ్చల్ ప్రజాబలం ప్రతినిధి:** మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ప్రారంభమైన కీసరగుట్ట బ్రహ్మోత్సావాల బందోబస్తు ఏర్పాట్లను రాచకొండ కమిషనర్ శ్రీ సుధీర్ బాబు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా అనుకోకుండా కాలికి గాయం అయ్యి అస్వస్థతకు గురైన ఒక వ్యక్తికి కమిషనర్ స్వయంగా దగ్గరుండి ప్రాథమిక చికిత్స అందించి తన గొప్ప మనసును చాటుకున్నారు. తక్షణమే మెరుగైన వైద్యం కోసం అంబులెన్సులో ఆసుపత్రికి పంపించారు.
ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలియజేశారు. ఉత్సవాల ప్రారంభానికి 15 రోజుల ముందుగానే తాము భద్రత ఏర్పాట్లు మొదలుపెట్టామని, అన్ని స్థాయిల సిబ్బందికి

# ఏనుగుల దాడి మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు ఎక్స్ గ్రేషియా



రాయచోటి, అన్నమయ్య జిల్లాలోని కోడూరు నియోజకవర్గంలోని ఓబులవారి పల్లి మండలంలో జరిగిన ఏనుగుల దాడిలో చనిపోయిన వారికి 10 లక్షల ఎక్స్గ్రేషియా ప్రకటిస్తున్నామని, చికిత్స పొందుతున్న వారికి ప్రభుత్వం సహాయంతో నగదు రహిత చికిత్స అందిస్తున్నామని, శివరాత్రి సందర్భంగా భక్తులు ఎవరు అటవీ ప్రాంతంలోకి వెళ్లరాదని, గుండ్లకోన శివాలయం దగ్గరికి కేవలం నలుగురు భక్తులకు మాత్రమే అనుమతి అని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు
బుదవారం రాయచోటి కలెక్టరేట్లోని విసి హాల్లో.ఈరోజు ఉదయం రెండు నుంచి రెండున్నర గంటల మధ్యలో ఓబులవారి పల్లి మండలం, వై కోట దగ్గర జరిగిన ఏనుగుల దాడి, శివరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తులకు సూచనలు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి పాత్రికేయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.ఉలగట్టు పాడు మరియు కన్నగుంట ఎస్టి కాలనీ లకు చెందిన కొంతమంది శివ భక్తులు... కె.వి బావి బీట్ రేంజ్ నుండి తలకోన శివాలయానికి అడవి గుండా ప్రయాణం చేస్తుండగా వై కోట గ్రామం, కె.వి భవి బీట్ రేంజ్ దగ్గర.మంగళవారం ఉదయం2:00 గంటల నుండి 2:30 గంటల మధ్యలో జరిగిన అడవి ఏనుగుల దాడిలో ముగ్గురు వ్యక్తులు చనిపోయారని, ఇద్దరికీ తీవ్ర గాయాలు అయ్యాయని మరో ఇద్దరికి స్వల్ప గాయాలు అయ్యాయని పేర్కొన్నారు. అటవీ ప్రాంతంలో నుండి వెళ్లడానికి ప్రయత్నం చేసినప్పుడు అటవీ శాఖ అధికారులు వారిని రిజర్వ్ అటవీ ప్రాంతం నుంచి వెళ్లకూడదని హెచ్చరించినప్పటికీ భక్తులు రిజర్వ్ అటవీ ప్రాంతం నుండి వెళ్లడం జరిగిందన్నారు. మార్గమధ్యంలో వారికి పిల్ల ఏనుగులు కనపడినప్పుడు గిన్నెలతో శబ్దాలు చేయడంతో తల్లి ఏనుగులు వారి మీద దాడి చేయడం జరిగిందన్నారు. చనిపోయిన తుపాకుల మణెమ్మ, తుపాకుల చందర్ రాయుడు, వంకాయల దినేష్ ల కుటుంబాలకు ప్రభుత్వం తరఫున 10 లక్షల రూపాయల ఎక్స్గ్రేషియా ఇవ్వడం జరుగుతుందన్నారు. తీవ్రంగా గాయపడ్డ పరిగల రాజశేఖర్ అమర ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, ప్రాణాపాయం లేదని డాక్టర్లు చెప్పినట్టుగా పేర్కొన్నారు. తీవ్రంగా గాయపడ్డ మరో వ్యక్తి పాపమ్మ, రుయా ఆసుపత్రిలో చికిత్స పొందుతోందని ప్రాణాపాయం లేదని పేర్కొన్నారు. మరో ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారని వారు కోడూరు లోని సిహెచ్సి లో చికిత్స పొందుతున్నారు అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మరియు ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్లు చికిత్స పొందుతున్న వారి బంధువులతో మాట్లాడి వైద్య సదుపాయాల అందిస్తున్నారు అన్నారు. చికిత్స పొందుతున్న వారందరికీ క్యాష్ లెస్ ట్రీట్మెంట్ను ప్రభుత్వం కల్పించడం జరుగుతుందన్నారు. గాయాలైన వారికి చికిత్స తో పాటు రెండు లక్షల రూపాయలు ఎక్స్గ్రేషియా ప్రకటించినట్లుగా పేర్కొన్నారు.అనంతరం శివరాత్రి పండుగ సందర్భంగా జిల్లా కలెక్టర్ భక్తులందరికీ వివిధ సూచనలను చేశారు. బుధవారం శివ శివరాత్రి పండుగ సందర్భంగా భక్తులెవరు అడవి లోపలికి వెళ్ళకూడదని, అడవి లోపలికి టపాసులు తీసుకెళ్లరాదని, సూచించారు. శివాలయాలకు వెళ్ళేటప్పుడు అధికారిక రహదారులను మాత్రమే వినియోగించుకోవాలని సూచించారు. గుండ్లకోన శివాలయానికి వెళ్లే భక్తులకు సూచనలిస్తూ. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల దృష్ట్యా నలుగురిని మాత్రమే శివుడి ప్రతిమను తీసుకెళ్లేందుకు అనుమతించబడుతుందని తెలిపారు.ఈ పాత్రికేయ సమావేశంలో డిఆర్ఓ మధుసూదనరావు పాల్గొన్నారు.
తీవ్రగ్భ్రాంతి వ్యక్తం చేసిన మంత్రి:
ఓబులవారిపల్లె మండలం, గుండాలకోన వద్ద ఏనుగుల దాడిలో ముగ్గురు భక్తులు మృతి చెందడంపై రాష్ట్ర రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.మహా శివరాత్రి సందర్భంగా శివాలయాలకు వెళ్తున్న భక్తులపై మంగళవారం గుండాలకోన వద్ద ఏనుగులు దాడి చేశాయి.ఈ ఘటనలో ముగ్గురు భక్తులు అక్కడికక్కడే మృతి చెందడం జరిగింది. ఇద్దరికీ తీవ్ర గాయాలు కాగా వారి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని మంత్రి వైద్యాధికారులకు సూచించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.
గాయపడిన వారి పరిస్థితిపై మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి వైద్యులకు ఫోన్ చేసి ఎప్పటికప్పుడు వివరాలు తెలుసుకుంటున్నారు.
ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఫారెస్ట్ అధికారులను కోరారు.

# శివనామ స్మరణతో మారుమ్రోగిన శివాలయాలు

## ఉపవాస దీక్ష పారవశ్యంతో మాహా శివరాత్రి వేడుకలు

## భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు.

## శివపార్వతుల ధర్షణానికై క్యూ లైన్ లో భారులు తీరిన భక్తులు



మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా బుధవారం ఉదయం అభిషేకాలు, అర్చనలు, హారతులు ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు.

తూప్రాన్, ఫిబ్రవరి,26. ప్రజాబలం ప్రతినిధి :– మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా బుధవారం తెల్లవారుజామున అత్యంత మహిమాన్వితమైన శివాలయంలో పరమ పవిత్రమైన శివుని అనుగ్రహం కోసం రుద్రాభిషేకం తో పాటు అర్చనలు, హారతులు, తీర్థ ప్రసాదాలు వితరణ జరిగింది. ఆలయ ప్రాంగణం శివనామ స్మరణతో మారుమ్రోగింది. భక్తులు ఉపవాస దీక్ష పారవశ్యంతో మాహా శివరాత్రి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. తూప్రాన్ లోని శివాలయం, మల్లిఖార్జున్ స్వామి దేవాలయం భక్తులతో కిటకిటలాడాయి. ఉపవాస దీక్షలు చేస్తున్న భక్తులు శివపార్వతుల ధర్షణానికై క్యూ లైన్ లో భారులు తీరారు. శివరాత్రి పర్వదినం సందర్భంగా శివాలయ ప్రధాన అర్చకులు వేదపండితులు మధు పంతులు మాట్లాడుతూ

మహాశివరాత్రి హిందువులు ఆచరించే ఒక ముఖ్యమైన పండగ లలో ఒకటి అని తెలిపారు. ఇది శివ, పార్వతుల వివాహం జరిగిన రోజు అని, ఈ రోజు రాత్రి శివుడు తాండవం చేసే రోజు హిందువులు పవిత్రంగా భావించి ప్రత్యేక పూజలు, ఉపవాస దీక్షలు చేసి ఖర్జూర పండు, కొబ్బరి నీళ్లతో ఒకపొద్దు యిడుస్తారు. శీతాకాలం చివర్లో వేసవి కాలం ముందు వచ్చే మాఘ మాసంలో రోజుని మహాశివరాత్రి పండుగ ను జరుపుకుంటారని అన్నారు. అధ్భుతమైన శివుని రేయి" మహాశివరాత్రి అనేది భారతదేశ ఆధ్యాత్మికతలో ఎంతో ప్రముఖమైంది. ఈ రాత్రి ఎందుకు అంత ప్రముఖమైందో ఇంకా దానిని ఎలా ఉపయోగించుకోవాలనే విషయాన్నీ మధు పంతులు వివరించారు. భారత సంస్కృతిలో సంవత్సరానికి 365 పండుగలు ఉండేవి. ఈ 365 పండుగలు వేర్వేరు కారణాలకి ఇంకా జీవితంలోని వేర్వేరు ప్రయోజనాల కోసం సూచించబడ్డాయి అని అన్నారు. వారు వివిధ చారిత్రక సంఘటనలు, విజయాలుకు సూచనగా లేదా విత్తనాలు నాటడం ఇంకా పంటకోత వంటి జీవితంలో కొన్ని సందర్భాలను వేడుకగా జరుపుకునేవారు. ప్రతీ సందర్భానికి ఒక పండుగ ఉండేది. కానీ మహాశివరాత్రికి మాత్రం ఒక ప్రత్యేక విశిష్టత ఉంది. ప్రతీ చాంద్రమాన మాసం లోని 14వ రోజు లేదా అమావాస్యకు ముందు రోజుని శివరాత్రి అంటారు. పంచాంగ సంవత్సరంలో వచ్చే పన్నెండు శివరాత్రులలో ఫిబ్రవరి %-% మార్చ్ లలో వచ్చేదానికి ఆధ్యాత్మిక ప్రాధాన్యం ఉంది. ఈ రాత్రి, భూమి ఉత్తర అర్ధగోళం ఎటువంటి స్థితిలో ఉంటుందంటే, మనిషిలోని శక్తి సహజంగానే ఉప్పొంగుతుంది. ఈ రోజున ప్రకృతి మిమల్ని ఆధ్యాత్మిక శిఖరానికి నెడుతుంది. దీనిని ఉపయోగించుకోవడానికే, ఈ సంస్కృతిలో రాత్రంతా జరిపే ఈ పండుగను నెలకొల్పారు. మనం తెల్లవార్లూ జాగారం చేసి మన వెన్నెముకను నిటారుగా ఉంచడం ద్వారా ఇలా శక్తులు సహజంగా పైకి ఎగసి పడడానికి సహకరించవచ్చు. ఆధ్యాత్మిక మార్గంలో ఉన్నవారికి మహాశివరాత్రి ఎంతో ప్రముఖమైనది. కుటుంబ పరిస్థితులలో ఉన్నవారికి, ప్రపంచంలో గాఢమైన ఆకాంక్ష ఉన్నవారికి కూడా మహాశివరాత్రి ఎంతో ఆవశ్యకం. కుటుంబ పరిస్థితులలో నివసించేవారు, మహాశివరాత్రిని శివుని పెళ్లిరోజుగా చూస్తారు. ప్రాపంచిక లక్ష్యాలతో ఉన్నవారు, ఈ రోజును శివుడు తన శత్రువులందరినీ జయించిన రోజుగా చూస్తారు. కానీ సన్యాసులకు మాత్రం ఈ రోజు ఆయన కైలాష పర్వతంతో ఒకటయిన రోజు. ఆయన పరిపూర్ణ నిశ్చలత్వంతో, పర్వతంలా అయిపోయాడు. కానీ యోగ సంప్రదాయంలో శివుణ్ణి దేవుడిగా భావించరు, యోగ శాస్త్రానికి మూలకారకుడైన ఆదియోగి లేదా ఆదిగురువుగా చూస్తారు. ధ్యానంలో ఎన్నో వేల సంవత్సరాలు ఉన్న తరువాత ఒకరోజు ఆయన పూర్తిగా నిశ్చలుడయ్యాడు. ఆ రోజే మహాశివరాత్రి. ఆయనలోని అన్ని కదలికలు ఆగిపోయి సంపూర్ణంగా నిశ్చలుడయ్యాడు. అందుకనే మహాశివరాత్రిని సన్యాసులు నిశ్చలత్వానికి ప్రతీకమైన రాత్రిగా చూస్తారు. ఇతిహాసాలను పక్కన పెడితే , ఈ రోజు ఇంకా రాత్రికి యోగ సాంప్రదాయంలో ఇంత ప్రాముఖ్యత , ఆధ్యాత్మిక సాధకునికి ఇది కల్పించే అవకాశాలు వలన వచ్చిందే. ఆధునిక విజ్ఞాన శాస్త్రం ఎన్నో దశల అధ్యయనం తరువాత ఈరోజున మీకు ఏమని నిరూపిస్తున్నారంటే %-% మీకు జీవంగా తెలిసిన ప్రతీదీ, మీకు తెలిసిన ప్రతీ పదార్థం ఇంకా ఉనికి, మీకు తెలిసిన జగత్తు ఇంకా పాలపుంతలు, ఇవన్నీ కూడా కేవలం ఒకే శక్తి వివిధ లక్షల రూపాల వ్యక్తీకరణ అని. ఈ శాస్త్రీయ వాస్తవం ప్రతి యోగిలో ఒక అనుభవపూర్వక వాస్తవికత. "యోగి" అనే పదానికి అర్థం ఈ ఉనికి యొక్క ఏకత్వాన్ని గ్రహించినవాడని. నేను "యోగ" అన్నప్పుడు, దానర్థం నేనేదో ఒక అభ్యాసమో లేక పద్ధతి గురించో మాట్లాడటంలేదు. అవ్యవస్థలో ఉన్న ఏకత్వం గురించి తెలుసుకోవాలనే అన్ని కోరికలు, ఈ ఉనికిలో ఉన్న ఏకత్వాన్ని గురుంచి తెలుసుకోవాలనే వాంఛలు ఉంటే %-% అదే యోగ. దీనిని అనుభవపూర్వకంగా అనుభవించడానికి మహాశివరాత్రి ఓ అవకాశాన్ని అందిస్తుందనీ ఉద్ఘాటించారు.

# అర్హత గల ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి

## జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్



ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 26 : ఈ నెల 27వ తేదీన జరగనున్న,మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ నియోజకవర్గాల ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎన్నికల పోలింగ్ లో జిల్లాలో అర్హత గల ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసిన కార్యాలయాలు/సంస్థలు/ ప్రభుత్వ పాఠశాలలు/ విద్యా సంస్థలకు ఈ నెల 27న పోలింగ్ రోజు,26న పోలింగ్ ముందు రోజు,మార్చ్ 3వ తేదీ కౌంటింగ్ రోజులలో వేతనంతో కూడిన సెలవు ప్రకటించడం జరిగిందని తెలిపారు.

## పాదగయ లో మహాశివరాత్రి వేడుకలు

పిఠాపురం "హరహర మహాదేవ శంభోశంకర" అంటూ భక్తుల శివనామ ఘోషతో పిఠాపురం పుణ్యక్షేత్రం మార్మోగింది.మహాశివరాత్రి సందర్భంగా ప్రసిద్ధ శైవక్షేత్రమైన పిఠాపురంలో పాదగయాక్షేత్రం శ్రీ కుక్కుటేశ్వరస్వామివారి దేవస్థానం లక్షలాది మంది భక్తులతో కిక్కిరిసిపోయింది. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మంగళవారం అర్థరాత్రి నుంచే లక్షలాదిమంది భక్తులు పాదగాయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించారు.అనంతరం క్యూ లైన్లలో వెళ్ళి స్వామివారిని దర్శించుకున్నారు.స్వామివారికి ఆలయ అర్చకులు అభిషేకాలు నిర్వహించారు.కాగా.,టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి,పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ, లక్ష్మీదేవి దంపతులు, జిల్లా ఉన్నతాధికారులు, రాజకీయ ప్రముఖులు పలువురు స్వామివారిని దర్శించుకున్నారు.భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పోలీస సిబ్బంది,దేవస్థానం అధికారులు,సిబ్బంది పర్యవేక్షణ చేశారు..

# ఎల్లలు దాటేలా ఏడుపాయల జాతర

## భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలి

## రాష్ట్ర, జిల్లా ప్రజలు పాడిపంటలు, సుఖశాంతులతో సుభిక్షంగా ఉండాలి

## అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి

## ప్రభుత్వం నుంచి అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి

## ౨జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



మెదక్ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి :– శివరాత్రి పర్వదినం సందర్భంగా ప్రతిష్టాత్మక మహిమాన్విత ఏడుపాయల దుర్గ భవాని మాతను జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ కుటుంబం సమేతంగా పట్టు వస్త్రాల సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.

ఇంతకుముందు జిల్లా కలెక్టర్ కు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

ప్రత్యేక పూజలు అనంతరం జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ ఎల్లలు దాటేలా ఏడుపాయల జాతర జరగాలన్నారు.

మెదక్ జిల్లా పాపన్నపేట మండలంలోని నాగసానిపల్లి లో ఉన్న ప్రతిష్టాత్మక మహిమాన్విత ఏడుపాయల జాతర శివరాత్రి మొదలుకొని మూడు రోజులు జరుగుతుందని ఈ జాతరకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ట్రాఫిక్, త్రాగునీరు, విద్యుత్, పరిశుభ్రత కార్యక్రమాలను ఎప్పటికప్పుడు అధికారులు పరిశీలించాలన్నారు. భక్తులందరూ మూడు రోజులు పాటు జరిగే జాతరలో ప్రశాంతంగా దర్శనాలు , ప్రత్యేక పూజలు చేసి అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని పేర్కొన్నారు.

రాష్ట్ర, జిల్లా ప్రజలు పాడిపంటలు సుఖసంతోషాలతో సుభిక్షంగా ఉండాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఉపవాస దీక్షకులకు పలహారాల పంపిణీ

## పది సంవత్సరాలుగా దిగ్విజంగా కొనసాగుతున్న ఉచిత పండ్ల పంపిణీ.



సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 26(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా/సదాశివపేట/మహా శివరాత్రి పర్వదినం పురస్కరించుకొని స్థానిక ఈశ్వర మార్కండేయ మందిరంలో సదాశివపేట పట్టణ మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీమతి పిల్లోడి జయమ్మ, మాజీ వైస్ చైర్మన్ పిల్లోడి విశ్వనాథం మరియు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఉపవాస దీక్షలో ఉన్న భక్తులకు పలహారా పంపిణీ చేశారు,గత 10 సంవత్సరాలుగా దిగ్విజయంగా కొనసాగుతున్న ఉచిత పండ్ల పంపిణీ కార్యక్రమం కొనసాగిస్తూ వస్తున్నారు. ఈ సందర్భంగా మాజీ చైర్మన్ మరియు మాజీ వైస్ చైర్మన్ మాట్లాడుతూ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో, సుభిక్షంగా ఉండాలని దేవదేవుడైన ఆ పరమశివుని వేడుకున్నాము అని అన్నారు,ఈ కార్యక్రమంలో రాణా ప్రతాప్ యూత్ సభ్యులు, మరియు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ఎం.ఎల్. సి.ఎన్నికల పోలింగ్ కొరకు సర్వం సిద్ధం

## జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్



ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 26 : మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ నియోజకవర్గాల పట్టభద్రులు, ఉపాధ్యాయ శాసనమండలి సభ్యుల ఎన్నికలలో భాగంగా ఈ నెల 27న పోలింగ్ నిర్వహణ కొరకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, మంచిర్యాల,బెల్లంపల్లి రాజస్వ మండల అధికారులు శ్రీనివాస్ రావు,హరికృష్ణ లతో కలిసి జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో గల డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుండి బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామాగ్రి పంపిణీ ప్రక్రియను పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ శాసనమండలి సభ్యుల ఎన్నికల పోలింగ్ ఈ నెల 27వ తేదీ ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతుందని, ఇందు కొరకు ర్యాండమైజేషన్ లో కేటాయించిన ప్రకారంగా ఎన్నికల సామాగ్రిని పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు.ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించేందుకు జిల్లాలో 60 మంది ప్రిసైడింగ్ అధికారులు, 181 మంది పోలింగ్ అధికారులు,25 మంది సూక్ష్మ పరిశీలకులను నియమించడం జరిగిందని తెలిపారు.పోలింగ్ రోజున పట్టభద్రుల ఎన్నికలో 19 వేల 41 మంది పురుషులు,11 వేల 880 మంది మహిళలు, ఉపాధ్యాయుల ఎన్నికలో 999 మంది పురుషులు, 665 మంది మహిళలు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారని, జిల్లాలో ఉపాధ్యాయ ఎం.ఎల్.సి. ఎన్నిక కొరకు 18 పోలింగ్ కేంద్రాలు, పట్టభద్రుల ఎం.ఎల్.సి.ఎన్నిక కొరకు 40 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా ఇందులో 8 కామన్ పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు.ఎన్నికల విధులు కేటాయించబడిన అధికారులు,సిబ్బంది తమ విధులు బాధ్యతాయుతంగా నిర్వహించాలని, జిల్లాలో ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేలా సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 48 గంటల నిబంధన పకడ్బందీగా అమలు చేయాలి

## జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్

**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 26 :** ఈ నెల 27న,మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గాల శాసనమండలి సభ్యుల ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఉన్నందున ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 48 గంటల నిబంధనను పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు.బహిరంగ సభలు, సమావేశాలు, ఊరేగింపులు జరుపకూడదని తెలిపారు. ప్రచార,ప్రసార,ఇతర ఉపకరణాలు,ఇంటింటి సందర్శన, ఇతర ప్రచార కార్యక్రమాలు అన్ని నిబంధనకు లోబడి ఉంటాయని,ఎక్సైజ్ చట్టం ప్రకారం అన్ని పరిమితులు అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద ప్రచారం, మొబైల్ ఫోన్ల వాడకం, వాహనాలపై ఆయుధాలతో వెళ్లడం, రవాణా కోసం ఉపయోగించే ఏ రకమైన వాహనం ద్వారానైనా ఓటరును ప్రత్యక్షంగా, పరోక్షంగా పోలింగ్ కేంద్రానికి / బయటికి తీసుకువెళ్లే ఏర్పాట్లు చట్టరీత్యా నేరమని తెలిపారు. పోలింగ్ ప్రాంతంలో 5 కంటే ఎక్కువ మంది వ్యక్తులు కలిసి ఉండడాన్ని నిషేధిస్తూ ఆంక్షలు జారీ చేయడం జరిగిందని,48 గంటల నిబంధన ఈ నెల 27న జరగనున్న పోలింగ్ ప్రక్రియ ముగిసే వరకు అమలులో ఉంటుందని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

# పేంటింగ్ యూనియన్ ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ పంపిణి



**ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గం రిపోర్టర్ ఫిబ్రవరి 26:** స్థానిక గోదావరి ప్రాంతంలో ఉచిత మజ్జిగ పంపిణి కర్యక్రమం చెయ్యడం జరిగింది.ఈ సందర్బంగా యూనియన్ ప్రెసిడెంట్ బోనగిరి దుర్గ ప్రసాద్ మాట్లాడుతూ...సంవత్సరానికి ఒక్కసారి వచ్చే మహా శివరత్రి పండగ ను పురస్కరించుకొని యూనియన్ అంతా కలసి భక్తులకు అందరికి ఎదో ఒక సాయం చేయాలనే ఉద్దేశం తో గత మూడు సంవత్సరాల నుండి ఇక్కడ ఉచిత మజ్జిగ పంపిణి చేస్తున్నాము అన్నారు. తరువాత వైస్ ప్రెసిడెంట్ కల్లేపల్లి విక్రమ్ మాట్లాడుతూ...అందరికి శివరత్రి శుభాకాంక్షలు తెలిపారు.అదేవిధంగా భక్తులు అందరూ పుణ్య స్నానము ఆచరించిన తరువాత అలసిపోయిన భక్తులు మజ్జిగ త్రాగి కొంచెం సేద తీర్చుకుంటారనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేస్తున్నామన్నారు.ఈ కార్యక్రమం లో వైస్ ప్రెసిడెంట్స్ బడుగు రాజేష్,కార్యదర్శి కొప్పుల నరేష్,చందు,కిరణ్, దర్మేందర్,శివ,కిరణ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# బుగ్గ శ్రీ రాజరాజేశ్వర స్వామి దర్శించుకున ఎంపీ గడ్డం వంశీ కృష్ణ,ఎమ్మెల్యే గడ్డం వినోద్ కుమార్



**ప్రజాబలం బెల్లంపల్లి నియోజకవర్గం రిపోర్టర్ ఫిబ్రవరి 26 :** మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీ కృష్ణ,బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్ తో కలిసి బుగ్గ శ్రీ రాజరాజేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు ఆలయ పూజారులు,ఎంపీ,ఎమ్మెల్యేలకు ఘన స్వాగతం పలికారు.భక్తులతో కలిసి హారతి కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా గడ్డం వంశీ కృష్ణ మాట్లాడుతూ... రాజరాజేశ్వర స్వామి అనుగ్రహం ప్రజలందరికీ లభించి,సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నాను.ఆలయ అభివృద్ధికి మా సహాయం నిరంతరం కొనసాగుతుంది అని తెలిపారు.

# మానవ హక్కుల పరిరక్షణ కోసం కృషి చేస్తా



**ప్రజాబలం ప్రతినిధి ఉప్పల్ నియోజకవర్గం ప్రతినిధి ఫిబ్రవరి 26:**మానవ హక్కుల పరిరక్షణ కోసం కృషి చేస్తానని నేషనల్ రైట్స్ మూవ్మెంట్ హ్యూమన్ రైట్స్ తెలంగాణ చైర్పర్సన్ షాబుద్దీన్ అన్నారు. నేషనల్ రైట్స్ మూవ్మెంట్ హ్యూమన్ రైట్స్ తెలంగాణ రాష్ట్ర చైర్మన్ గా షాబుద్దీన్ నియమితులయ్యారు. ఈ మేరకు నాచారం లో కార్యాలయాన్ని నేషనల్ చైర్మన్ ఇండియా రాజేష్ కన్న ప్రారంభించి అనంతరం షాబుద్దీన్ కి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శాబుద్దిన్ మాట్లాడుతూ తనపై నమ్మకం తో తెలంగాణ రాష్ట్ర చైర్మన్ నియమించిన వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మానవ హక్కుల పరిరక్షణ కోసం కృషి చేస్తానని అన్నారు. ప్రతి ఒక్కరు తమ హక్కులు విధులను తెలుసుకోవాలని జీవించాలన్నారు. మానవ హక్కులకు భంగం కలిగితే సమస్యలు తీర్చడానికి తమ అసోసియేషన్ ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ మహిళా విభాగం అధ్యక్షురాలు నూర్జహాన్ బేగం, మహమ్మద్ సాహిల్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు

# గోదావరి పుణ్య స్థానాలతో శ్రీ రాజరాజేశ్వర దర్శించుకున్న భక్తులు



**మంచిర్యాల జిల్లాలోని దండేపల్లి ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 26 :** మంచిర్యాల జిల్లాలోని దండేపల్లి మండలంలోని గూడెం గోదావరి,లక్షెట్టిపేట గోదావరి,ముల్కల తీరాన, మంచిర్యాల గోదావరి తీరాన, ఇందారం గోదావరి తీరాన,చెన్నూర్ గోదావరి తీరాన,భక్తులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని,గోదారి తీరాన ఉన్న శ్రీ రాజరాజేశ్వర స్వామి దర్శించుకున భక్తులు,దగ్గరలో ఉన్న గూడెంలోని,సాయిబాబా, సత్యనారాయణ స్వామి దర్శించుకున్న భక్తులు,వేలాలలోని మల్లన్న స్వామి భక్తి చేతలతో,కిలో మీటర్ దురాన క్యూ లైన్ లో ఉండు అలాంటి అలర్లు,జరగకుండా భక్తిశ్రద్ధలతో శ్రీ రాజరాజేశ్వర స్వామి దర్శించుకున భక్తులు,భక్తులకు ఎలాంటి గొడవలు,అల్లర్లు, జరగకుండా పోలీస్ సిబ్బంది వీరికి ఎంతో సాయం చేశారు,మండల శాఖ,మున్సిపాలిటీ,వారు దగ్గర వుండి పొరపాట్లు జరగకుండా, చూసుకోవడం జరిగింది.

# డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు



**ఆదిలాబాద్ ప్రజాబలం ప్రతినిధి:**ఆదిలాబాద్ భారత ఎన్నికల సంఘం మెదక్, నిజామాబాద్, అదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల, ఉపాద్యాయ నియోజకవర్గ శాసన మండలి ఎన్నికల సందర్భంగా బుధవారం టిటిడిసి లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను, జిల్లా కలెక్టర్ రాజర్షి షా పరిశీలించారు. ఈ సందర్భంగా పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు జిల్లా కేంద్రంలోని టిటిడిసి లో (టెక్నికల్ ట్రైనింగ్ డెవలప్మెంట్ సెంటర్ ) లో పోలింగ్ సామాగ్రి డిస్ట్రిబ్యూషన్ కేంద్రం లో ఏర్పాటు చేసిన ప్రతీ కౌంటర్లను పరిశీలించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 27న ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహించనున్న నేపధ్యంలో ఎన్నికల సిబ్బందికి పోలింగ్ సామాగ్రి పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల సామగ్రి పంపిణీకి కౌంటర్లు ఏర్పాటు చేసి పోలింగ్ సిబ్బందికి ఏలాంటి ఇబ్బందులు కలగకుండా పోలింగ్ స్టేషన్ల వారీగా, సామగ్రిని పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్లో తాగు నీటి వసతి, భోజన వసతి కల్పించడం జరిగిందనీ, ఎన్నికల సిబ్బంది సామగ్రితో వారికి కేటాయించిన పోలింగ్ స్టేషన్కు వెళ్లేందుకు వాహనాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బ్యాలెట్ బాక్స్ లు తరలించేందుకు 6 క్లోస్డ్ బాడి వెహికల్స్ లో జీపీఎస్ డివైస్ అమర్చడం జరిగిందనీ, దీనివలన వెహికల్స్ గమ్యమార్గం లో ఎక్కడ ఉన్నాయో తెలుస్తుందని అన్నారు. ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు జరిగే ఎమ్మెల్సి ఎన్నికలు, ప్రభుత్వ, ఎన్నికల సంఘం ఆదేశాలు, సూచనల మేరకు పక్కాగా అమలు చేస్తూ ఎన్నికల నిర్వహణకు సిద్ధం అయినట్లు ఆయన తెలిపారు. జిల్లాలో మొత్తం (39) పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, (11418) మంది మేల్, ( 5110) మంది ఫిమేల్, మొత్తం (16,528) మంది ఓటర్లు జిల్లాలో ఉన్నారని తెలిపారు. ఎన్నికల సంఘం సూచనల మేరకు ఎన్నికల కేంద్రాలలో సీసీ కెమెరాలు, త్రాగు నీరు, విద్యుత్, టాయిలెట్స్, పారిశుద్ధ్యం తదితర సౌకర్యాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో వినోద్ కుమార్, ట్రైనీ కలెక్టర్ అభిగ్యాన్, తహసీల్దార్లు, ఎన్నికల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

# విజయ పేరును వాడుతున్నారు

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:**కొంతమంది ప్రైవేట్ డైరీ వారు విజయ పేరు తో తమ విజయ తెలంగాణ పాల ప్యాకెట్లను విక్రయిస్తూ చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని అలాంటి పాలను కొనుగోలు చేయవద్దని తెలంగాణ డైరీ డెవలప్మెంట్ కో-ఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం లాలాపేట్ లోని విజయ భవన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డైరీ ఎండి చంద్రశేఖర్ రెడ్డి తో కలిసి చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలు విజయ తెలంగాణ అని బ్రాండ్ ఉంటేనే పాలను కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎవరైనా తెలంగాణ నకిలీ పాలను డిస్ట్రిబ్యూటర్స్ వెండర్స్ కొనుగోలు చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఇప్పటికే తాము కోర్టును ఆశ్రయించడం జరిగిందన్నారు. ఇలాంటి నకిలీ విజయ పాల తో వచ్చిన ఉత్పత్తులను కొనుగోలు చేయవద్దని సూచించారు ఇవి ప్రజల ఆరోగ్యానికి సంబంధించినవి కాబట్టి తమ లోగోను పరిశీలించి కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు

# ఆధ్యాత్మిక విద్యా బోధన ఉచితంగా రాదు... ప్రభుత్వ కాజి జాఫర్ సాదిక్

ఆళ్లగడ్డ ఇహ పర లోకాలలో సాఫల్యం పొందేందుకు ప్రతి ఒక్క ముస్లిం సోదర సోదరీ మణులు ఆధ్యాత్మిక విద్యా కలిగి ఉండాలని ఆళ్లగడ్డ ప్రభుత్వ ఖాజి మహమ్మద్ జాఫర్ సాదిక్ పేర్కొన్నారు. బుధవారం ఆళ్లగడ్డ పట్టణంలోని డాక్టర్ రామలింగ రెడ్డి ఫంక్షన్ హాల్ లో హదియా ఇంటర్ నేషనల్ ఇనిస్టిట్యూట్ వారి అధ్వర్యంలో జిల్లా స్థాయి ఇస్లామిక్ ఆధ్యాత్మిక ప్రవచనాలు, ఖురాన్ సూక్తులు,ప్రవక్త మహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం వారిపై కీర్తనలు తదితర అంశాలపై జిల్లా స్థాయిలోని 12 మండలాలకు చెందిన ఇస్లామిక్ విద్యార్థిని విద్యార్థులకు పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆళ్లగడ్డ మండల ప్రభుత్వ ఖాజి మహమ్మద్ జాఫర్ సాదిక్, పుంగనూరు దారుల్ హుదా ప్రిన్సిపాల్ మౌలానా శర్ఫుద్దిన్,20వ వార్డు కౌన్సిలర్ హుసేన్ భాష,ఆపుస్మ ఆళ్లగడ్డ యూనిట్ అధ్యక్షుడు టి.అమిర్ భాష లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇస్లామిక్ ధార్మిక విద్యా ఉచితంగా రాదని పరలోకంలో ఉన్నత స్థానం పొందేలా బోధించే ఇస్లామిక్ ధార్మిక పండితులు(హాఫిజ్ , ఆలిం )లకు వేతనాలు సరిపడ చెల్లించి ఇస్లామిక్ విద్యను పొందాలని సూచించారు. అనంతరం పోటీలో ప్రతిభ చాటిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు ట్రోఫీలు అందజేశారు. అలాగే ప్రముఖ సామాజిక కార్యకర్త జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ బిరువాల భాష మాట్లాడుతూ ఇస్లామిక్ ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న హదియా ఇంటర్నేషనల్ ఇన్స్టిట్యూట్ వారు నిర్వహిస్తున్న ఇస్లామిక్ ధార్మిక కార్యక్రమాల వల్ల ఎంతోమంది తల్లిదండ్రులు తమ పిల్లలకు ఇస్లామియా విద్యతోపాటు ఇస్లామిక్ సాంప్రదాయాలు పద్ధతులు నేర్చుకొని సమాజానికి ఉన్నతమైన పౌరులను అందజేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా లోని పలువురు ఇస్లామిక్ ధార్మిక పండితులు మౌలానా ఇర్షాద్ అహ్మద్, హాఫీస్ సద్దాం హుస్సేన్, హాఫీస్ ఉస్మాన్ భాష, హాఫీస్ కందుకూరు సాదిక్ తదితర ఆలింలు, హాఫీజ్ లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



**గోషామహల్ ప్రజాబలం ప్రతినిధి:** గోషామహల్ అసెంబ్లీ నియోజక వర్గంలోని కట్టెల మండిలో కాశీవిశ్వనాధ్ ఆలయంలో శివరాత్రి సందర్భంగా శివలింగానికి అభిషేకం చేస్తున్న సీటీ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ ఎస్.ధన్‌రాజ్ సీనీయర్ కాంగ్రెస్ నాయకులు రాజ్‌కూమార్ తదితరులు పాల్గోన్నారు.





**గోషామహల్ ప్రజాబలం ప్రతినిధి:** మహా శివరాత్రి శుభ సందర్భంగా భజరంగ్ సేన తెలంగాణ అధ్యక్షుడు ఎన్.ఆర్.లక్ష్మణ్ రావు కుటుంబ సమేతంగా గౌలిగూడ అశోక్ బజార్‌లోని ఎల్లమ్మ ఆలయాన్ని సందర్శించి భక్తిశ్రద్ధలతో నవీన్ మహరాజ్ చేత అర్చన, పూజలు నిర్వహించారు. భగవంతుడు మరియు ఎల్లమ్మ దేవత యొక్క దైవిక ఆశీర్వాదాన్ని కోరుతూ, వారు అందరికీ శాంతి, శ్రేయస్సు కోసం ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో నీలేష్, నరేష్, ఛోటు తదితరులు పాల్గోన్నారు.

# వారణాసి విమానం ఆలస్యం..ప్రయాణికులు అందోళన

**ప్రజాబలం ప్రతినిధి:** రంగారెడ్డి శంషాబాద్ డొమెస్టిక్ ఎయిర్ పోర్ట్ లో ప్రయాణీకులు ఆందోళనకు దిగారు. వారణాసి వెళ్లేందుకు భక్తులు ఎయిర్ పోర్ట్ కు చేరుకున్నారు. బోర్డింగ్ పాస్ తీసుకొని లోపలికి వెళ్లారు. చివరి నిమిషంలో ఫ్లైట్ ఆలస్యం అంటూ ప్రకటించారు. దీంతో ప్రయాణికుల ఆగ్రహం వ్యక్తం చేసారు. స్పైస్ జెట్ ఎయిర్ లైన్స్ సిబ్బంది తో వాగ్వాదానికి దిగారు. ఎయిర్లైన్స్ సిబ్బంది సమాధానం చెప్పడంలేదు. ఉదయం 10 గంటలకు వెళ్లాల్సిన విమానం మధ్యహ్నం వెళ్ళాక పోవడం తో మండిపడ్డారు. వేయిల రూపాయలు పెట్టి టికెట్లు కొనుగోలు చేసామని ఆవేదన వ్యక్తం చేసారు. ప్రయాగ్ రాజ్ లో పుణ్య స్నానాలు ఆచరించడం చివరి రోజు కావడంతో ప్రయాణీకులు బారులు తీరారు. 48 వేల రూపాయలు పెట్టిన ఒక్కొక్క టికెట్స్ కొనుగోలు చేసామంటున్నారు ప్రయాణీకులు. మమ్మల్ని పట్టించుకొనే నాదుడు లేడంటూ ఎయిర్ పోర్ట్ లో హంగామా సృష్టించారు. ప్రత్నామ్యాయ ఎర్పాట్లు చేయాలని డిమాండ్ చేసారు.

## బీజేవైఎం రాష్ట్ర నాయకుడు రమణ సింగ్ ఆధ్వర్యంలో ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి జన్మదిన వేడుకలు

**ప్రజాబలం ప్రతినిధి:** మలక్ పేట ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి జన్మదిన వేడుకలు మలక్ పేట లోని పిన్ బదిరుల ఆశ్రమ పాఠశాలలో రమణ సింగ్ ఘనంగా నిర్వహించారు,కొండా విశ్వేశ్వరరెడ్డి సతీమణి డాక్టర్ కొండా సంగీత రెడ్డి హాజరై ఆశ్రమ చిన్నారుల మధ్యకేక్ కట్ చేశారు,అనంతరం చిన్నారులకు భోజనం ఏర్పాటు చేసి వడ్డించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశ్రమ చిన్నారుల మధ్య జన్మదిన వేడుకలు నిర్వహించడం ఆనందంగా ఉందని అన్నారు. ఆశ్రమంలో సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో బిజెపి నేతలు సుదీర్ రెడ్డి, ప్రవీణ్, సంపత్, సాయి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పల్ పిఎస్ పరిధి గాంధీ నగర్ లో దోపిడీ దొంగల హల్చల్...

**ఉప్పల్ ప్రజాబలం ప్రతినిధి:** గాంధీ నగర్ లోని నామన్ మార్కెటింగ్ హోల్ సేల్ కిరాణా షాపు షటర్ తొలగించి 7లక్షల రూపాయల నగదు దొచుకెళ్ళిన దోపిడీ దొంగలు. ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నామన్ మార్కెటింగ్ హోల్ సేల్ కిరాణా షాపును గ్యాన్ చండ్ శర్మ, రామ్ కిషోర్ అనే ఇద్దరు 8సంవత్సరాలనుండి గాంధీనగర్లో నడిపిస్తున్నారు. ఈ నెల శనివారం 22న రాత్రి 9 గంటలకు రామ్ కిషోర్ షాప్ క్లోజ్ చేసి వెళ్లారు. 23 ఆదివారం తెల్లవారుజామున 5:30 హమాలి రాజు అనే వ్యక్తి నుండి షట్టర్ ఓపెన్ చేసి ఉందని ఫోన్ రావడం జరిగింది..షాప్ కి వచ్చి చూసే వరకు షాపులోని ఉన్న ఏడు లక్షల రూపాయల నగదును దొంగలు ఎత్తుకెళ్లారు...22వ శనివారం తేది అర్ధరాత్రి తరువాత, ఆదివారం 23న తెల్లవారుజామున షట్టర్ తొలగించి గుర్తు తెలియని దుండగులు ఏడు లక్షలు చోరీ చేశారు..షాప్ లోకి వెళ్లే ముందు దొంగలు షాప్ ముందు ఉన్నటువంటి సీసీటీవీ ని ఉంది బెండ్ చేసి, ఒక వ్యక్తి లోపలికి ప్రవేశించాడు... దొంగ షాప్ లోనికి ప్రవేశించి, నగదు దొంగలిస్తున్నటువంటి దృశ్యాలు షాపులో ఉన్నట్టు సీసీ కెమెరాలు రికార్డు అయ్యాయి.గ్యాన్ చండ్ శర్మ ఉప్పల్ పోలీసులకు పిర్యాదు చేయగా, ఫిర్యాదు మేరకు సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా ఉప్పల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# పరమ శివుడి కృపా కటాక్షలు ప్రజలకు సిద్దించాలి

### : గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము
### మహాశివరాత్రి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే...
### ప్రజా శ్రేయస్సును కాంక్షిస్తూ... మహాదేవుని అభిషేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రాము



గుడివాడ ఫిబ్రవరి 26 పరమ శివుడి కృపా కటాక్షలు రాష్ట్ర ప్రజలకు సిద్దించాలని... ప్రజలందరినీ మహాదేవుడు చల్లగా చూడాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆకాక్షించారు. గుడివాడ పట్టణంలో ప్రసిద్ధిగాంచిన బంటుమిల్లి రోడ్డులోని శ్రీ భీమేశ్వర స్వామి వారి దేవస్థానంలో మహాశివరాత్రి పర్వదిన వేడుకల్లో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము బుధవారం ఉదయం పాల్గొన్నారు. ముందుగా పూర్ణకుంభంతో ఎమ్మెల్యే రాముకు వేద పండితులు స్వాగతం పలికారు. స్వామివారి కల్యాణ వస్త్రాలను శిరస్సుపై ఉంచుకొని వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ఎమ్మెల్యే రాము దేవస్థానంలో ప్రదక్షిణలు నిర్వహించారు. అనంతరం ప్రజల శ్రేయస్సును కాంక్షిస్తూ అభిషేక పూజల్లో ఎమ్మెల్యే రాము పాల్గొన్నారు.స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు ఎమ్మెల్యే రాము మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ గుడులవాడగా ప్రసిద్ధిగాంచిన గుడివాడలో ఎంతో వైభవంగా జరుగుతున్న మహాశివరాత్రి వేడుకల్లో పాల్గొనడం సంతోషకరమని హర్షం వ్యక్తం చేశారు. మహాదేవుని కరుణా కటాక్షాలు రాష్ట్ర ప్రజలు మరియు కూటమి ప్రభుత్వంపై ఉండాలని ఎమ్మెల్యే రాము ఆకాంక్షించారు. దేవస్థానం ఈవో కందుల గోపాలరావు, టిడిపి నాయకులు పట్టపు చిన్న, వేద పండితులు, పలువురు కూటమి నాయకులు, ఎమ్మెల్యే రాముతో కలిసి శివరాత్రి వేడుకల్లో పాల్గొన్నారు.

# రాజన్న సన్నిధిలో ఎమ్మెల్సీ కవిత



**ప్రజాబలం ప్రతినిధి:** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని ఎమ్మెల్సీ కవిత దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, మహాశివరాత్రి పర్వదినం రోజున దేశ ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానన్నారు. మహాశివరాత్రి రోజున వేములవాడ రాజన్న దర్శించుకోవడం పూర్వజన్మ సుకృతమన్నారు. వేములవాడ రాజన్నను ఆంధ్ర పాలకులు బదనాం చేశారని, రాజన్నను ఎవరు దర్శించుకుంటే వారి పదవి పోతుందని అపోహ తొలగిపోవాలన్నారు. కెసిఆర్ 10 ఏళ్ల పాలనలో సిరిసిల్ల జిల్లాను రాజన్న సిరిసిల్ల జిల్లాగా ప్రకటించారని, దేవాలయ అభివృద్ధి కోసం 30 ఎకరాల స్థలం, బద్ది పోచమ్మ ఆలయానికి 1ఎకరం స్థలాన్ని కూడా సేకరించిన ఘనత కేసీఆర్ దే అన్నారు. అలాగే వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధికి 250 కోట్ల రూపాయలు కేటాయించారని గుర్తు చేశారు. గుడి చెరువులో ఆగిపోయిన అభివృద్ధి పనులను పునరుద్ధరించాలన్నారు.

## రాయికల్ రామలింగేశ్వరం జాతరకు పోటెత్తిన భక్తులు

షాద్ నగర్ మహా శివరాత్రి సందర్భంగా రంగారెడ్డి జిల్లా ఫారూఖ్ నగర్ మండలం రాయికల్ గ్రామం లో వెలసిన మహా శివుడు ఉత్తర రామలింగేశ్వరం జాతర ఉత్సవాలకు భక్తులు వేలాది గా వచ్చి దర్శించుకుంటున్నారు.రంగారెడ్డి జిల్లా ఫరూఖ్నగర్ మండలం రాయికల్ గ్రామ శివారులోని పంచముఖ గుట్టపై వెలిసిన రామలింగేశ్వరుడిని స్వయంగా శ్రీ రామచంద్రుడే ప్రతిష్ఠించాడని అంటారు. ఉత్తర రామేశ్వరంగా ప్రసిద్ధి చెందిన ఈ ఆలయానికి ఘన చరిత్ర ఉంది. ఈ ఆలయంలోని శివలింగాన్ని శ్రీరాముడే ప్రతిష్ఠించినట్టు మాణిక్య ప్రభు చరిత్రలో పేర్కొన్నారు. అంతేకాదు, లింగాన్ని సాక్షాత్తు శ్రీ రామచంద్రుడే ప్రతిష్ఠించాడనడానికి నిదర్శనంగా దానిపై రామబాణం గుర్తు ఉంటుంది. లంకాధిపతి రావణాసురని సంహరించి సీతాసమేతంగా అయోధ్యకు తిరిగి వెళ్తూ దండకారణ్య ప్రాంతమైన రామేశ్వరంలోని బదిరీ వృక్షం కింద శివలింగాన్ని ప్రతిష్ఠించి పూజ చేసారని భక్తుల విశ్వాసం.

# మహాశివరాత్రి సందర్భంగా ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

**శ్రీశైలంప్రజాబలం ప్రతినిధి:** శ్రీశైల మహాక్షేత్రంలో మహాశివరాత్రి సందర్భంగా శివదీక్ష శిబిరముల వద్ద ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమం బుధవారం రోజు ఉదయం శ్రీశైలం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల మెడికల్ ఆఫీసర్ డాక్టర్.యమ్.స్వరూప ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. సుమారు 100 మందికి పైగా కాలినడకన వచ్చిన భక్తులకు ఆయుర్వేద వైద్యం ఉచితంగా అందించడం జరిగింది.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com